


ESTD: 1999
www.voodayam.com

# ఉదయం

ఖమ్మం | 20-06-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 332 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal
Follow us on




### బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు | విద్యార్థుల ఆత్మగౌరవం కోసమే 'ఎడ్యుకేషన్ కిట్లు

# విద్యా వికాసమే లక్ష్యం



- విద్యా రంగంపై రూ. 26,600 కోట్ల 'భవిష్యత్తు పెట్టుబడి'
- ప్రభుత్వ స్కూళ్లలో 'నో అడ్మిషన్' బోర్డులు
- ధ్వంసమైన విద్యా రంగాన్ని ప్రక్షాళన చేశాం
- ఒకటో తేదీనే విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు
- 22 రకాల వస్తువులతో కూడిన సమగ్ర కిట్లు
- 7 అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు

**హైదరాబాద్, జూన్ 19 (వుదయం) :** హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలలకు వెళ్లాలనే సంకల్పంతోనే ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల'ను పంపిణీ చేస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతంపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణతో, నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఘనమైన వేదికపై, రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

త్యాగాల పునాదులపై తెలంగాణ
ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ కేవలం భాషా ప్రయుక్త ప్రాంతంగానో, పరిపాలనా సౌలభ్యం కోసమో ఏర్పడలేదు. ఇది 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితం. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు" అని గుర్తుచేశారు.

> "దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది. అందుకే ధ్వంసమైన విద్యావ్యవస్థను పునరుద్ధరించడమే మా మొదటి ప్రాధాన్యత."
> సీఎం రేవంత్‌రెడ్డి

**గత పాలకుల నిర్లక్ష్యంతో వందేళ్ల నష్టం**
గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ తీవ్ర విధ్వంసానికి గురైందని సీఎం విమర్శించారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర విద్యా రంగానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితిని మార్చేందుకే సరికొత్త 'తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ'ని తీసుకువచ్చి, విద్యా శాఖ ప్రక్షాళనకు నడుం బిగించామని వివరించారు. విధ్వంసమైన విద్యా రంగాన్ని వికాసం వైపు నడిపించేందుకు బడ్జెట్‌లో ఏకంగా 8.5 శాతం నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.

**విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి!**
వెనుకబడిన తరగతుల (BC) విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం రూ. 26,600 కోట్లు ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. దీనిని తాము ఉచితంగా ఇచ్చే నిధులుగా భావించడం లేదని, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే అద్భుతమైన పెట్టుబడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక ఉదాహరణగా నిలిచిందని, అక్కడ అప్పుడే 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే స్థాయికి ప్రభుత్వ స్కూళ్లు చేరడం హర్షణీయమన్నారు. అలాగే, విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెబుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చినట్లే, ఇకపై విద్యార్థులకు కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే 'కాస్మోటిక్ ఛార్జీలు' నేరుగా చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

# అల్లు అర్జున్‌కు కోర్టు నోటీసులు

### 19 మందికి సమన్లు జారీ చేసిన నాంపల్లి కోర్టు



**హైదరాబాద్, జూన్ 19 (వుదయం) :** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. రాబోయే సోమవారం నాడు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 (11వ నిందితుడు)గా చేర్చిన సంగతి తెలిసిందే.

పోలీసుల ఛార్జిషీట్.. 23 మంది నిందితులు
ఈ దారుణ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపిన చిక్కడపల్లి పోలీసులు.. మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొంటూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

**అసలేం జరిగిందంటే..?**
2024 డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప 2' సినిమా బెనిఫిట్ షో సందర్భంగా భారీ ఎత్తున అభిమానులు, ప్రేక్షకులు తరలివచ్చారు. ఆ సమయంలో ఒక్కసారిగా తీవ్ర తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దురదృష్టకర ఘటనలో రేవతి అనే మహిళ ఊపిరాడక మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్ర గాయాలపాలయ్యాడు. భద్రతా లోపాలు, సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక ఉదాహరణగా నిలిచిందని, అక్కడ అప్పుడే 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే స్థాయికి ప్రభుత్వ స్కూళ్లు చేరడం హర్షణీయమన్నారు. అలాగే, విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెబుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చినట్లే, ఇకపై విద్యార్థులకు కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే 'కాస్మోటిక్ ఛార్జీలు' నేరుగా చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

# మమ్మల్ని అడ్డుకోలేరు



**పెద్దపల్లి, జూన్ 19 (వుదయం) :** తాము సింగరేణి కార్మికుల సమస్యలపై చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమాన్ని రాజకీయంగా అడ్డుకునేందుకే రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ప్రయోగించారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రభుత్వం ఎంతగా అడ్డుకోవాలని చూస్తే.. అంతకంటే రెట్టింపు బలంతో ప్రజా సమస్యలపై తాము ముందుకు సాగుతామని ఆమె స్పష్టం చేశారు.

'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గని లోపలికి వెళ్లి కార్మికులతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**కార్మికులకు రక్షణ, కనీస సౌకర్యాలు కల్పించాలి**
అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని, వారికి ఆధునిక యంత్రాలతో పాటు సరైన పనిముట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ హామీలు ఏమాయ్యాయి?**
ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలు చేసిందని, కానీ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని కవిత విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం, కార్మికుల పక్షాన తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు.

## మా హయాంలో రెప్పపాటు

# కరెంట్ పోలేదు



- 900 రోజులు దాటినా గ్యారెంటీలు ఏవి?
- గ్యారెంటీ కార్డుల కాలపరిమితి తీరినా..

**హైదరాబాద్, జూన్ 19 (వుదయం) :** హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలలకు వెళ్లాలనే సంకల్పంతోనే ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల'ను పంపిణీ చేస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతంపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణతో, నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఘనమైన వేదికపై, రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

త్యాగాల పునాదులపై తెలంగాణ
ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ కేవలం భాషా ప్రయుక్త ప్రాంతంగానో, పరిపాలనా సౌలభ్యం కోసమో ఏర్పడలేదు. ఇది 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితం. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు" అని గుర్తుచేశారు.

**గత పాలకుల నిర్లక్ష్యంతో వందేళ్ల నష్టం**
గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ తీవ్ర విధ్వంసానికి గురైందని సీఎం విమర్శించారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర విద్యా రంగానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితిని మార్చేందుకే సరికొత్త 'తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ'ని తీసుకువచ్చి, విద్యా శాఖ ప్రక్షాళనకు నడుం బిగించామని వివరించారు. విధ్వంసమైన విద్యా రంగాన్ని వికాసం వైపు నడిపించేందుకు బడ్జెట్‌లో ఏకంగా 8.5 శాతం నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.

**విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి!**
వెనుకబడిన తరగతుల (BC) విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం రూ. 26,600 కోట్లు ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. దీనిని తాము ఉచితంగా ఇచ్చే నిధులుగా భావించడం లేదని, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే అద్భుతమైన పెట్టుబడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక ఉదాహరణగా నిలిచిందని, అక్కడ అప్పుడే 'నో అడ్మిషన్' బోర్డు పెట్టే స్థాయికి ప్రభుత్వ స్కూళ్లు చేరడం హర్షణీయమన్నారు. అలాగే, విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెబుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చినట్లే, ఇకపై విద్యార్థులకు కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే 'కాస్మోటిక్ ఛార్జీలు' నేరుగా చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు



**జెనీవా:** సుదీర్ఘ కాలంగా సాగుతున్న ఉద్రిక్తతలకు, యుద్ధ వాతావరణానికి తెరదించేందుకు అమెరికాఇరాన్ మధ్య జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం జరగాల్సిన ఈ చర్చలు ప్రస్తుతానికి నిలిచిపోయినట్లు మధ్యవర్తిత్వం వహిస్తున్న స్విట్జర్లాండ్ అధికారికంగా ప్రకటించింది. ఒకవైపు చర్చల ఒప్పందం కుదిరిన కొద్ది గంటల్లోనే.. మరోవైపు ఇజ్రాయెల్‌హెజ్‌బొల్లా మధ్య పోరాటం మరింత ఉద్ధృతంగా మారడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది.

**లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. 16 మంది మృతి**
శాంతి చర్చల ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 16 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఇజ్రాయెల్ ఏకపక్షంగా జరిపిన ఈ దాడుల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఇరాన్.. ప్రస్తుతానికి ఈ శాంతి చర్చలకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు వెళ్లాల్సి ఉండగా.. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన చివరి నిమిషంలో తన విదేశీ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

**ఇరాన్ కొత్త డిమాండ్.. మధ్యవర్తుల ప్రయత్నాలు**
తిరిగి తాము చర్చల బల్ల ముందుకు రావాలంటే ఇజ్రాయెల్ తక్షణమే లెబనాన్‌పై దాడులను ముగించాలంటూ ఇరాన్ సరికొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఇందుకు తగిన హామీ ఇస్తేనే ముందడుగు వేస్తామని స్పష్టం చేసింది.

**లెబనాన్‌ను తగలబెట్టండి: ఇజ్రాయెల్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు**
మరోవైపు ఇజ్రాయెల్‌హెజ్‌బొల్లా సరిహద్దు పోరు తీవ్ర రూపం దాల్చింది. గురువారం జరిగిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా శాఖ మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "లెబనాన్ మొత్తాన్ని తగలబెట్టండి" అని సైన్యానికి వివాదాస్పద పిలుపునిచ్చారు. తమ సైన్యం, ప్రజలు ఇక ఎంతమాత్రం బలిదానాలకు సిద్ధంగా లేరని ప్రపంచానికి చాటిచెప్పేందుకే ఈ నిర్ణయమన్నారు. దీనికి మద్దతుగా.. ఈ సమస్య మాటలతో తీరేది కాదని, ఇక 'నిప్పు'తోనే సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ పేర్కొనడం పశ్చిమాసియాలో మరింత మంటలు రేపుతోంది.

# భారత సైన్యం పెద్ద మనసు

**శ్రీనగర్:** జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (LoC) వద్ద పొరపాటున భారత భూభాగంలోకి ప్రవేశించిన ఓ పాకిస్థాన్ యువకుడిని భారత సైన్యం గురువారం తిరిగి స్వదేశానికి అప్పగించింది. తాము నిర్బంధంలో ఉంచిన సమయంలో సదరు యువకుడిని ఎంతో గౌరవంగా, మానవతా విలువలతో చూసుకున్నందుకు గాను పాక్ అధికారులు భారత సైన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**టీట్‌వాల్ సెక్టార్ వద్ద అరెస్ట్**
సైనిక అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుకు చెందిన అసద్ ఖాన్ అనే యువకుడు గత వారం జమ్మూ కశ్మీర్‌లోని టీట్‌వాల్ సెక్టార్ వద్ద నియంత్రణ రేఖను దాటి భారత సరిహద్దుల్లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో అప్రమత్తమైన భారత సైనికులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అసద్ ఖాన్ భారత్ చేతికి చిక్కాడన్న వార్త తెలియగానే.. అతడిని సురక్షితంగా విడుదల చేయాలంటూ పాకిస్థాన్‌కు చెందిన పలువురు నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా భారత సైన్యాన్ని అభ్యర్థించారు. అనుమానాస్పదంగా ఏమీ లేకపోవడంతో విడుదల యువకుడిని కొద్ది రోజుల పాటు తమ ఆధీనంలో ఉంచుకుని విచారించిన ఆర్మీ అధికారులు, భద్రతా విభాగాలు తేల్చాయి.






# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏ ఐ పై శిక్షణ.

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్నా అక్క మెంటార్ షిప్ లో కార్యక్రమంలో భాగంగా కృతిమ మేధస్సు (ఏఐ) డిజిటల్ లెర్నింగ్ అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కాలేజీ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి పి .జానకి దేవి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆవిడ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థులు ఏఐ డిజిటల్ సాంకేతికతపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు.ఈ శిక్షణ విద్యార్థులకు ఆధునిక బోధన నైపుణ్యాలను అందిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి.జానకి దేవి గారు. శిక్షణలో పాల్గొని ఏఐ వినియోగం. డిజిటల్ సాధనలు. స్మార్ట్ తరగతి గదులు. ఆన్లైన్ విద్య అవసరాలు. ఆధునిక బోధనా విధానాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యంని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎం. దేవ సుగుణ రావు నోడల్ ఆఫీసర్గి. శ్రీమతి టి.మంజుల . .కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి పి.జానకి దేవి . ఈ ఈ ఈ.డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి శ్రీమతి ఇందిరా ప్రియదర్శిని అధ్యాపకులు విద్యార్థులు ఉత్సాహంగా.ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇసుక మాఫియా 'దూకుడు'.. కొంకల పేదల 'బేజారు'!



*** రాత్రింబవళ్లు భారీ వాహనాల అలికిడి.. నిద్రలేని రాత్రులు గడుపుతున్న ఎస్సీ కాలనీ**
*** ప్రకంపనల ధాటికి గోడలు బీటలు.. వర్షం వస్తే కుప్పకూలేలా మట్టి ఇళ్లు**
*** ప్రాణాలు పోయాక స్పందిస్తారా? కలెక్టర్, ఎస్పీలకు బాధితుల ఆర్తనాదం**

**అలంపూర్ జూన్ 19 (వుదయం కరస్పాండెంట్)**

అక్రమ ఇసుక రవాణా దందా కొంకల గ్రామంలోని పేద కుటుంబాల బతుకులను ఛిద్రం చేస్తోంది. తుమ్మిళ్ల నుంచి సాగుతున్న ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో మాఫియా రెచ్చిపోతోంది. భారీ ట్రిప్పర్లు గ్రామ వీధుల్లో సృష్టిస్తున్న ప్రకంపనల ధాటికి ఎస్సీ కాలనీలోని మట్టి ఇళ్ల పునాదులు కదులుతున్నాయి. గోడలు చీలికలు ఇచ్చి ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితికి చేరాయి. "అక్రమ రవాణా ఆపండి.. మా మట్టి ఇళ్లను కాపాడండి" అంటూ స్థానిక నాయకుడు కొంకల భీమన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఘోర ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఈనెల 21న పిల్లలమర్రిలో యోగా దినోత్సవ వేడుకలు

**మహబూబ్ నగర్ 19 (వుదయం ప్రతినిధి)**

మహబూబ్‌నగర్ జిల్లాకు మణిహారమైన 800 ఏళ్ల నాటి చారిత్రాత్మక పిల్లలమర్రి లో మహా వృక్షం కింద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు యోగ డాక్టర్ ఎం చౌహన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పిల్లల మర్రిలో యోగ నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణం అని జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరూ ఉదయం 6:00 గంటలకల్లా పిల్లలమర్రి ప్రాంగణానికి చేరుకుని, ఈ మహా యోగా సాధనలో పాల్గొని ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్యాన్ని సిద్ధం పజేసుకోవాలని డాక్టర్ బి ఎన్ వై ఎస్, పిజిడిహెచ్ఎం, డాక్టర్ ఎం సురేష్ చౌహాన్అండ్ యోగా డాక్టర్ హోలిస్టిక్ వెల్నెస్ కన్సల్టెంట్ ,జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఆయుష్ విభాగం వారు ఈ సందర్భంగా కోరారు.

# హరితహారం పేరుతో నాటి... విద్యుత్ అంతరాయం పేరుతో నరికివేత



*** విద్యుత్ అంతరాయం సాకుతో సంవత్సరాల వృక్షాల ధ్వంసం**
*** లోపాయికారి ఒప్పందం కారణామా?**
*** చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**దుబ్బాక, వుదయం (జూన్ 19) :**

ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి హరితహారంలో భాగంగా నాటిన, సంవత్సరాల నాటి పచ్చని వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు విచక్షణారహితంగా నరికివేశారు. విద్యుత్ వైర్లకు ఆటంకం అనే సాకుతో పెద్ద పెద్ద చెట్లను నరికి అమ్ముకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం గత కొన్నేళ్లుగా పచ్చని వాతావరణంతో కళకళలాడిన ధర్మారం గ్రామం, ఇప్పుడు చెట్ల నరికివేతతో ఎడారిని తలపిస్తోంది. విద్యుత్ అంతరాయాలకు ఇబ్బందులు ఉన్నాయని చెబుతూ, వైర్లకు సంబంధం లేని భారీ వృక్షాలను సైతం నరికివేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇది కేవలం నిర్వహణ చర్య కాదు, కొంతమంది అధికారుల లోపాయికారి ఒప్పందంతోనే చెట్లను నరికి లాభార్జన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీకి సంబంధం లేకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ నరికివేత జరిగిందా అంటూ చర్చ సాగుతోంది. సంవత్సరాలుగా మేము కాపాడుకున్న చెట్లను ఒక్కరోజులో నరికేసారు. ఇప్పుడు ఊరంతా నరికి వేసిన చెట్ల కొమ్మలు, దుంపలతో నిండిపోయిందన్నారు. గత ప్రభుత్వం హరితహారంలో లక్షలు ఖర్చుపెట్టి నాటిన మొక్కలు, ఏపుగా పెరిగిన తర్వాత నరికి వేయడంతో ప్రజా ధనం వృథా అయిందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.
వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, అనుమతి లేకుండా చెట్లు నరికిన అధికారులపై, అక్రమంగా విక్రయించిన వారిపై అటవీ సంరక్షణ చట్టం కింద చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం

**- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు -డా|| సిద్ధం ఉజ్వల్ రెడ్డి**




**కోహీర్ , జూన్ 19:**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా|| సిద్ధం ఉజ్వల్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి ఉత్సాహంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చారిత్రక పాద యాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడటమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఏకైక లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, మున్సిపల్ చైర్మన్ యూనూస్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జాఫర్, రంగా అరుణ్, జమిలాలోద్దీన్, అక్రమ్, జావిద్, జహీంగిర్, నిజాం, అతిక్, సర్పంచ్లు నరేష్, బ్రహ్మానంద రెడ్డి,సీనియర్ నాయకులు పట్లోళ్ళ శ్రీకాంత్ రెడ్డి,మోతిరాం,హర్షవర్ధన్ రెడ్డిలతో పాటు జహీరాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల ఇంచార్జులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**వుదయం, సిద్దిపేట (జూన్ 19)**



భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు .ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడని కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ దేశ భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.
దేశ ప్రజల సంక్షేమం కోసం మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రాహుల్ గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు పంది రాజు, మండల ఉపాధ్యక్షులు బెజ్జనమైన అనిల్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు బెజ్జనమైన ప్రవీణ్, మిద్దె సంతోష్, నాయకులు పాత్కుల వెంకటేశం, వడ్డే కిష్టయ్య, మిద్దె స్వామి, జంగపల్లి ఆంజనేయులు, మస్కూరి ఆంజనేయులు, పోతరాజు రవీందర్, స్వామి చరణ్ గౌడ్, టంకరి స్వామి, ఎర్రోళ్ల అర్జున్, కల్లెపు నరేష్, నాగులపల్లి నర్సింలు, నాగులపల్లి అనిల్, వడ్డే నర్సింలు, వడ్డే నాగరాజు, బ్యాగరి శేఖర్, కల్లెపు భాస్కర్, జంగపల్లి స్వామి, కుమార్, కరుణాకర్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**- సర్పంచ్ వేముల అరుణ రాజేశం**

**వుదయం, సిద్దిపేట (జూన్ 19)**



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచ్ వేముల అరుణ రాజేశం సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పెద్ది మల్లికార్జున్ అధ్యక్షతన అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ వేముల అరుణ రాజేశం, ఉప సర్పంచ్ రుద్రారం యాదగిరి, మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మండల రేణుక హాజరై చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి బాలబాలిక నాణ్యమైన విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలువురు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం – జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



**మహబూబ్‌నగర్ జిల్లా 19జూన్ (వుదయం బ్యూరో )**

మాదకద్రవ్యాల నిర్మూలన భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని డిఅడిక్షన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు మాదకద్రవ్యాల బారిన పడిన వారిని నేరస్తులుగా కాకుండా, సరైన మార్గదర్శకత్వం మరియు చికిత్స అవసరమైన బాధితులుగా చూడాలని పేర్కొన్నారు. సమయానికి చికిత్స, కౌన్సెలింగ్ మరియు కుటుంబ మద్దతుతో వారిని మళ్లీ సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని తెలిపారు. సెంటర్‌లో అందుతున్న సేవలను పరిశీలించి, ఆసుపత్రి వైద్యులతో సమావేశమయ్యారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురై చికిత్స కోసం ఎంతమంది వస్తున్నారు, వారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు, చికిత్స అనంతరం వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి, పునరావాస చర్యలు ఎలా కొనసాగుతున్నాయి వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్శనలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర, DSP రమణా రెడ్డి, సైకియాట్రి డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ రాజ్, RMO డాక్టర్ దుర్గా, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ పాల్గొన్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల డేటా సిద్ధం చేసుకోవాలి

**-- పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
**-- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జూన్ 19 (వుదయం కరస్పాండెంట్)**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల సమగ్ర డేటాను సంబంధిత శాఖల అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా నోడల్ అధికారి, మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ శృతి ఓజా వచ్చే వారం 99 రోజుల కార్యక్రమంపై రివ్యూ నిర్వహించేందుకు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10 అంశాలపై నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల పూర్తి వివరాలు,సంబంధిత మంచి ఫోటోలతో బుక్లెట్ మాదిరి తయారు చేయించాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఫోటో ఎగ్జిబిషన్, ఇతర ప్రదర్శనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ఈనెల 28న పోలియో దినం నిర్వహిస్తున్న సందర్భంగా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. చిన్నారులకు పల్స్ పోలియో వ్యాక్సిన్ వేయడంవలన ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, సిపిఓ పాపయ్య, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలియోపై 'చుక్కల' యుద్ధం!

**-- లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: కలెక్టర్ హెచ్చరిక**
**-- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ రక్షణ కవచం.. జూన్ 28న పల్స్ పోలియో సమరం**
**-- 29, 30 తేదీల్లో ఊరూరా జల్లెడ.. ఇంటింటికీ రానున్న ప్రత్యేక బృందాలు**

**గద్వాల జూన్ 19 (వుదయం బ్యూరో)**



జిల్లాను పోలియో రహితంగా తీర్చిదిద్దడమే పరమావధిగా యంత్రాంగం కదనరంగంలోకి దూకాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఐదేళ్లలోపు చిన్నారుల భవిష్యత్తుకు రక్షణ కవచంలా నిలిచే పల్స్ పోలియో మహోద్యమంలో ఎలాంటి అలసత్వాన్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు. డీఎంహెచ్‌వో శ్రీమతి సంధ్యాకిరణ్మయి అధ్యక్షతన జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొని, పంపిణీ వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జూన్ 28న (ఆదివారం) జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రత్యేక బూత్‌ల ద్వారా 05 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు ప్రకటించారు. ఆ రోజున రాలేకపోయిన వారి కోసం జూన్ 29, 30 తేదీల్లో ప్రత్యేక వైద్య బృందాలు ఊరూరా, వాడవాడలా జల్లెడ పట్టి.. ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేస్తారని వెల్లడించారు.
'ఒక్క చిన్నారి మిగిలినా.. శూన్యమే!'
"ఒక్క చిన్నారి కూడా మిగలడానికి వీల్లేదు.. ప్రతి ముంగిటకూ పోలియో రక్షణ చేరాలి" అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు అత్యంత సమన్వయంతో, యుద్ధప్రాతిపదికన పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిజన తండాలు, పట్టణ మురికివాడలతో పాటు వలస కూలీల కుటుంబాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, శాతశాతం లక్ష్యాన్ని సాధించాల్సిందేనని స్పష్టం చేశారు.సామాజిక యజ్ఞంలో భాగస్వాములు కావాలి: డీఎంహెచ్‌వో ఈ మహత్తర సామాజిక యజ్ఞంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, వారి భవితకు బంగారు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమర శంఖారావ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు, డీపీహెచ్ ఎన్‌వో వరలక్ష్మి సహా వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని, పల్స్ పోలియోను జిల్లాలో వంద శాతం దిగ్విజయం చేయడానికి కంకణబద్ధులయ్యారు.

# చిన్నారుల సంక్షేమమే లక్ష్యం..

**- అంగన్వాడీ అభివృద్ధికి తొలి నెల వేతనం విరాళంగా అందించిన సర్పంచ్ పర్స దేవరాజ్**

**వుదయం, సిద్దిపేట ( జూన్ 19)**



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయపల్లి గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పర్స దేవరాజ్ తనకు వచ్చిన తొలి నెల గౌరవ వేతనాన్ని గ్రామ అంగన్వాడీ కేంద్రం అభివృద్ధి కోసం విరాళంగా అందజేసి ఆదర్శంగా నిలిచారు.అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం ఆయన చెక్కును అందజేశారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో చేసిన ఈ సహాయాన్ని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ పద్మ మాట్లాడుతూ, చిన్నారుల సంక్షేమం కోసం సర్పంచ్ పర్స దేవరాజ్ చేసిన సహాయం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.గ్రామ అభివృద్ధితో పాటు బాలల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర ప్రజాప్రతినిధులకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా పథకాలు అందరికీ అందాలి

**మహబూబ్‌నగర్ జిల్లా 19జూన్ (వుదయం బ్యూరో )**




జిల్లా విద్యాశాఖ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా విజయలక్ష్మి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల శ్రేయస్సు వంటి పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని,ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం, ఉపాధ్యాయుల సమన్వయంతో బోధనను మెరుగుపరచడం, విద్యార్థుల హాజరు శాతం పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.జిల్లా విద్యాశాఖ సమన్వయంతో పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా కృషి చేయాలని, పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఎంఇఓ లక్ష్మణ్ నాయక్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అందె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

**దుబ్బాక, వుదయం (జూన్ 19):**



మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజున ప్రధానోపాధ్యాయులు పి. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రీప్రైమరీ, ఒకటవ తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కడారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఉచితంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మాట్ల పరశురాములు విద్యార్థులకు ఉచిత పలకలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రవీణ్, గ్రామ కార్యదర్శి యదగిరి ,ఉపాధ్యాయ బృందం, కృష్ణ, జాషువా, రాజేశ్వర్, చంద్రమౌళి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి:

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూన్ 19:-- వు దయం జిల్లా ప్రతి నిది**

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25వ తేదీ నుంచి బి ఎల్ ఓ లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని తెలిపారు.అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.
అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని, జిల్లా స్థాయిలో కూడా మరో రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, ఇంటింటి సర్వే సందర్భంగా బి ఎల్ ఓ లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# డీఈవో కుర్చీకి ఏబీవీపీ వినతి పత్రం అందజేత

**నారాయణపేట టౌన్ 19 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లాలో నెలకొన్న విద్యాసంస్థల సమస్యలపై ఏబీవీపీ నాయకులు స్పందించి జిల్లా విద్యా శాఖ అధికారికి వినతి పత్రం అందజేయడానికి వెళితే అక్కడ ఎవరు స్పందించకపోవడంతో విద్యాశాఖ అధికారి కుర్చీకి వినతి పత్రాన్ని అందజేసి నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం తెలిపారు.
తెలంగాణ వ్యాప్తంగా ఎం ఈ ఓ డి ఇ ఓల కొరత ఉన్న ప్రభుత్వం స్పందించటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట నగర శాఖ ఆధ్వర్యంలో కార్యాలయము ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ,ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ము కాస్తున్న ప్రభుత్వానికి విద్యార్థి లోకం తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ 27,000 వేల ప్రభుత్వ స్కూళ్లలో 23,000 వేల స్కూళ్లను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ఇంతియాజ్, శివ, వినయ్, చరణ్, వివేకానంద,తరుణ్, ఓంకార్, విష్ణు ,అభి, జస్వంత్, ఉదయ్, ఏబీవీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రగతి నగర్, జూన్ 19, (ఉదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ఆదేశాల మేరకు పునర్జన్ ఫార్మ ఎండీ, పునర్జన్ ఫౌండేషన్ అధ్యక్షులు, ప్రగతి నగర్ 276 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్ము వేంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) ఆధ్వర్యం లో ప్రగతి నగర్ సెంటర్ లో డైనమిక్ ఎనర్జిటిక్ లీడర్ రాయబరేలి మెంబెర్ ఆఫ్ పార్లమెంట్, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వbహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా నిజాంపేట సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని కేక్ కటింగ్, స్వీట్స్ పంపిణీ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, మేడ్చల్ జిల్లా ప్రధానకార్యదర్శి రావూరి మౌళీశ్వర రావు, మేడ్చల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి శ్రీకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్, ప్రవీణ్, కడియాల ఇందిర, శ్రీదేవి, కుంచపు రమ, గూడూరు మురళీ కృష్ణ, వరగాని వాసు, బండ్ల విజయకుమార్, మద్ది నారాయణరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఆది రెడ్డి, సందీప్ రెడ్డి, సురేంద్ర కుమార్, పర్వతిని అంజనీయ వర్మ, దాసరి మహేష్ కుమార్, అల్లాడి మహేష్, భాస్కరా చారి, తులసీదాస్, రామచంద్ర నాయక్, భాస్కర రెడ్డి, బల్వంత్ రెడ్డి, లక్షణ్, ప్రభాకర్ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, లోకనాథం, సత్య ప్రసాద్, మందలపు రమేష్, రతన్ రాజు, మహేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రూ.87 కోట్ల రోడ్ల పనుల ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా**



*** రూ.87 కోట్ల విలువైన సీఆర్ఎఫ్ (CRF) రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**
*** తెలంగాణకు మూడు బులెట్ ట్రైన్ కారిడారు గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీం పట్నం నియోజకవర్గాల్లో చేపట్టిన, పూర్తయిన సుమారు రూ.87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (CRF) రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, తిమ్మాపూర్ గ్రామానికి వివిధ ప్రాంతాలతో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబా .•తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించబడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ల ఏర్పాటుకు ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ.5 లక్షల కోట్లు కాగా, భూసేకరణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది రూ.10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే మరియు డీపీఆర్ (DPR) పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయని, ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల కొన్ని రహదారి పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి, ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాలకు సంబంధించిన అన్ని రహదారి నిర్మాణ పనులను తక్షణమే సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరం



**- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

**బాచుపల్లి, జూన్ 19, (ఉదయం ప్రతినిధి )**

,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సాయిబాబా నగర్, బాచుపల్లి ప్రాంతాలకు చెందిన అంబుగోల ప్రసాద్, మేకల రుద్రమదేవి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన హన్మంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో బాధితులకు వైద్య చికిత్స శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6,00,000/ (ఆరు లక్షల రూపాయలు) మంజూరు చేయించి ఎల్ ఓ సి పత్రాలను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారి జీవితాల్లో ఆశను నింపుతోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



**- ఎమ్మెల్యే, విప్, కె.పి. వివేకానంద.**

**కుత్బుల్లాపూర్, జూన్ 19, (ఉదయం ప్రతినిధి ),**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని 274వ డివిజన్, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న విస్పర్ వ్యాలీ కాలనీ నూతనంగాఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించి కాలనీ అభివృద్ధి కోసం తన సంపూర్ణ సహకారం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయం, వీధి దీపాల కొరత తదితర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి ఆయా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, 20వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సంధ్యా రాణి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి నాగమణి, సోషల్ మీడియా అధ్యక్షుడు విద్యాసాగర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి లీలావతి, సంయుక్త కార్యదర్శి పృథ్వీ కుమార్, కోశాధికారి రామకృష్ణ బండి, సత్యం వ్యాలీ వాసులు చిట్టిబాబు, ప్రసాద్, రామ్ ప్రసాద్, అశోక్, రదీప్, రవితేజ
తదితరులు పాల్గొన్నారు.

## మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**శేర్లింగంపల్లి: 19 (ఉదయం ప్రతినిధి)**

శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోగల కొండాపూర్ డివిజన్లో యువ నాయకుడు మిరియాల పీతం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి దశ దిశా అని ఆయన అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో ప్రతి ఒక్కరం అకుంఠిత దీక్షతో ముందడుగు వేస్తావని ఆయన తెలిపారు. అంతేకాకుండా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని రాజీవ్ గాంధీ ఆశయాలను నెరవేర్చడం కోసం అందరం కలిసికట్టుగా ముందడుగు వేస్తామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కొండాపూర్ గవర్నమెంట్ హాస్పటల్ లో పెద్ద ఎత్తున రోగులకు పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్లో వైద్యులు రోగుల పట్ల చూపిస్తున్న ఆదరణను మరియు సేవా భావాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఇక్కడికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ చంద్ర కృష్ణ నీ ఘనంగా సన్మానించారు. రానున్న కాలంలో షేర్ లింగంపల్లి నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, ప్రజలందరికీ చేదుడు వాదోడుగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరదేశి నాయుడు, విష్ణుమూర్తి ,శ్రీను, చలం, కృష్ణమూర్తి, రామాంజనేయులు, త్రిలోచన, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ



**రామచంద్రాపురం**

రామచంద్రపురం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సేల్స్‌ఫోర్స్ సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని సేల్స్‌ఫోర్స్ ప్రతినిధులను ఆమె కోరారు. దీనికి స్పందించిన సంస్థ ప్రతినిధులు పాఠశాల అవసరాలను పరిశీలించి అభివృద్ధి పనులను త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సేల్స్‌ఫోర్స్ ఉద్యోగులు కార్ల్ లార్సినా, అర్జున్ సాహో, పాండురంగా రావు రాళ్లపల్లి, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, డైరెక్టర్ శామ్యూల్ జాన్, సత్యవతి, సరిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న సేల్స్‌ఫోర్స్ సంస్థ ఉద్యోగులను పలువురు అభినందించారు.

## విద్యుత్‌నగర్ నీటి సమస్యపై జోనల్ కమిషనర్‌కు వినతి




**రామచంద్రాపురం**

భారతీనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి కాలనీలోని సమస్యలను వివరించారు.గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న విద్యుత్‌నగర్ కాలనీ ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చినందున, కాలనీలోని బోర్‌వాటర్, మంజీరా నీటి సరఫరా వ్యవస్థలను హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అమీన్‌పూర్ సర్కిల్‌కు అప్పగించి, ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ంతోష్‌తో సమన్వయం చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా భారతీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



**– ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**రామచంద్రాపురం,**

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, వారి కుటుంబాల అభ్యున్నతికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల

## గుమ్మడిదలలో రూ.3.12 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**గుమ్మడిదల, జూన్ 19(ఉదయం) :**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రూ.3.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, పాలకవర్గ సభ్యులతో కలిసి వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.అనంతరం గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతిధులు, నాయకులు, సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన మున్సిపాలిటీగా ఏర్పడిన గుమ్మడిదలలో అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక పరిశ్రమలు, సంస్థల నుంచి లభించే సీఎస్ఆర్ నిధులను కూడా అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు




## నక్ష సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తాం

**- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**
**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**
**- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్**

**నాగర్ కర్నూల్ జూన్ 19 (ఉదయం ప్రతినిధి)**



నక్ష సర్వే, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న వినతులు, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే కార్యక్రమాన్ని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధతతో పని చేస్తుందని వివరించారు.గ్రామాలు, మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సాధిస్తామని, సర్వే నిర్వహణకు అవసరమైన పరికరాలు, సాంకేతిక సామగ్రి, ఇతర వసతులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమకూర్చుకునే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.సాదా బైనామాపై ప్రత్యేక దృష్టి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేలా జిల్లాలో చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను కూడా పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ తెలిపారు.నక్ష సర్వే, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి వినతులు, రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులు, భూ రికార్డుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తామని, అధికారులకు మరింత కఠినమైన ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ వివరించారు.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే రెవెన్యూ శాఖ ప్రధాన లక్ష్యంగా జిల్లా రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**నారాయణపేట టౌన్ 19 (ఉదయం ప్రతినిధి)**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, వాటి తిరిగి స్వీకరణ, ఓటరు వివరాల ధృవీకరణ తదితర ప్రపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తామని, ప్రతి దశను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను ఆర్డీవో రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



"నా భార్య వల్లే నేను బతికున్నా...
మైదానంలో నేను చాలా దూకుడుగా ఉంటా. అలాంటి నాకు 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొని తిహార్ జైల్లో ఉన్నప్పుడు చీకటి రోజులు గడిపా. క్షణక్షణం నరకంగా అనిపించేంది. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. కానీ నా భార్య భువనేశ్వరి దేవి వల్లే ఆ ఆలోచనను విరమించుకున్నా. ఇప్పుడీ విధంగా మీ ముందు బతికున్నా."

**- శ్రీశాంత్, భారత మాజీ క్రికెటర్**

## వే'మన' పద్యం

**ఆత్మశుద్ధి లేని యాచారమది యేల**
**భాండశుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలరా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**



## సంపాదకీయం

# ఆవు పేరిట రాజకీయం

చిన్నప్పుడు పాఠశాలలో ఆవు వ్యాసం రాయించేవారు. అంటే ఆవును వర్ణించాలి. ఆవుకు నాలుగు కాళ్లు, రెండు చెవులు, రెండు కొమ్ములు, ఒక తోక ఉండును. గడ్డి తింటుంది. పాలు ఇస్తుంది, ఇలా సాగేది. ఆ తర్వాత ఆవు వ్యాసానికి బదులు పరీక్షలో విమానం గురించి రాయమంటే, విద్యార్థికి దాని గురించి తెలియక, విమానం ఆకాశంలో ఎగురుతుంది. దాని కిటికీ నుండి చూస్తే పచ్చని మైదానాలు కనిపిస్తాయి. అక్కడ ఆవులు మేత మేస్తుంటాయి. అవి తెల్లగా ఉంటాయని... ఇక వాడికొచ్చిన ఆవు వ్యాసం రాసేస్తాడు. ఇప్పుడు సంఘ్ పరివార్, బీజేపీలది అదే మాదిరి తయారయింది. ఒకటే మూసపోసినట్లు నినాదాలిచ్చి, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు పూనుకుంటున్నారు. కానీ కథ ఇప్పుడు అడ్డం తిరిగింది. ఇంత కాలం, ఆవు పవిత్ర దేవత అని, హిందువుల ఆరాధ్యమని, గోమాత అని, ఏ మాంసమున్నా గోమాంస మేనని ముస్లింలపై దాడులు, చంపడాలు చేశారు. అక్లాక్ ను అలానే గోమాంసం ఇంట్లో ఉందని చంపారు. గోవుల రవాణా చేస్తున్న ట్రక్కులను అడ్డగించి డ్రైవర్లను కొట్టి చంపారు. గోవును హిందూ ముస్లింల మధ్య తగాదాగా సృష్టించేందుకు ఒక ప్రచార ఆందోళన చేశారు. మొన్న బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం పెద్దలే, వారి సమూహాలకు పిలుపునిచ్చారు. బక్రీద్ సందర్భంగా గోవులను వధించవద్దని, హిందువులు దానిని పవిత్రంగా భావించి పూజిస్తారు కనుక ఈ నిర్ణయం చేశామన్నారు. కొనటం, అమ్మటంలో కూడా పాల్గొనవద్దని పిలుపునిచ్చారు. వారు చెప్పినట్లుగానే ముస్లింలు గోవధ మానేశారు. అంతేకాదు, కొనటమూ మానేశారు. అయితే గోవులను పెంచి అమ్ముతున్నవాళ్లు ఎక్కువగా హిందువులే ఉన్నారు. వట్టిపోయిన ఆవులను కూడా కొనటానికి ఎవరూ లేక, కలకత్తాలో పెద్ద ఆందోళనకే దిగారు ఆ అమ్మకందారులు. నూతన ముఖ్యమంత్రి గోవుల కొనుగోళ్లపై నిషేధం, వధ నిషేధం విధించాడని తెలిసి, సువేందు అధికారికి వ్యతిరేకంగా హిందువులే ధర్నాలు చేశారు. మా బతుకుదెరువు పోయిందని, ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని లబోదిబోమన్నారు. ఉత్తరప్రదేశ్ లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. గోమాంసాన్ని, బీఫ్ ఎగుమతి చేస్తున్న పెద్ద పెద్ద కంపెనీలు ఉత్తరప్రదేశ్ లోనే ఎక్కువగా ఉన్నాయి. అందులో టాప్ పన్నెండు కంపెనీల యజమానులు ముస్లింలే కాదు. అందరూ హిందువులే! కొన్ని వందల కోట్ల, వేలకోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. బీఫ్ కంపెనీల దగ్గర కోట్లాది రూపాయలు చందాలు తీసుకున్న బీజేపీ వాళ్లు ఏమీ మాట్లాడలేక పోయారు. ముస్లిం పెద్దలు ఆవును జాతీయ జంతువుగా ప్రకటించి, గోవధను నిషేధించమని కోరారు. ఈ డిమాండ్ పెద్ద ఎత్తున ప్రచారంలోకి తెచ్చారు. ఇక బీజేపీ ప్రభుత్వానికి గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బెంగాల్ ప్రాంతాల్లో పనికి రావనుకున్న ఆవులను కొనేవారు లేక, వాటిని సంరక్షించే స్తోమత లేక, ఎండకు ఎండి చనిపోయిన ఆవులు ఎన్నో సోషల్‌మీడియాలో వార్తలుగా వచ్చాయి. ఏం చేయాలో అర్థం కాని యోగులు, బెంగాల్ మంత్రులు ఒక ఉపాయాన్ని కనిపెట్టారు. పద్నాలుగేండ్ల వయసు దాటాక గోవులను వధించవచ్చని, సర్టిఫికేట్ తీసుకుని అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టవచ్చని సెలవిచ్చారు. అదేమిటి? గోవు మాత అయినప్పుడు, పూజించే గోవు వయసును బట్టి పూజించడం, లేదా వధించడం నిర్ణయిస్తారా? అంటే ముసలాళ్లయిన తల్లిదండ్రులనూ బయటకి గెంటేయటమేనా? ''ఆవుతో మాది జన్మజన్మల బంధం, గోమాతను పూజిస్తాము. ఆవు మాకు తల్లి లాంటిది. దీన్ని ప్రకటించాల్సిన అవసరం లేదు'' అని యోగి సన్నాయి నొక్కులు నొక్కారు. మరి గోవధను నిషేధించమంటే, ఉలుకూ లేదు, పలుకూ లేదు. ''ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కానీ, దేశవ్యాప్తంగా గోవధను నిషేధించాలని కానీ ఎలాంటి ప్రతిపాదన లేదు'' అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రకటించారు. ఇది వీరి అసలు రూపం. గోవును రక్షించాలన్న కోరిక వీరికి అసలే లేదు. గోవుపై భక్తి అలా ఉంచి ప్రేమ, దయ అసలే లేదు. వీరి నాటకాలన్నీ చందాలు పోగేసుకోవటమే కానీ, గోవు పేరు చెప్పి మతతత్వాన్ని పెంచి మనుషులను విభజించి, రాజకీయ ప్రయోజనం పొందటమే అనేది సుస్పష్టం. మొదటి నుండి గోవు హిందువులకు, మరీ బ్రాహ్మణులకు పవిత్రమైనదని, దానిని గతంలో వధించలేదని, ఆవు మాంసం తినలేదని ఫోజులు పెట్టి చెబుతుంటారు. చాలామంది నమ్ముతారు. అదంతా ఒట్టి భ్రమ. మనుస్మృతి, రుగ్వేదం, బృహదారణ్యకోపనిషత్తులు చదివినా, ప్రముఖుల రాతలు చదివినా అసలు విషయాలు తేటతెల్లమవుతాయి. యజ్ఞం చేస్తున్న వాళ్లు అతిథులకు సోమరసాన్ని, ఎద్దు మాంసాన్ని వండించి పెట్టాలని ఉంది. ప్రసిద్ధ భారతీయ తాత్వికుడు స్వామి వివేకానంద రచనలలో ''ఒకప్పుడు భారతదేశంలో గోమాంస భక్షణ చేయని బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే కాదు''అని చెప్పారు. చరిత్ర తిరగేస్తే అనేక వాస్తవ విషయాలు బయట పడతాయి. చరిత్రను కూడా వక్రీకరించడం, మతోన్మాదాన్ని సృష్టించడం, దాని ద్వారా రాజకీయ ప్రయోజనాన్ని పొందడమే ఈ కాషాయుల అసలు లక్ష్యంగా కనబడుతున్నది.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ముంచుకొస్తున్న ముప్పు




2026 జూన్ 4న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకడం వ్యవసాయం, తాగునీరు, సాగునీరు , జీవనోపాధి కోసం వర్షాల పై ఆధారపడే కోట్లాది భారతీయులకు ఉపశమనం కలిగించాల్సింది. కానీ, అది ఆందోళనలను మరింత పెంచింది. సాధారణ తేదీ కంటే మూడు రోజులు ఆలస్యంగా, భారత వాతావరణ శాఖ అంచనా వేసిన తేదీ కంటే తొమ్మిది రోజులు ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించాయి. అంతకంటే ముఖ్యంగా, దేశవ్యాప్తంగా వర్షపాత నమూనాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉన్న శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం నీడలో ఇవి ప్రారంభమయ్యాయి.

ఐఎండీ తన రుతుపవనాల అంచనాను దీర్ఘకాల సగటులో తొంభై శాతానికి తగ్గించింది. అంతేకాకుండా లోటు లేదా తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం అరవై శాతంగా పేర్కొంది. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ సహా అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అభివృద్ధి చెందుతున్న ఎల్ నినో చరిత్రలోనే అత్యంత బలమైన వాటిలో ఒకటిగా మారే అవకాశం ఉందని, 202627 శీతాకాలం వరకు కొనసాగవచ్చని హెచ్చరించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న ముందుకొస్తోంది: సూపర్ ఎల్ నినోను ఎదుర్కొనేందుకు భారత్ తగినంతగా సిద్ధమైందా?

1987, 2002, 2009, 2015 సంవత్సరాల్లో భారత్ తీవ్ర ఎల్ నినో కరువులను ఎదుర్కొంది.ఆ సందర్భాల్లో వ్యవసాయ ఉత్పత్తి తగ్గింది, నీటి వనరులు క్షీణించాయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది, ఆహార ధరలు పెరిగాయి. అయినప్పటికీ విపత్తు నిర్వహణలో ముందస్తు చర్యల కంటే ప్రతిస్పంద నాత్మక విధానాలే ఇప్పటికీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతోంది కానీ ముందస్తు ప్రణాళికలు అమలు కావడం లేదు. సూపర్ ఎల్ నినో అనేది ఊహించని విపత్తు కాదు. ఆధునిక శాస్త్రీయ పరిశీలనల ద్వారా దాని ప్రభావాలను నెలల ముందే అంచనా వేయవచ్చు. అందువల్ల సిద్ధతలో వైఫల్యం కేవలం వాతావరణ సమస్య మాత్రమే కాదు, పాలనా వైఫల్యంగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద బలహీనతల్లో నీటి నిర్వహణ ఒకటి. దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులు, వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు, నీటి సంరక్షణ పథకాలపై భారీ పెట్టుబడులు పెట్టినా దేశం ఇప్పటికీ రుతుపవనాలపై అత్యధికంగా ఆధారపడుతోంది. దేశంలోని సాగుభూమిలో సగానికి పైగా ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. అనేక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు నిరంతరం పడిపోతు న్నాయి. వర్షపాతం గణనీయంగా తగ్గితే జలాశయాలు పూర్తిస్థాయిలో నిండకపోవచ్చు. దీంతో అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. దురదృష్టవశాత్తు, పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ ఇప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదు. సంప్రదాయ చెరువులు, కుంటలు ఆక్రమణలు, నిర్లక్ష్యంతో నశిస్తున్నాయి. భారత్‌కు ఏటా భారీ వర్షపాతం లభిస్తున్నప్పటికీ, అందులో చిన్న భాగాన్నే సమర్థవంతంగా నిల్వ చేసుకోగలు గుతోంది. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని వ్యవసాయ రంగమే అత్యధికంగా అనుభవించాల్సి ఉంటుంది. ఖరీఫ్ పంటల విజయవంతమైన సాగు సమయానికి, సమానంగా కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుంది. రుతుపవనాల ఆలస్యం, దీర్ఘకాలిక పొడి విరామాలు, అస్థిర వర్షపాతం కారణంగా వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు, పత్తి వంటి పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం గురించి సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నప్పటికీ, కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికీ అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు కొనసాగుతోంది. మరో ప్రధాన ఆందోళన తీవ్రమైన వడగాలుల ప్రమాదం. బలమైన ఎల్ నినో పరిస్థితులు సాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలిక వేడి తరంగాలకు కారణమవు తాయి. గత కొన్ని సంవత్సరాల్లో భారత్ రికార్డు స్థాయి వడగాలులను అనుభవించింది. ఇవి ప్రజారోగ్యం, శ్రమ ఉత్పాదకత, విద్యుత్ డిమాండ్‌పై తీవ్రప్రభావం చూపాయి. కొన్ని నగరాలు హీట్ యాక్షన్ ప్లాన్లను రూపొందించినప్పటికీ, వాటి అమలు దేశవ్యాప్తంగా సమానంగా లేదు. రైతులు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు వంటి లక్షలాది మంది బహిరంగ కార్మికులు తగిన రక్షణ లేకుండా ప్రమాదకర ఉష్ణోగ్రతలకు గురవుతున్నారు. లోటు రుతుపవనాల ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాదు. పంటల ఉత్పత్తి తగ్గితే ఆహార ధరలు పెరుగుతాయి. రైతుల ఆదాయం తగ్గిపోవడం వల్ల గ్రామీణ కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. జలాశయాల నీటి మట్టాలు పడిపోవడం వల్ల జలవిద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతాయి. తద్వారా ఆర్థిక వృద్ధి మందగించి సామాజిక అసమానతలు పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితులను ఎదుర్కో వడానికి కేవలం సహాయక ప్యాకేజీలు సరిపోవు. బలమైన సరఫరా వ్యవస్థలు, మెరుగైన ఆహార నిల్వలు, వ్యూహాత్మక ధాన్య నిల్వలు, ముందస్తు మార్కెట్ జోక్యాలు అవసరం. లేకపోతే సూపర్ ఎల్ నినో భారం దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనా పడుతుంది.

# కొలువులివ్వండి సారూ...



ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోవచ్చు, కానీ యువత భవిష్యత్తును కోల్పోయిన సమాజం తరాల పాటు నష్టపోతుంది. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో నేటికీ నిరుద్యోగ యువత ఆకాంక్షలు నెరవేరకపోవడం చారిత్రక విషాదం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడుస్తున్నా.. ఎన్నికల వేళ నిరుద్యోగులకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. నాడు ప్రతిపక్ష నేతగా యువత పోరాటాలకు అండగా నిలిచిన రేవంత్ రెడ్డి, నేడు ముఖ్యమంత్రి పీఠంపై ఉండి కూడా ఆ హామీలను కాగితాలకే పరిమితం చేయడం నిరుద్యోగ లోకాన్ని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యో గాలను భర్తీ చేస్తామని ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ఆ హామీని గాలికొదిలేసింది. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల తరపున గొంతెత్తారు, ఉద్యోగాల కోసం పోరాడిన యువతకు మద్దతుగా నిలిచారు. ఉద్యోగుల రావాలంటే ''మీరు ముప్ఫయి లక్షల మంది ఉన్నారు, మీ కుటుంబంలో ఇద్దరిని కలుపుకుంటే తొంభై లక్షల మంది అవుతారు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది, మీ భవిష్యత్తు మారుస్తుంది, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతుంది, ఉద్యోగాల కల సాకారమవుతుందని'' హామీ ఇచ్చారు. కానీ నేడు ఆ వాగ్దానాలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం పూర్తవుతున్నా, నిరుద్యోగ యువత ఆశ యాలు సిద్ధించలేదు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం.. ఖాళీ పోస్టులు, పదవీ విరమణలతో ఏర్పడిన ఖాళీలను కలిపితే రాష్ట్రంలో సుమారు మూడు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ, వాటి భర్తీపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. మరోవైపు ఉద్యోగ ఖాళీలపై శాంతికుమారి కమిటీ నివేదిక ఏమైందో ఇప్ప టికీ తెలియదు. గతంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీల వల్ల వేలాది మంది యువత జీవితాలు రోడ్డున పడ్డా, బాధ్యులపై ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోలేదు. దీంతో నిరుద్యోగులు న్యాయం కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. నెలవారీ నిరుద్యోగ భృతిగా రూ.4వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ హామీని పూర్తిగా విస్మరించింది.

నిరుద్యోగులకు భరోసానిచ్చే 'జాబ్ క్యాలెండర్' విడుదల చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయో తెలియక లక్షలాది మంది యువత ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతు న్నారు. ప్రస్తుతం టీజీపీఎస్సీలో వన్ టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు సుమారు 35 లక్షల మంది ఉన్నారు. వారికి సరిపడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి సరైన చర్యలు కనిపించ డం లేదు. ఉద్యోగాలు రాక, భవిష్యత్తు శూన్యంగా మారి ఇప్పటికే ఇరవై మందికి పైగా నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత విషాదకరం. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, హాస్టళ్లలో మగ్గి పోతూ, తమ కుటుంబాలపై భారంగా మారకూడదని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను ప్రభుత్వం పూర్తిగా వమ్ము చేస్తోంది.

ఇప్పటికైనా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటికీ వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే అమలు చేయాలి. నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలి. వివాదాస్పదమైన జీవోలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రభుత్వం ఒక స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, వారి న్యాయమైన ఉద్యమాలను అణచివేయడం, ముందస్తు అరెస్టులు చేయడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధం. నిరుద్యోగుల గొంతు నొక్కడం కాదు, వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం యువత ఆశయాల పునాదులపైనే నిలిచింది. ఆ యువత భవిష్యత్తును రక్షించడం ఏ ప్రభుత్వానికైనా చారిత్రక బాధ్యత. నిరుద్యోగుల సమస్యను నిర్లక్ష్యం చేయడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, అది సాక్షాత్తూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని విస్మరించడమే అవుతుంది.

# స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు గయా ప్రసాద్




ఎందరో వీరుల త్యాగఫలం మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది విప్లవ వీరులు మరిచి పోలేని, వెల కట్టలేని త్యాగాలు చేశారు. ఆలాంటి వారిలో భారతీయ స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాలుపంచుకున్న భారతీయ విప్లవకారుడు గయా ప్రసాద్ ఎన్నదగిన వాడు. ఆయన గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవడం శోచనీ యం. గయా ప్రసాద్ కటియార్ (20 జూన్ 1900 10 ఫిబ్రవరి 1993) "హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్"కు చెందిన విప్లవ వీరుడు. ఆయన 1900, జూన్ 20వ తేదీన నందరాణి, మౌజీరామ్ దంపతులకు కాన్పూర్ జిల్లా బిల్హౌర్ తాలూకా జగదీష్‌పూర్ గ్రామంలో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్య తర్వాత ఇతడు కాన్పూర్లో మెడిసినల్ ప్రాక్టీస్ కోర్సులో చేరాడు. తర్వాత ఆర్య సమాజంలో చేరాడు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసి యేషన్ (హెచ్.ఆర్.ఎస్.ఎ)కు చెందిన ఇతర విప్లవ కారుల వలె ఆయన కూడా 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1926లో భగత్ సింగ్, రాజ్ గురులు హోళీ పండగ సందర్భంగా జగదీషాపూర్ వచ్చినప్పుడు వారితో ఆయనకు గట్టి అనుబంధం ఏర్పడింది. ఆయన విప్లవ పార్టీ బాంబులు తయారీ కారులకు చోటు కల్పించడం ముఖ్య మైన చర్యగా ఉండేది. ఆయన ఒక మారు పేరుతో వైద్య శాలను ప్రారంభించేవాడు. ఇతర విప్లవ కారులు ఆయన వైద్యశాలలో పనివారుగా నటించేవారు. ఆ వైద్యశాలలో రహస్యంగా బాంబులు తయారటయ్యేవి. ఆ సందర్భంగా రసాయనాల నుండి వచ్చే వాసనను మందులు తయారు చేయడంవల్ల వచ్చిందిగా చుట్టుపక్కల వారు భావించేవారు. డాక్టర్ బి.ఎస్.నిగం అనే మారు పేరుతో ఆయన ఫిరోజ్పుర్లోని తూరి బజార్లో 1928 ఆగస్ట్ 10 నుండి, 1929 ఫిబ్రవరి 9 వరకూ ఒక ఆసుపత్రి ముసుగులో బాంబుల కార్ఖానా నడిపాడు. దీనిలో శివ్ వర్మ అనే విప్లవకారుడు రామానారాయణ్ కపూర్ పేరుతో, మహావీర్ సింగ్ ప్రతాప్ సింగ్ పేరుతో, చంద్రశేఖర్ ఆజాద్ పండిత్ జీ పేరుతో, సుఖదేవ్ బలే జర్ పేరుతో, జయదేవ్ అనే విప్లవకారుడు గోపాల్ అనే మారు పేరుతో పనిచేసేవారు. పోలీసుల నిఘా చర్యలు అధికం కావడంతో తమ స్థావరాన్ని పరహాన్పూరు మార్చారు. ఇన్ఫార్మర్ అయిన ఫిరోజ్పూర్ నివాసి కాలూరాం అనే మంగలి స్వంతపని మీద షరహాన్పూర్ వచ్చి అక్కడ డాక్టర్ నిగమ్ టను చూసి, గయా ప్రసాద్ గుర్తించి స్థానిక పోలీసులకు ఈ విషయం తెలియ జేశాడు. 1929, మే 13న పోలీ సులు చౌబే పరి ష్ ప్రాంతంలోని వీరి స్థావరంపై దాడి చేసి శివ్ వర్మ, జయదేవ్ కపూర్లను అరెస్ట్ చేశారు. కాన్పూరుకు వెళ్ళిన గయాప్రసాద్ నిధులు సమకూర్చుకోలేక 1929 మే 15న షహ రన్ పూర్కు తిరిగి వచ్చాటడ. అయితే పోలీసులు చుట్టుముట్టి క్షణాలలో ఆయన చేతికి బేడీలు తగిలించారు. ఆయనను పోలీస్ స్టేషన్కు తరలించే సమయంలో గయాప్రసాద్ తన జేబులోని ఒక కాగితంలో కాకోరీ కుట్ర కేసులో నిందితులు తరపున వాదించిన లక్నో న్యాయ వాదులు చంద్రభాను గుప్త, మోహన్లాల్ సక్సేనాల పేర్లు ఉండటాన్ని గుర్తు చేసుకుని ఆ కాగితాన్ని ఉండ చుట్టుకుని నోటిలో పెట్టుకుని మ్రింగడానికి ప్రయత్నించాడు. అది గొంతులో అడ్డం పడి విపరీతంగా దగ్గు వచ్చింది. నీరు కావాలని కానిస్టేబులు సంజ్ఞ చేసి నీటితో పాటు ఆ కాగితాన్ని మ్రింగివేశాడు. ఆయనను ఇతర హెచ్.ఆర్.ఎస్.ఎ విప్లవకారులతో కలిపి లాహోర్ తరలించారు. అక్కడ ఆయన నిరాహారదీక్ష చేపట్టాడు. లాహోర్ కుట్ర కేసులో విచారించి జీవిత ఖైదును విధించి అండమాన్ సెల్యులార్ జైలుకు తరలించారు. ఆ జైలులో ఖైదీల పట్ల చూపుతున్న అమానవీయ చర్యలకు నిరసనగా ఆయన అక్కడ కూడా 46 రోజుల పాటు నిరాహారదీక్ష చేశాడు.ఆయన హెచ్.ఆర్.ఎస్.ఎ. సహచరుడు మహావీర్ సింగ్ ఈ సమ్మెలో మరణించాడు. దానితో ఆయనను ఆ జైలు నుండి తరలించారు. మళ్ళీ 1937లో ఆయనను సెల్యులార్ జైలుకు పంపారు. చివరకు 1946లో విడుదల చేశారు.స్వాతంత్ర్యానంతరం కూడా తన విప్లవ ధోరణితో రైతుల, కార్మికుల పక్షాన పోరాడాడు. ఫలితంగా 1958లో 6 నెలలపాటు, మళ్ళీ 196668లో ఒకటిన్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. ఆయన 1993, ఫిబ్రవరి 10వ తేదీన మరణించాడు. ఆయన జ్ఞాపకార్థం 2016, డిసెంబర్ 26వ తేదీన భారత తపాలాశాఖ ఒక స్మారక తపాలాబిళ్ళను, ఫస్ట్ డే కవర్‌ను విడుదల చేసింది. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" అనే సినిమాలో ఆయన పాత్రను నీరజ్ షా పోషించాడు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# డిజిటల్ అంతరాన్ని అధిగమిద్దాం

ప్రతి సంవత్సరం జూన్ 20న జరుపుకునే "ప్రపంచ వైఫై దినోత్సవం(వరల్డ్ వైఫై డే), "కనెక్టెడ్ కమ్యూనిటీస్ ఫోరమ్" నాయకత్వంలో "వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ అలయన్స్" నిర్వహించే ఒక ప్రత్యేకమైన ప్రపంచవ్యాప్త కార్యక్రమం. "వైఫై" అనేది "వైర్‌లెస్ ఫిడిలిటీ"కి సంక్షిప్త రూపంగా విస్తృతంగా బోధించబడుతూ ఆమోదించబడింది. ఈ రోజున మన దైనందిన జీవితాలకు వైఫై అందించే గొప్ప సహకారాన్ని, ఆవిష్కరణను, ఇంటర్నెట్ సదుపాయం లేని వారిని అనుసంధానించాలనే లక్ష్యాన్ని మనం తీసుకుంటున్నాం. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 4 బిలియన్లకు పైగా ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఇంటర్నెట్ సదుపాయం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు వృద్ధిని అందిస్తుంది, వారి సామాజిక చలనశీలతను, కంప్యూటర్ అక్షరాస్యతను మెరుగుపరుస్తుంది, అలాగే వారి విద్యా అవకాశాలను సుసంపన్నం చేస్తుంది. ఈ దినోత్సవం 1997లో ప్రారంభమై ప్రతి ఏటా మరింత ఉత్సాహంతో కొనసాగుతున్నది. అనుసంధానం లేని వారిని అనుసంధానిద్దాం: ప్రపంచ వైఫై దినోత్సవం, డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో వైర్‌లెస్ టెక్నాలజీ పోషించిన పరివర్తనాత్మక పాత్రను వేడుకగా జరుపుకుంటుంది. అలాగే, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో "అనుసంధానం లేని వారిని అనుసంధానించే" నిరంతర కార్యాన్ని ఇది ప్రముఖంగా చాటి చెబుతుంది. ఇంటర్నెట్ సదుపాయాన్ని అందుబాటు ధరలో, సుస్థిరంగా అందించే ప్రయత్నాలను ఇది హైలైట్ చేస్తుంది. తద్వారా, అణగారిన వర్గాలకు విద్య, పరిశోధన, టెలిహెల్త్, ఆర్థిక అవకాశాలను కల్పిస్తుంది. 1977 నాటి తొలి 2 Mbps నెట్‌వర్క్‌ల నుండి నేటి ఆధునిక గిగాబిట్‌స్పీడ్ వైఫై 6, వైఫై 7 టెక్నాలజీల వరకు వేగవంతమైన పురోగతిని ఈ రోజు గుర్తిస్తుంది. ఇటీవల ప్రారంభించిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ యొక్క "పరివర్తన కోసం ఆవిష్కరణలు" అనే థీమ్‌కు అనుగుణంగా, ఈ సంవత్సరం ప్రపంచ వైఫై దినోత్సవ వేడుకలను "భారతదేశాన్ని పరివర్తన చెందిస్తూ, ప్రపంచం కోసం ఆవిష్కరిస్తూ" అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు. ప్రధానమంత్రి వైఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్, ప్రపంచ కనెక్టివిటీపై వైఫై యొక్క ప్రగాఢ ప్రభావాన్ని, అలాగే ఆర్థిక వృద్ధి, సామాజిక చైతన్యం, విద్య, డిజిటల్ సమ్మిళితాన్ని నడిపించడంలో దాని కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతోంది. భారతదేశంలో (ప్రధాన మంత్రి వైఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) వంటి కార్యక్రమాలు, అందరికీ డిజిటల్ సమ్మిళితం అనే లక్ష్యానికి మద్దతునిస్తూ, పబ్లిక్ హాట్‌స్పాట్‌లను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారతదేశంలో 90 శాతానికి పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగం వైఫై నెట్‌వర్క్‌ల ద్వారానే జరుగుతున్నందున, ఇటీవల 6 GHz బ్యాండ్‌ను డీలైసెన్సింగ్ చేయడం అనేది తదుపరి తరం వైఫై (6E మరియు ఆపైన) యొక్క కొత్త శకాన్ని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు. ఇది వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన హోమ్ వైఫైకి, భవనాలలో మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ కవరేజీకి, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఫ్యాక్టరీల వంటి పరిశ్రమలలో ప్రైవేట్ నెట్‌వర్క్‌ల రంగంలో ఆవిష్కరణలకు అవకాశాలకు దారితీస్తుంది. 2030 నాటికి 5 కోట్ల పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లను సాధించాలనేది లక్ష్యం. 2015లో కోల్‌కతా భారతదేశపు మొట్టమొదటి వైఫై సౌకర్యం గల మెట్రో నగరంగా గుర్తింపు పొందింది. అయితే, వాణిజ్యపరమైన పూర్తి వైర్‌లెస్ పబ్లిక్ యాక్సెస్ విషయంలో, వారసత్వ నగరమైన మైసూరు 2005లోనే ఈ ఘనతను సాధించింది. జనవరి 2017లో, ప్రభుత్వ నిధులతో 500 పబ్లిక్ వైఫై హాట్‌స్పాట్‌లతో కూడిన భారీ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ నగరం ముంబై నిలిచింది. ఇంటర్నెట్ ఎప్పటినుంచో మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. ఆఫీసులో ఆన్‌లైన్ పరిశోధన, వీడియో సమావేశాల నుండి వ్యక్తిగత సంభాషణలు, వినోదం వరకు మన జీవితంలోని ఎన్నో రంగాలు ఆన్‌లైన్‌లో భాగమవుతున్నాయి. వైఫై పుణ్యమా అని, చాలా ఆధునిక క్లయింట్ పరికరాలతో ఇదంతా వైర్‌లెస్‌గా సాధ్యమవుతోంది.



మధుసూదన్ రెడ్డి
9949700037

# గారడీ విద్యపై సమాజంలో ఉన్న అపోహలు

ప్రపంచ గారడీ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 17న జరుపు కుంటారు. ఇది అంతర్జాతీయ గారడీ సంఘం స్థాపించబడిన రోజును పురస్కరించుకుని నిర్వహిస్తారు. ప్రపంచం అనేది కేవలం భౌతికంగా కనిపించే పదార్థాల సమాహారం మాత్రమే కాదు. మానవ భావాలు, ఊహలు, కల్పనలు, ఆశ్చర్యం, సృజనాత్మకత అన్నీ ఈ ప్రపంచానికే చెందినవే. ఈ భావాలన్నింటిని ఒకే వేదికపై చైతన్యవంతంగా ఆవిష్కరించగలిగే కళగానే గారడీ (మాజిక్)ని పేర్కొనవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 17 న జరుపుకునే ప్రపంచ గారడీ దినోత్సవం, మాయాజాలపు కళను, దానిలోని మానవ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను స్మరించుకునే ప్రత్యేక సందర్భం. గారడీ అనేది కేవలం మోసం చేయడానికి ఉపయోగించే మానసిక విద్య కాదు. ఇది శ్రమతో కూడిన ఒక ప్రదర్శనా కళ. గారడీ ప్రదర్శనల వెనుక అత్యున్నత స్థాయి అభ్యాసం, ఖచ్చితమైన సమన్వయం, శాస్త్రీయమైన, మానసిక గమనాన్ని అంచనా వేసే సామర్థ్యం పనిచేస్తాయి. ఈ కళ ప్రధానంగా మూడు విభాగాలుగా విభజించవచ్చు చేతివాటం ఆధారిత ట్రిక్కులు మానసిక మాయ , భ్రమ పూరిత ప్రదర్శనలు . ఈ ప్రతి విభాగం వేర్వేరు నైపుణ్యాలను, శ్రమను, ప్రేక్షకుల మనసును ఆకట్టుకునే సృజనను కలగలిపి ఉంటాయి. గారడీకి చారిత్రకంగా గొప్ప వారసత్వం ఉంది. ప్రాచీన ఈజిప్ట్‌లోని పిరమిడ్ల ముందు మాయగాళ్లు ప్రదర్శనలు ఇస్తుండటం, రోమన్ల రాజసభలలో మాయాజాల కళాకారుల ఆకట్టుకోవడం, భారతదేశంలో తంత్ర, మంత్ర విద్యలతో మాయ కలసి ఆధ్యాత్మిక అనుభూతులుగా ఎదగడం గారడీ స్థాయిని, వ్యాప్తిని సూచిస్తుంది. చైనాలోనూ గారడీ ఓ ప్రజాప్రియ కళగా రాజసభల నుంచి వీధుల వరకూ ఆహ్లాదంగా వ్యాపించింది. ఆధునిక యుగంలో, ఈ కళ మరింత శాస్త్రీయంగా, వినోదాత్మకంగా వికసించింది. ప్రపంచంలో గారడీని ప్రాచుర్యం పొందేలా చేసిన మహానుభావులెన్నో ఉన్నారు. హౌదినీతో పాటు హోవార్డ్ థర్స్టన్, డేవిడ్ కాపర్‌ఫీల్డ్, క్రిస్ ఏంజెల్, డైనమో వంటి పేర్లు ప్రపంచ మాయా రంగాన్ని మారుస్తూ వచ్చాయి. వీరంతా మాయను వినోదంగా మాత్రమే కాకుండా, ఆశ్చర్యంగా మార్చిన కళాకారులు. వీరందరి ప్రదర్శనల వల్ల మానవ మేధస్సు ఎంతటి సృజనాత్మకతను, విశ్లేషణాత్మకతను ప్రదర్శించగలదో మనం తెలుసుకున్నాం. ప్రపంచ గారడీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలల నుండి కళాకేంద్రాల వరకూ మాయా ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, గారడీ పరికరాల ప్రదర్శనలు, చరిత్రపై అవగాహన కార్యక్రమాలు, బాలల కోసం శిక్షణ శిబిరాలు నిర్వహించ బడతాయి. సామాజిక మాధ్యమాల్లో గారడీ ప్రదర్శనలకు సంబంధించిన వీడియోలు, అనుభవాలు, శిక్షణలు, హ్యాష్‌టాగ్‌తో పంచుకుంటారు. కళాకారుల ప్రతిభను గౌరవిస్తూ ప్రత్యేక అవార్డులు ప్రదానం చేస్తారు. ఇదే సమయంలో గారడీ కళను ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేయడానికి నిధుల సేకరణ కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా మనం గుర్తుంచుకోవలసిన ప్రధాన విషయం ఏమిటంటే — గారడీ అనేది మోసం కాదు, మేధస్సుతో కూడిన కళ. చిన్నారుల్లో విజ్ఞాన దృష్టిని, ఊహాశక్తిని పెంపొందించడానికి ఇది ఉపయోగ పడుతుంది. ఒకప్పుడు అపోహలతో చుట్టు పెట్టబడిన ఈ కళను, నేడు ఒక శాస్త్రీయ ఆర్ట్ ఫార్మ్‌గా అంగీకరించడం అభినందనీయం.



# జాతీయం-అంతర్జాతీయం



## ఒక్కో కుటుంబానికి రూ.కోటి ఇవ్వండి..

- నీట్ బాధితులకు న్యాయం చేయండి
- ప్రధాని మోడీకి సీజేపీ లేఖ




**న్యూఢిల్లీ, జూన్ ,19 (ఎ.ఎం.ఎస్)**
నీట్ పేపర్ లీకేజీ వల్ల మనస్థాపంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తాజాగా ప్రధానికి లేఖ రాశారు. పేపర్ లీకేజీ వల్ల ఇటీవలి వారాల్లో 11 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కేవలం 48 గంట్లోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు అని దీప్కే లేఖలో ప్రస్తావించారు. అలాగే గత నెల రోజులుగా 'కాక్రోచ్ జనతా పార్టీ' విద్యాశాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తూ, తమ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతోంది. ప్రశ్నాప్రతాల లీకేజీ వల్ల సంభవించిన ప్రాణ నష్టానికి కొంత బాధ్యత వహించాలని మాత్రమే విద్యార్థులుగా తాముకోరుకుంటున్నట్లు దీప్కే లేఖలో పేర్కొన్నారు. తమ పిల్లల విద్యాపరమైన ఆశయాలను నెరవేర్చడానికి తల్లిదండ్రులు విద్యా రుణాలు తీసుకున్నారు. తమ జీవితకాల పొదుపునంతటినీ పిల్లల చదువుల కోసం వెచ్చించినప్పటికీ, చివరకు ఆ పిల్లలనే కోల్పోయిన ఈ కుటుంబాలు పూర్తిగా నిస్సహాయ స్థితిలో మిగిలిపోయాయి. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల తలెత్తిన సంక్షోభం కారణంగా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం అందించాలని దీప్కే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంక్షోభానికి బాధ్యత వహించి, విద్యాశాఖామంత్రిని తన పదవి నుండి తొలగించాలని ప్రధానిని డిమాండ్ చేశారు. ఆయన (కేంద్ర విద్యాశాఖామంత్రి) మీ అభీష్టం మేరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సంక్షోభానికి ఆయన బాధ్యత వహించకపోతే.. అంతిమ బాధ్యత ప్రధానమంత్రిదే అని దీప్కే ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రిని తొలగించడం అనేది జవాబుదారీతనం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రదర్శిస్తుంది తప్ప, బలహీనతను కాదు. ఆయనపై ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులలో నిరాశ భావనలను మరింత పెంచుతుందని దీప్కే హెచ్చరించారు. ఈ విషయంలో ప్రధాని మోడీ తక్షణమే జోక్యం చేసుకోవాలని అభిజిత్ దీప్కే డిమాండ్ చేశారు.
విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి ఆయన కోరారు. విద్యాపరమైన నిరాశ కారణంగా ఇక ఏ యువత జీవితమూ అర్ధాంతరంగా ముగిసిపోకుండా చూసేందుకు నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావాలని దీప్కే లేఖలో కేంద్రాన్ని కోరారు. మా డిమాండ్‌ను వినిపించేందుకు జూన్ 20వ తేదీ నుండి దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద సమావేశమవుతున్నారు. భారతదేశ భవిష్యత్తు గళాన్ని మీ ప్రభుత్వం ఆలకిస్తుందని మేము ఆశిస్తున్నాము అని ఆయన మోడీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ఇజ్రాయిల్ దుందుడుకు చర్య

- లెబనాన్‌పై దాడులు అశాంతి
- దాడులు ఆపితేనే చర్చలు
- స్పష్టం చేసిన ఇరాన్



**టెహ్రాన్, జూన్ 19:**
ఓవైపు ఇరాన్, అమెరికా శాంతి చర్చల ఒప్పందంపై ఏకాభిప్రాయంతో యుద్ధానికి స్వస్తి పలుకుతుంటే మరోవైపు ఇజ్రాయిల్ లెబనాన్ మీద దాడులు చేస్తూ అశాంతిని ప్రేరేపిస్తోంది. బేక వ్యాలీలో వైమానిక దాడులతో బీభత్సం సృష్టిస్తోంది. ఈ దాడుల ప్రభావం యూఎస్ఇరాన్ శాంతి చర్చల మీద పడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫ్రాన్స్ వేదికగా ఎంఓయూ హార్డ్ కాపీపై ట్రంప్ సంతకం చేయగా, టెహ్రాన్‌లో పెజెష్కియాన్ సంతకం చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం అమెరికాఇరాన్ స్విట్జర్లాండ్ వేదికగా సదురు ఒప్పందం అధికారికంగా చర్చలు సాగించనున్నాయి. తాజాగా ఈ క్రమంలోనే స్విజ్జర్లాండ్ వేదికగా జరగాల్సిన యూఎస్ఇరాన్ శాంతి చర్చలు వాయిదా పడనున్నాయి. లెబనాన్ పై వరుస దాడులతో ఇజ్రాయిల్ శాంతి చర్చలకు విఘాతం కలిగిస్తోంది. లెబనాన్ పై నిరంతర దాడులు ఆపినప్పుడే శాంతి చర్చలు సజావుగా జరుగుతాయని ఇరాన్ స్పష్టం చేసింది. ఈమేరకు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. మరోవైపు సంతకాల అనంతరం జరగాల్సిన సమావేశానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్ పర్యటన వాయిదా వేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. రెండు దేశాల మధ్య ఒప్పందం అమలులో భాగంగా 60 రోజుల కాల వ్యవధి ఉండటంతో పలు అంశాలపై సుదీర్ఘ చర్చలు అవసరమని అమెరికా భావిస్తోందని వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి.

**ఒప్పందంలోని అంశాలివే...**
మొత్తం 14 పాయింట్లతో కూడిన శాంతి ఒప్పంద పత్రాన్ని అమెరికా ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు విడుదల చేశారు. 'అమెరికాఇరాన్ మధ్య ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం' పేరిట విడుదల చేసిన ఈ పత్రంలో హార్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను తొలగించడం, తదుపరి సాంకేతిక చర్చలలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన వంటి కీలక అంశాలు ఉన్నాయి. 'హోర్ముజ్‌ను వెంటనే తెరవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. అణు ధూళిని నాశనం చేయడానికి ఇరాన్ కట్టుబడి ఉండేలా చేస్తుంది. ఇరాన్ తన సత్ప్రవర్తనను మెరుగుపరచుకుంటే దానిని మరింత సంపన్న దేశంగా మార్చగలిగిన ఆర్థిక, ఆంక్షల ఉపశమనాన్ని అందించడానికి మాకు అవకాశం ఇస్తుంది' అని అమెరికా అధికారి తెలిపారు. ఒప్పంద పత్రంపై నేడు అధికారికంగా సంతకాలు జరుగుతాయి. ఒప్పందం యొక్క తుది నిబంధనలపై చర్చలు జరపడానికి నిర్దేశించుకున్న 60 రోజుల గడువు కూడా నేడే ప్రారంభం అవుతుంది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను పొడిగిస్తుందని అమెరికా అధ్యక్షభవనం అధికారి ఒకరు చెప్పారు. ఇది 'పనితీరు ఆధారిత' ఒప్పందమని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది.



## రాహుల్ గాంధీకి బర్త్ డే విషెస్..

> రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలియజేశారు. రాజ్యాంగ ఆదర్శాల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అపరిమితమైన అంకితభావం, అణగారిన గొంతుకల కోసం ఆయన చేస్తున్న రాజీలేని పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయని ఖర్గే నొక్కి చెప్పారు. "రాహుల్ గాంధీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. రాజ్యాంగ ఆదర్శాల పట్ల మీ అపరిమితమైన అంకితభావం, అణగారిన గొంతుకల కోసం మీరు చేస్తున్న రాజీలేని పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయి.

**వెల్లువెత్తిన శుభాకాంక్షలు**
**న్యూఢిల్లీ, జూన్ ,19 (ఎ.ఎం.ఎస్)**
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలియజేశారు
.రాజ్యాంగ ఆదర్శాల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అపరిమితమైన అంకితభావం, అణగారిన గొంతుకల కోసం ఆయన చేస్తున్న రాజీలేని పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయని ఖర్గే నొక్కి చెప్పారు. "రాహుల్ గాంధీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. రాజ్యాంగ ఆదర్శాల పట్ల మీ అపరిమితమైన అంకితభావం, అణగారిన గొంతుకల కోసం మీరు చేస్తున్న రాజీలేని పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చాయి." అని కొనియాడారు. అదే విధంగా పీఎం మోడీ కూడా రాహుల్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఎక్స్ వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## రెండు నెలలపాటు రుసుం మినహాయింపు

- అన్ని రకాల నౌకలకూ వర్తింపు
- ప్రపంచ దేశాలకు ఇరాన్ బంపర్ ఆఫర్



**టెహ్రాన్, జూన్ 19:**
అమెరికాతో కుదిరిన చారిత్రక 14 సూత్రాల తాత్కాలిక అవగాహన ఒప్పందం అమలులో భాగంగా ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత వ్యూహాత్మకమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే అన్ని రకాల అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు రాబోయే 60 రోజుల పాటు రవాణా రుసుములను (ట్రాన్సిట్ ఫీజు) పూర్తిగా మినహాయిస్తున్నట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ వెల్లడించింది. ఈ కాలంలో నౌకల ప్రయాణానికి అయ్యే అనుబంధ ఖర్చులను ఇరాన్ ప్రభుత్వమే భరించనుంది. అయితే భద్రతా కారణాలు, కార్యాచరణ నిబంధనల దృష్ట్యా ప్రతి నౌక పర్షియన్ గల్ఫ్ జలసంధి అథారిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని, అలాగే కేటాయించిన ప్రత్యేక మార్గాల్లోనే ప్రయాణించాలని స్పష్టం చేసింది.
ఈ తాత్కాలిక ఒప్పందానికి అనుగుణంగా అమెరికా రక్షణ విభాగం కూడా కీలక అడుగు వేసింది. ఇరాన్ ఓడరేవులపై విధించిన నౌకాదళ దిగ్బంధన అమలును అమెరికా సైన్యం అధికారికంగా నిలిపివేసింది. దీనివల్ల అంతర్జాతీయ నౌకలు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇరాన్ రేవుల్లోకి రాకపోకలు సాగించడానికి మార్గం సుగమమైంది. ఈ దిగ్బంధనం తొలగడంతో హర్మూజ్ జలసంధి ద్వారా లక్షలాది బ్యారెళ్ల ముడి చమురు రవాణా మళ్లీ పుంజుకుంది. ఫలితంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో ముడి చమురు ధరలు వేగంగా తగ్గుముఖం పడుతున్నాయి, ఇది అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిచ్చే పరిణామం. యుద్ధ వాతావరణం వల్ల నష్టపోయిన వాణిజ్య రంగాన్ని మళ్లీ ఉత్సాహపరిచేందుకు ఇరాన్ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసింది.

## 22వరకు నిషేధమే..

### టెలిగ్రామ్ పిటిషన్‌ను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు




**న్యూఢిల్లీ, జూన్ 19:**
కేంద్రం ఆంక్షలు విధించడాన్ని సవాల్ చేస్తూ సామాజిక మాధ్యమం టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. నీట్ యూజీ పరీక్ష నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించడాన్ని సమర్థించింది. తాత్కాలిక ఆంక్షలు అవసరమేనని అభిప్రాయపడింది. నీట్ రీ ఎగ్జామ్ దృష్ట్యా టెలిగ్రామ్‌పై కేంద్రం కొన్ని ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఇవి ఈ నెల 22 వరకు కొనసాగనున్నాయి.

### భారత్-పాక్ సరిహద్దుల్లో అరుదైన సన్నివేశం

జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్థాన్ యువకుడిని సైనికాధికారులు ) గురువారం తిరిగి స్వదేశానికి అప్పగించారు. పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రానికి చెందిన అసద్ ఖాన్ భారత్ నిర్బంధంలో ఉన్నప్పుడు ఆయన్ను గౌరవంతో చూసినందుకు గాను పాక్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. గతవారం జమ్మూ కశ్మీర్‌లోని టీట్‌వాల్ సెక్టార్ వద్ద నియంత్రణ రేఖను దాటడానికి ప్రయత్నిస్తుండగా పాక్ కు చెందిన అసద్ ఖాన్ అనే వ్యక్తిని సైన్యం బంధించింది. అసద్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత.. అతడిని విడుదల చేయాలని పాకిస్థాన్‌లోని పలువురు నెటిజన్లు భారత సైన్యాన్ని కోరారు.

## జాతీయ సమగ్రతను కాపాడతాం

- అవినీతిపై పోరాడతాం
- అసెంబ్లీ సమావేశాల్లో తమిళనాడు సీఎం విజయ్



జూన్ 18 ప్రారంభమైన 17వ అసెంబ్లీ మొదటి సమావేశాలు తమిళనాడు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. అయితే, ఈ సమావేశాల్లో రాష్ట్ర సార్వభౌమాధికారం, భాషా గుర్తింపును కాపాడుకుంటూనే జాతీయ సమగ్రతను గౌరవించేలా సరికొత్త సంప్రదాయానికి టీవీకే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే, గవర్నర్ ప్రసంగంలో తమ ప్రభుత్వ విధి, విధానాలు ఎలా ఉండబోతున్నాయని, కేంద్ర రాష్ట్ర సంబంధాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. అవినీతిపై పోరాటం కొనసాగుతుందని విజయ్ ఈ ప్రసంగం ద్వారా ఉద్ఘాటించారు.
తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శాసనసభ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. మాజీ గవర్నర్ ఆర్.ఎన్.రవి హయాంలో అధికారిక కార్యక్రమాల క్రమం విషయంలో జరిగిన వివాదాలను గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ఆర్లేకర్ పునరావృతం చేస్తారేమోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్న తరుణంలో రాష్ట్ర గీతం 'తమిళ్ తాయ్ వాళ్తు'తో సమావేశాలను ప్రారంభించి సంప్రదాయాన్ని కొనసాగించారు. అయితే, సంప్రదాయానికి భిన్నంగా ఆ వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించారు. సాధారణంగా గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత మాత్రమే జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. దీంతో ఈ నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.
అనంతరం గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్ తన ప్రసంగం ప్రారంభించారు. టీవీకే ప్రభుత్వ రోడ్ మ్యాప్‌ను గవర్నర్ చదివి వినిపించారు. జనగణనలో భాగంగా కులగణను పూర్తి చేయాలని, రాష్ట్రంలో సామాజిక న్యాయ సర్వే నిర్వహణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ప్రకటించారు. సామాజిక న్యాయానికి అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం అవసరమని, జాతీయ కుల గణన పూర్తయిన తర్వాత దీనిని అమలు చేస్తామని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు.
గవర్నర్ ప్రసంగంలో కేంద్రరాష్ట్ర సంబంధాలు ఒక ప్రధాన అంశంగా నిలిచాయి. కేంద్రం నుంచి పన్నుల వాటాలో తమిళనాడుకు దక్కాల్సిన న్యాయమైన వాటాను డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా, అవసరమైతే ఈ సమస్యపై సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు వీలుగా న్యాయ నిపుణులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, అలాగే తమిళనాడు పట్ల అనుసరిస్తున్న ఆర్థిక వివక్షను పత్రాలతో సహా వివరిస్తూ ఒక నివేదికను ప్రచురించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మహిళలు, చిన్నారులపై జరుగుతోన్న నేరాలను ఉక్కుపాదంతో అణచివేసి వారికి భద్రతను కల్పించడమే తమ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని వివరించారు.

## మోడీకి హిందీలో వీడ్కోలు..

- ఫ్రాన్స్ అధ్యక్షుడి గౌరవ మర్యాదలు



భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన ముగించిన స్వదేశానికి ప్రయాణమవుతున్న సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు చిరకాలం గుర్తుండిపోయే పని చేశారు. జీ 7లో భారత్ సభ్య దేశం కాకపోయినప్పటికీ.. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్ ఆహ్వానం మేరకు మోదీ సమ్మిట్‌కు హాజరయ్యారు. ఈ సమ్మిట్‌లో భాగంగా మోదీ ఫ్రాన్స్‌కి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకూ గౌరవమర్యాదల్లో ఏమాత్రం లోటుపాట్లు లేకుండా మాక్రోన్ చూసుకున్నారు. వీడ్కోలు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు హిందీలో మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోదీ ఫ్రాన్స్ పర్యటన చివరి రోజు సందర్భంగా మ్రాకోన్ హిందీలో మాట్లాడుతూ భారత్ కీ దోస్తీ అమర్ రహే అన్నారు. "ప్రియ మిత్రుడా నరేంద్ర.. నైస్, ఎవియన్ నగరాల్లో స్వాగతం పలకడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఫ్రాన్స్ భారత్ స్నేహం చిరకాలం వర్ధిల్లాలి" అని అన్నారు. అనంతరం మాక్రోన్ ఇంగ్లిష్‌లోనూ స్పీచ్ ఇచ్చారు. ఫ్రాన్స్ ఎప్పటికీ మిమ్మల్ని ప్రేమిస్తుందని చెప్పారు. "నేను సరిగ్గా చెప్పాననే ఆశిస్తున్నాను. నా ప్రియ మిత్రుడు నరేంద్ర మోదీ, మీ స్నేహానికి ధన్యవాదాలు. ఫ్రాన్స్ మిమ్మల్ని ప్రేమిస్తుంది. మీరు పారిస్‌లో మాతో గడపడం నాకు చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు. స్పీచ్ అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భారత్‌ను సందర్శించే ఆలోచన ఉన్నట్లు కూడా మాక్రోన్ తెలిపారు

## ప్రాంతీయ పార్టీలకు బీజేపీ గండం

- పలు రాష్ట్రాల్లో చీలికలు తెస్తున్న వైనం
- యధేచ్ఛగా ఎంపీలు, ఎమ్మెల్యేల కొనుగోళ్లు
- ప్రజాస్వామ్యం అపహాస్యం



**న్యూఢిల్లీ, జూన్ 19(ఎ.ఎం.ఎస్):**
దేశ రాజకీయాలను బీజేపీ భ్రష్టు పట్టించేస్తోంది. దేశంలోని పలు ప్రాంతీయ పార్టీలను చీలుస్తూ, వాటి ఉనికి లేకుండా చేయాలని చూస్తోంది. ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ, అనైతిక రాజకీయాలకు పాల్పడుతోంది. ఇందుకు ఇటీవల దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలే తాజా ఉదాహరణ. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం తర్వాత.. ప్రతిపక్షానికి పరిమితమైన తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో ముసలం మొదలైంది. ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడగా, దాదాపు 60 మంది ఎమ్మెల్యేలు అధినేత్రి మమత నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఇక మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) రెండోసారి చీలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కమలం పార్టీ 'ఆపరేషన్ లోటస్'.. యూపీలోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)ని కూడా తాకనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ చీలిక రాజకీయాలనేవి కేంద్రంలోని బీజేపీ ఆడిస్తున్న ఆటలో భాగమని విశ్లేషకులు చెప్తున్నారు. పశ్చిమ బెంగాల్‌ను మూడు సార్లు పరిపాలించి, బలమైన నాయకురాలిగా ఎదిగిన మమతా బెనర్జీకి అక్కడి రాజకీయాలు ఆత్మరక్షణలో పడేశాయి. ఆమె నేతృత్వంలోని టీఎంసీ ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారాన్ని కోల్పోవడం, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగాయి. దీని తర్వాతే టీఎంసీకి కఠిన పరిస్థితులు మొదలయ్యాయి. బీజేపీ ఇక్కడే తన 'విభజన' రాజకీయాలను మొదలు పెట్టింది. దీంతో టీఎంసీకి చెందిన 20 మంది ఎంపీలు రెబల్‌గా మారారు. అంతేకాదు.. టీఎంసీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేల్లో దాదాపు 60 మంది కూడా మమతకు ఎదురు తిరిగారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీ నేతృత్వంలో వారంతా ఒక ప్రత్యేక వర్గంగా ఏర్పడ్డారు. తమదే అసలైన టీఎంసీగా చెప్పుకుంటున్నారు. అయితే టీఎంసీ నుంచి బయటకు వచ్చిన ఈ ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు దగ్గరయ్యే విధంగానే అడుగులు వేయడం చూస్తే కమలం పార్టీనే ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉందనే విషయాన్ని అర్థం చేసుకోవచ్చని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ఈ పరిణామాలు పశ్చిమ బెంగాల్‌లోనే కాదు.. దేశవ్యాప్తంగానూ తీవ్ర సంచలనంగా మారాయి. టీఎంసీని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఇక 2022లో చోటు చేసుకున్న పరిణామాలు ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేనను ఆయన నుంచి దూరం చేశాయి. కమలం పార్టీ ప్రత్యేక దృష్టిని సారించి మరీ.. శివసేనను విజయవంతంగా చీల్చగలిగింది. దీంతో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో మెజారిటీ ఎమ్మెల్యేలు శివసేనను వీడారు. ఆ తర్వాత బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే సీఎంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో శివసేన పార్టీ పూర్తిగా ఏక్‌నాథ్ షిండే చేతిలోకి వెళ్లింది. దీంతో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలో శివసేన (యూబీటీ) ప్రత్యేక వర్గంగా ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ అవే పరిస్థితులను శివసేన (యూబీటీ) ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోక్‌సభలో ఆ పార్టీకి ఉన్న 9 మంది ఎంపీల్లో ఆరుగురు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి వెళ్లడానికి సిద్ధమయ్యారు. తాము షిండే శివసేనలో విలీనం కావాలని నిర్ణయించినందున లోక్‌సభలో తమకు వేరుగా సీట్లు కేటాయించాలని వారు లోక్‌సభ స్పీకర్ కార్యాలయానికి లేఖ పంపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ పార్టీకి చెందిన కీలక నాయకులు సంజయ్ రౌత్, అర్వింద్ సావంత్, అనిల్ దేశాయ్‌లు బుధవారం ఉదయమే లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కలిశారు. తమ పార్టీ నుంచి ఎవరైనా వచ్చి ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించాలని కోరితే అంగీకరించొద్దని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆ పార్టీ ముఖ్యనేత సంజయ్ రౌత్ విలేకర్లతో మాట్లాడుతూ ఒకవేళ ఎవరైనా పార్టీ మారాలనుకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం పార్లమెంటరీ పార్టీ సమావేశం పెట్టామనీ, దానికి అందరూ రావాలని విప్ జారీచేశామని చెప్పారు. గైర్హాజరైనవారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఆరుగురు గైర్హాజరయ్యారు. ముగ్గురు మాత్రమే సమావేశానికి వచ్చారు. వీరిలో రాజాభౌ వాజే, అర్వింద్ సావంత్, అనిల్ దేశాయ్‌లు మాత్రమే ఉద్ధవ్ వెంట ఉన్నారు. దీంతో సమావేశానికి హాజరు కాని ఆ ఆరుగురు ఎంపీలపై ఎలాంటి చర్యలుంటాయోనన్న విషయంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. సార్వత్రిక ఎన్నికలకు లిట్మస్ టెస్ట్‌గా భావించే యూపీ ఎన్నికలు వచ్చే ఏడాది షెడ్యూల్ ప్రకారం జరగనున్నాయి. అత్యధిక ఎంపీ స్థానాలు కలిగి ఉన్న ఈ రాష్ట్రం రాజకీయంగా అన్ని పార్టీలకు చాలా కీలకం. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 80 ఎంపీ స్థానాల్లో 71 స్థానాలు, 2019లో 62 స్థానాలు గెలిచిన బీజేపీకి కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. అయితే 2024 ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఘోరంగా విఫలమైంది. ఇక్కడ కేవలం 33 స్థానాలు గెలుపొంది ఎస్పీ (37) తర్వాత రెండో స్థానంలో ఉంది. దీంతో బీజేపీ కేంద్రంలో విస్పష్టమైన మెజారిటీని సాధించలేకపోయింది. లోక్‌సభలో ప్రస్తుతం సంఖ్యాపరంగా ఎస్పీ మూడోస్థానంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలుసమీపిస్తున్న వేళ బీజేపీ అధిష్టానం యూపీపై ప్రత్యేక దృష్టిని సారించింది. దీంతో టీఎంసీ, ఉద్ధవ్ శివసేనల తర్వాత సమాజ్‌వాదీ పార్టీ బీజేపీ తదుపరి టార్గెట్‌గా మారనున్నదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇందుకు యూపీ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య, మరో మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఎస్పీ నుంచి 26 మంది ఎంపీలు ఆ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని కేశవ్ ప్రసాద్ మౌర్య చెప్పగా.. సమాజ్‌వాదీ పార్టీలోనూ త్వరలో ముసలం మొదలు కానుందని ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ప్రకటించడం సంచలనం రేపింది. ఆ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ కేంద్రం హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారనీ, బీజేపీలో చేరడానికి ఆ పార్టీ సిద్ధంగా ఉందని ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ఎక్స్‌లో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ విషయంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ భయపెట్టి పార్టీలను చీల్చడానికి బీజేపీ నిరంతంరం పని చేస్తూనే ఉంటుందని అన్నారు. దీంతో యూపీలో ఏం జరగబోతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

## పాక్‌పై అఫ్ఘనిస్తాన్ ఆకస్మిక దాడులు

- మిలిటెంట్ స్థావరాలపై బాంబులు
- ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న వైనం

**ఇస్లామాబాద్, జూన్ 19:**
పాకిస్థాన్‌పై అఫ్ఘనిస్థాన్ గురువారం అర్ధరాత్రి వైమానిక దాడులు చేసింది. ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించినట్లు అఫ్ఘన్ తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్ ఖ్వా ప్రావిన్సుల్లో ఉన్న మిలిటెంట్ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. అఫ్ఘనిస్థాన్ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిస్తే ఇకపై సహించే ప్రసక్తే లేదని, ముందుగానే దాడులు చేస్తామంటూ హెచ్చరించింది. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల లక్ష్యంగా వైమానిక దాడులు నిర్వహించినట్లు అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. గత కొంతకాలంగా ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉండగా.. ఇప్పుడు ఈ దాడులు అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దాంతో ఇరు దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వం దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సుల్లో ఉన్న మిలిటెంట్ స్థావరాలపై గురువారం రాత్రి వైమానిక దాడులు నిర్వహించినట్లు తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ దాడులను ఎలా చేపట్టారనే విషయంపై తాలిబన్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. గత కొన్ని నెలల తర్వాత అఫ్ఘనిస్థాన్ చేపట్టిన తొలి పెద్ద సైనిక చర్యగా దీన్ని భావిస్తున్నారు."అఫ్ఘనిస్థాన్‌పై దాడులు చేయడానికి, కుట్రలు పన్నడానికి ఉపయోగిస్తున్న స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం. ఈ స్థావరాలన్నీ పాక్ గూఢచార సంస్థల సహకారంతో ఉపయోగిస్తున్న స్థావరాలే" అని తాలిబన్ రక్షణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఈ స్థావరాల నుంచే గతంలో అఫ్ఘనిస్థాన్‌పై ఘోర దాడులకు ప్రణాళికలు రూపొందించారని తాలిబన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో ఎంత మంది మరణించారు, గాయపడిన వారి సంఖ్య ఎంత ఉండొచ్చు అనే వివరాలను వెల్లడించలేదు. ఈ భారీ దాడులపై పాకిస్థాన్ సైన్యం కానీ, సమాచార మంత్రిత్వ శాఖలు కానీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. గత వారం అఫ్ఘనిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపింది. ఆ దాడుల్లో 13 మంది అఫ్ఘనిస్థాన్ పౌరులు మరణించగా, అందులో 11 మంది చిన్నారులే.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## కేంద్ర నిధుల పనుల్లో పురోగతి కనిపించాలి: ఎంపీ బలరాం నాయక్

**అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి**

**ఏరియా ఆసుపత్రిలో MRI స్కాన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపండి**

**సమగ్ర సమీక్ష నిర్వహించిన 'దిశా' కమిటీ చైర్మన్**




**ములుగు, జూన్ 19 (వుదయం ప్రతినిధి) :**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణతో పనిచేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన 'దిశా' (జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రాధాబాయి, కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాద్ కేకన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి పనులను సమీక్షించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.వైద్య రంగంపై ములుగు ఏరియా ఆసుపత్రిలో MRI స్కాన్ ఏర్పాటు కోసం తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. మెడికల్ కళాశాల విద్యార్థులతో గిరిజన ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. సమగ్ర శిక్ష కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలి.వ్యవసాయం, యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటూ, ఆన్‌లైన్ విక్రయాలు జరిగేలా చూడాలి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.మౌలిక వసతులకు ములుగు, ఏటూరునాగారం ప్రాంతాలలో రింగ్ రోడ్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలి.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, మందుల లభ్యతపై విస్తృతంగా చర్చించామని ఎంపీ తెలిపారు.ప్రతి మూడు నెలలకోసారి 'దిశా' సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా సమావేశం నిర్వహిస్తూ అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్‌ఓ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, పచ్చదనం, విద్యతోనే గ్రామాభివృద్ధి- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**జీల్గుల గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్, ఉపాధి హామీ పనులు, పాఠశాలల ఆకస్మిక తనిఖీ**



**హనుమకొండ/ఎల్కతుర్తి, జూన్ 19 (వుదయం ప్రతినిధి) :**

గ్రామాభివృద్ధికి పారిశుద్ధ్యం, పచ్చదనం, నాణ్యమైన విద్యే ప్రధాన స్తంభాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పేర్కొన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో ఆమె ఆకస్మికంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు.శాస్త్రీయ చెత్త నిర్వహణ, గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించి తడి, పొడి చెత్త వేరుచేసే విధానాన్ని పరిశీలించారు. కంపోస్ట్ ఎరువు తయారీ ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచిం చారు. ఉపాధి హామీతో ఆర్థిక భరోసాతో ఊర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి కూలీల హాజరు, వేతనాలపై ఆరాతీశారు. చెరువు పూడిక మట్టిని పొలాలకు తరలించడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. చెరువు కట్టపై మొక్కలు నాటాలని ఆదేశించారు. పాఠశాలల తనిఖీ– విద్యార్థులతో మమేకం, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. స్వయంగా కలెక్టరే విద్యార్థులకు భారత దేశ భౌగోళిక స్వరూపంపై క్లాస్ తీసుకున్నారు.'బడిబాట' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచాల ని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్య మైన మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్‌ఎమ్‌లను ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ తనిఖీల్లో డీఆర్‌డీఓ మేన శీను, డీఈఓ గిరిరాజు గౌడ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన జరగాలి**

**అత్యాధునిక వసతులతో పోనేకల్ లో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం**

**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్ - 18:**

ఖమ్మం రూరల్ మండల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా, నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శుక్రవారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి లో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల పురోగతిని పరిశీలించారు. కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పొన్నేకల్ లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.నిర్మాణ ప్రాంతాలను తిరుగుతూ, పనుల నాణ్యతను, భవనాల నమూనా మ్యాప్ లను పర్యవేక్షించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్డు, ప్రణాళిక ప్రకారం 4 జూనియర్, 9 సీనియర్ హాస్టల్ బ్లాకులు, వెయిటింగ్ హాల్, అకాడమిక్ బ్లాక్ భవనాల నిర్మాణంకు కార్మికులకు అత్యధికంగా పెంచి, పనులను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి కోర్సులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు.జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కూల్ పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు అందుతాయని తెలిపారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు యం. వినయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు – జిల్లా ఎస్పీ డా. శబరీష్



**మహబూబాబాద్, జూన్ 19, వుదయం జిల్లా ప్రతినిధి**

యువతను, ముఖ్యంగా చిన్నారులను పొగాకు వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఐఎంఏహాల్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పాన్ షాపుల యజమానులు, వ్యాపారులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. సమావేశం ప్రారంభంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించారు. సిగరెట్లలో ఉండే హానికర రసాయనాలు ఊపిరితిత్తులు, గుండె, మెదడు సహా శరీరంలోని పలు అవయవాలపై చూపే దుష్ప్రభావాలను వివరించారు. అలాగే పొగతాగడం, పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా విద్యార్థులు, యువత భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో చూపించే వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మైనర్లకు సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రతి పాన్ షాప్ వద్ద "మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించబడవు" అనే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలు కొనసాగితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. సమాజంలో వ్యసన నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు.గంజాయివిక్రయాలు,రవాణా, నిల్వలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు ఉపయోగకరమైన సమాచారానికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. సమాచారం అందించేందుకు 8712656999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, వ్యాపారులు, తల్లిదండ్రులు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు, పాన్ షాపుల యజమానులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ, జూన్ 19 (వుదయం ప్రతినిధి):**

విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొడకండ్ల లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్, బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి, వారి నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో 'అన్‌అకాడమీ' తరగతులను ప్రారంభించిన ఆయన, స్వయంగా విద్యార్థులకు గణితాన్ని బోధించారు. గణితంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, వసతి గృహ సదుపాయాలు, మరుగుదొడ్ల పారిశుద్ధ్యాన్ని నిశితంగా పరిశీలించారు.సమస్యలపై నేరుగా ఫిర్యాదు: విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ఫోన్ చేయవచ్చని భరోసా ఇస్తూ, కలెక్టర్ తన ఫోన్ నంబర్‌ను పాఠశాల ఆవరణలో ప్రదర్శించాలని ఆదేశించారు.వస్తువుల పంపిణీ: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుప్పట్లు, తదితర అవసరమైన వస్తువులను కలెక్టర్ పంపిణీ చేశారు. మోడల్ స్కూల్ ఆవరణలో మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జీసీడీఓ గౌసియా బేగం, సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్-2026కు భద్రాద్రిలో సర్వం సిద్ధం

**నాలుగు కేంద్రాల్లో 1,128 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు – సమయపాలన పాటించాలని కలెక్టర్ అంకిత్ సూచన**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 19 (వుదయం ప్రతినిధి)**

వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించే ప్రతిష్ఠాత్మక జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్–2026) నిర్వహణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ నెల 21న ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 1,128 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు.జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నీట్–2026 పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 360 మంది, టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల (బాలికలు), పాల్వంచలో 288 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో 240 మంది, సీనియర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్తగూడెంలో 240 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు గంటల ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిర్ణీత సమయం తర్వాత పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో పేర్కొన్న పరీక్షా కేంద్రం ఉన్న ప్రాంతాన్ని ముందుగానే గుర్తించి, పరీక్ష రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తీసుకురావాలని తెలిపారు. వదులుగా ఉండే దుస్తులు ధరించాలని, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని హెచ్చరించారు.విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేర్చేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నీట్–2026 దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యమున్న ప్రవేశ పరీక్ష కావడంతో, విద్యార్థులు, తల్లిదండ్రులు, పరీక్షా సిబ్బంది అందరూ జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి.. డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉండాలి: కలెక్టర్



**సూర్యాపేట జూన్ :19 వుదయం ప్రతినిధి**

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, ఇన్–పేషెంట్, అవుట్–పేషెంట్ విభాగాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వార్డుల్లోని రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, ఆర్ఎమ్ఓలు, హెచ్ఓడీలతో సమీక్ష నిర్వహించారు. జనవరి నుండి మే వరకు 1,12,000 మందికి పైగా అవుట్–పేషెంట్లు, 25,000 మందికి పైగా ఇన్–పేషెంట్లకు వైద్య సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మోకాలి మార్పిడి, ఇతర ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. మాతా శిశు కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగిందని, రోగులందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం, మందులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసి కీమోథెరపీతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 58 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవలు పొందుతున్నారన్నారు. మాతా శిశు సంరక్షణ బ్లాక్ భవన నిర్మాణం పూర్తయిందని, ఎక్విప్‌మెంట్ పనులు త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. జనరల్ ఆసుపత్రి నూతన ప్రధాన భవన పనులు చివరి దశలో ఉన్నాయని, వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఇన్–పేషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, ఆర్ఎమ్ఓలు గీతా వాణి, ప్రశాంతి, డాక్టర్లు మనీషా, సతీష్, ఉపేందర్ సింగ్, మునిసిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ



**మధిర జూన్ 19, వుదయం ప్రతినిధి:**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ ఎంప్లాయిస్ కాలనీలో గల వంద పడకలాసుపత్రిని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా అక్కడున్న వైద్య సదుపాయాలను పేషెం ట్లను అడిగి తెలుసుకున్నారు నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. వంద పడకల ఆసుపత్రిలో ల్యాబ్ కు మరియు అవసరమైన పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి సద్వినియోగంలో అశ్వారావుపేట మొదటి స్థానంలో ఉంది ఎమ్మెల్యే జారె



**దమ్మపేట జోన్ 19 (వుదయం ప్రతినిధి):**

అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హైదరాబాద్ తెలంగాణ సచివాలయం లోని ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంర్ఫ్ ) విభాగాన్ని సందర్శించిన అశ్వారావుపేట నియోజకవర్గంలోని అనారోగ్య బాధితుల నుంచి సేకరించిన ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాధితులకు వైద్య ఖర్చుల భారం తగ్గేలా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారుఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత గల వారి వైద్య అవసరాలకు అండగా నిలుస్తోందని నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సహాయం అందే వరకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అనంతరం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన పలువురు రోగులను పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

## జర్నలిస్టుల సమస్యలపై తహసిల్దార్ కు వినతి పత్రం



**సత్తుపల్లి జూన్ 19 (వుదయం ప్రతినిధి )**

సత్తుపల్లి ఆర్ సి ఇంచార్జ్ గా పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా ఎడిషన్ కార్డులు ఇచ్చి రాష్ట్రస్థాయిలో బస్ పాస్ సౌకర్యం కల్పించాలని సత్తుపల్లి జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తాసిల్దార్ పున్నం సత్యనారాయణకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా లేని నిబంధనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా జీవో 252 తీసుకొచ్చి ఆర్ సి ఇంచార్జ్ లుగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు మండల అక్రిడేషన్ కార్డులు ఇచ్చి, జిల్లా బస్సు పాసులు ఇచ్చి జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నారని ఘాటుగా విమర్శించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకొని నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసి బస్సు పాస్, హెల్త్ కార్డ్, జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్లు మాదిరాజు సుధాకర్, ఎండి షైబుద్దీన్, చిన్నిని బాలకృష్ణ, షేక్ ఖాదర్ బాబా, నిమ్మగడ్డ శ్రీకాంత్, రామిశెట్టి లక్ష్మణరావు, భీమిశెట్టి రాము, బి.వి.రామారావు, తడకమళ్ళ దేవ, బేతి ఆనంద్, కె. సతీష్, రాజేష్ రెడ్డి, కె. బాలాజీ, చీపు గంగాధర్, బొల్లిపోగు సురేష్, గురవయ్య, కొత్తపల్లి సుధాకర్, మునీర్, కాకర్ల జగన్, బల్లెం చిరంజీవి, కోట అశోక్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఘనంగా ఎన్నిక

**పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం – ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



**భద్రాచలం, జూన్ 19 (వుదయం ప్రతినిధి):**

పచ్చని ప్రకృతి మానవ జీవితానికి ప్రాణాధారమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణాన్ని మరింత పచ్చదనంతో కళకళలాడే హరితవనంగా తీర్చిదిద్దాలనే మహోన్నత లక్ష్యంతో పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ 14వ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడాయి. పట్టణ ప్రముఖులు, సామాజిక సేవకులు, పర్యావరణ ప్రేమికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.సంస్థ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పీఆర్‌ఓగా సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామరాజు తిరుమలరావు, హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డాక్టర్ గొల్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణ (పార్క్ కృష్ణ) నియమితులయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, భద్రాచలం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తింపు పొందిందని, అదే స్థాయిలో పర్యావరణ పరిరక్షణలో కూడా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు పరిష్కారం వృక్షారోపణేనని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.గ్రీన్ భద్రాద్రి వంటి సంస్థలు ప్రభుత్వానికి సహకరిస్తూ ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. భద్రాచలం పట్టణంలోని రహదారులు, కాలనీలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయ ప్రాంగణాలు పచ్చని చెట్లతో నిండి ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర మాట్లాడుతూ, అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కాలనీలో పచ్చదనం పెరిగితే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు.ప్రముఖ సామాజికవేత్త యోగి సూర్యనారాయణ మాట్లాడుతూ, గ్రీన్ భద్రాద్రి ప్రారంభమైన నాటి నుండి అనేక వేల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలందిస్తోందని తెలిపారు. మొక్క నాటడం ప్రారంభం మాత్రమేనని, దానిని చెట్టుగా పెంచడం అసలు సేవ అని పేర్కొన్నారు.పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ఒక ఉద్యమంగా మారాలని, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తే భద్రాచలం మరింత అందంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్ మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్రస్వామి వారి పుణ్యక్షేత్రంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన భద్రాచలంలో పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి భక్తుడి బాధ్యత అని అన్నారు. గ్రీన్ భద్రాద్రి చేపట్టే సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం నూతన అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, 2026–27 సంవత్సరాన్ని గ్రీన్ భద్రాద్రి చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో లక్ష్యపూర్వకంగా వేలాది మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, గ్రామపంచాయతీలు, యువజన సంఘాలతో కలిసి విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.కార్యదర్శి భుక్యా రంజిత్ నాయక్ మాట్లాడుతూ, యువతను పెద్ద ఎత్తున పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒక ప్రత్యేక హరిత కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచుతామని తెలిపారు.కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారం లేకుండా ఏ సేవా కార్యక్రమం విజయవంతం కాదని అన్నారు. దాతల సహకారంతో మరిన్ని మొక్కలు సేకరించి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా నాటే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి...జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జగిత్యాల జూన్ 19 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజన నాణ్యత పరిశుభ్రత వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారువిద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత రుచి పై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు భోజనం సక్రమంగా సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు డైట్ మెను వంటగది పరిశుభ్రత నీటి వినియోగం నిల్వ కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు అనంతరం విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు పిల్లల ఆరోగ్యం భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు ప్రతి విద్యార్థికి సమానంగా సమయానికి సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె రాము జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ పాఠశాల ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్

**నిర్మల్ జిల్లా 19 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జిల్లాల్లో భూధార్ సర్వే చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సర్వేయర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూభారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భూధార్ సర్వే నిర్వహణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏటీసీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు:ఎస్ఐ ఉదయ్ కిరణ్




**జన్నారం,జూన్ 19(వుదయం విలేఖరి)**

జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఐటీఐ, ఏటీసీ కళాశాలకు సంబంధించిన ప్రచార గోడ ప్రతులను శుక్రవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్ లో, ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ ట్రైనింగ్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని దీంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఉద్యోగం చేయాలన్న ఆసక్తి, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలనే తపన యువతలో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జన్నారం ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీ వై. రమేష్ , పర్యవేక్షకులు పి.బాను,ఏటిఓ ఎం.శంకర్ పాల్గొన్నారు.

## చెంచు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందించాలి : జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్-19 (వుదయం ప్రతినిధి)**

సంచార జీవులైన చెంచు కుటుంబాలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో చెంచుల నివాస గృహాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను, ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా పారుపల్లి గ్రామంలోని సంచార జీవులైన 15 చెంచు కుటుంబాల వారికి అవసరమైన ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, అర్హులైన వారికి పెన్షన్లు ఇటీవల కలెక్టర్ చొరవతో అధికారులు అందించారు.పారుపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు, అర్హులైన చెంచు కుటుంబాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. చెంచు కుటుంబాల కోసం ఇప్పటికే నిర్మించిన 10 గృహాలను పరిశీలించిన కలెక్టర్, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి జూలై 31 నాటికి పూర్తి చేయాలని, ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# పదవులను త్యాగం చేసిన మహోన్నత కుటుంబం రాహుల్ గాంధీది

### ధర్మపురిలో ఘనంగా కాంగ్రెస్ నేత జన్మదిన వేడుకలు

### హాజరైన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి. లక్ష్మణ్




**ధర్మపురి,జూన్19(వుదయం ప్రతినిధి):**

దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రాణాలర్పించిన ఘన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానికే దక్కుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు.శుక్రవారం పట్టణంలో నంది చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గతంలో కేంద్రంలో అధికారం లోకి వచ్చినప్పుడు ప్రధాని పదవి చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ సోనియా గాంధీ,రాహుల్ గాంధీలు ఆ పదవిని త్యాగం చేశారని గుర్తుచే శారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలో పేతం చేసేందుకు ఆర్థిక నిపుణుడు డా.మన్మోహన్ సింగ్‌ను ప్రధా నమంత్రిని చేసిన మహోన్నత వ్యక్తిత్వం వారిదన్నారు. దేశంలో విద్వేషాలను రూపుమాపి, ప్రజలను ఏకం చేసేందుకే రాహుల్ గాం ధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చారిత్రాత్మక పాదయాత్ర నిర్వహించారని కొనియాడారు.కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మంత్రి మండిపాటుపేదలకు కూడు పెట్టే ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని మంత్రి మండిపడ్డారు. మద్దతు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అన్నదాతలపై జీపులు ఎక్కించి అణచివేసిన దుర్మార్గపు చరిత్ర బీజేపీ దేనని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రస్తుతం దేశంలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ప్రజా సమ స్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని 2029లో ప్రధానమం త్రిగా చూడడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణు లు, ప్రజలు కట్టుబడి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగ నభట్ల దినేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి,మాజీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు సింహారాజు.ప్రసాద్,సీపతి సత్యనా రాయణ,గుడ్ల.రవి, గాజు.సాగర్,జె.సు ముఖ్, పెద్దంబట్ల. నరేందర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన కలెక్టర్




**ఆదిలాబాద్ , వుదయం:**

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం బజారత్నూర్ మండలం గులాబ్ తండాలో 'బాల వికాస ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ పనితీరును, నీటి శుద్ధి ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు కలుషిత నీరు త్రాగడం ద్వారా అనారోగ్యం బారిన పడుతున్నారని, ఆర్వో ప్లాంట్ ద్వారా లభించే శుద్ధి చేసిన నీటిని వినియోగించుకోవడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చని, తద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు ఎంత ముఖ్యమో, వాటి నిరంతర నిర్వహణ అంతే ముఖ్యమని అధికారులకు సూచించారు.ప్లాంట్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరాయంగా ప్రజలకు నీరు అందేలా స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం, విద్యార్థుల భద్రతకు, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే బజారత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ గోడను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సింగారెడ్డి, శ్రీలక్ష్మి రెడ్డి, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, సర్పంచ్ రాథోడ్ లక్ష్మి భాయి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## హాజీపూర్‌లో కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయం, ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్



**హాజీపూర్, జూన్ 19 (వుదయం ప్రతినిధి):**

హాజీపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలలో విద్యార్థులకు ఆహారం తయారీ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిత్యావసర సరుకులను క్రమబద్ధంగా నిల్వ ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, తహసీల్దార్ పుష్పలతతో కలిసి కార్యాలయ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ప్రజల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆదేశించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారితో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రైతులకు పంటల మార్పిడి, భూసారం పెంపుదల, ఆధునిక సాగు పద్ధతులు, పంట నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మండలంలోని ముల్కల్ల ఇసుక రీచ్‌ను సందర్శించి ఇసుక రవాణా ప్రక్రియను పరిశీలించారు. “మన ఇసుక వాహనం” యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే ఇసుక సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటీపీ ధృవీకరణ లేని ఏ ట్రాక్టర్ కూడా ఇసుక రీచ్ నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం -జిల్లా కలెక్టర్



**మంచిర్యాల /జూన్ 19 (వుదయం ప్రతినిధి)**

విద్యావ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాసంస్థల అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యా సంవత్సరం ప్రారంభమైనందున జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాలలో అదనపు తరగతి గదులు, భోజనశాలల నిర్మాణ పనులను చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, విద్యాలయాలలో అధిక మొత్తంలో అడ్మిషన్లు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. 200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరుగుతుందని, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ప్రభుత్వ పాఠశాలలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. నాణ్యమైన విద్య అందించడంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యారంగంతో పాటు వైద్యరంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మాతా శిశు ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జూన్ 19 :**

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)–2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25వ తేదీ నుంచి బీఎల్ఓ లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.స్పెషల్ఇంటెన్సివ్ రివిజన్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగానిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నర్వహించినట్లు వెల్లడించారు.

# బీఎల్‌ఏ సమావేశాన్ని విజయవంతం చేయాలి

### పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**మంథని, జూన్ 19 (వుదయం ప్రతినిధి):**

ఈ నెల 24న నిర్వహించనున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ నెల 24న మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో బీఎల్‌ఏల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతంచేయాలని కోరారు.బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్‌ఏల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి :కలెక్టర్



**కరీంనగర్ జూన్ 19 (వుదయం ప్రతినిధి):**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 25వ డివిజన్ పరిధి సుభాష్ నగర్ ఏరియా బుట్టి రాజారాం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్.. డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లాలో బిల్లులు జమ కాని లబ్ధిదారుల వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈలు ఊర్మిళ, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ నెట్‌వర్క్ పనులు వేగవంతం చేయాలి.. కలెక్టర్




**ఆసిఫాబాద్(వుదయం ప్రతినిధి)**

జిల్లాలో టెలికాం సేవలను మరింత మెరుగుపరిచేందుకు సెల్ టవర్ల నిర్మాణం, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.హరిత సంబంధిత అధికారులకు, టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నందున టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరైన సెల్ టవర్ల నిర్మాణం, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ పనుల పురోగతిని సమీక్షించి, భూ సమస్యలు, అనుమతులు తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు నిరంతరాయంగా కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు టెలికాం సంస్థలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఏడి సర్వేల్యాండ్ రికార్డ్స్ వినయ్, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ తదితర టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

### –జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



**ఆదిలాబాద్, జూన్ 19 (వుదయం ప్రతినిధి) :**

ఆదిలాబాద్ పట్టణంలోని కెఆర్‌కే కాలనీలో శుక్రవారం ఉదయం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 150 మంది పోలీసు సిబ్బంది ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో 127 ద్విచక్ర వాహనాలు, 26 ఆటోలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో 15 వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా ఉన్నట్లు గుర్తించారు. అలాగే 77 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో కత్తులు, మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి వచ్చి తాత్కాలికంగా నివసిస్తున్న వారి వివరాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరాల్లో పాల్గొన్నవారిపై ఇంటి యజమానులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, ఉద్యోగ మోసాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## మహిళల భద్రతకు 'భరోసా కేంద్రం'.. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్



--- కొల్లాపూర్ చౌరస్తా వద్ద స్థల పరిశీలన.. కలెక్టర్, ఎస్పీ సంయుక్త తనికి

-- రెవెన్యూ అధికారులకు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

నాగర్ కర్నూల్ జూన్ 19 (వుదయం బ్యూరో)

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన సేవలను విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది.ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలో ని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ శుక్రవారం సంయుక్తంగా పరిశీలించారు. ప్రతిపాదిత స్థలంలోని భౌగోళిక పరిస్థితులు, రహదారి అనుసంధానం, భూమి విస్తీర్ణం, ప్రజలకు అందుబాటు వంటి అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం నిర్మాణానికి అవసరమైన భూమి విస్తీర్ణంపై అధికారులతో చర్చించిన కలెక్టర్, స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్లు, ప్రభుత్వ యాజమాన్య హక్కులు, మొత్తం భూమి విస్తీర్ణం, హద్దులు, సరిహద్దుల వివరాలను త్వరితగతిన అందించాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన మేర ప్రభుత్వ భూమిని గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక స్టేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పట్టణంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ అధికమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ద్వారా ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. రహదారి భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ పోలీస్ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.ఒకేచోట సమగ్ర సేవలు భరోసా కేంద్రం భరోసా కేంద్రం ఏర్పాటు ద్వారా మహిళలు, చిన్నారులు, లైంగిక వేధింపులు, గృహహింస వంటి సమస్యలను ఎదుర్కొంటున్న బాధితులకు ఒకేచోట సమగ్ర సహాయ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహకారం వంటి సేవలను సమన్వయంతో అందించేలా కేంద్రం పనిచేయనుందని అధికారులు వెల్లడించారు.భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు తగినంత స్థలం కేటాయించాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అనుకూలమైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ భూమిని పూర్తి స్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా భద్రత, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం ఏర్పాటు ద్వారా పోలీసు సేవలు మరింత ప్రజలకు చేరువ కానున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ బాబు, తహసీల్దార్ తబితా రాణి, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

--- నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

--- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వెల్లడి

గద్వాల జూన్ 19 (వుదయం కరస్పాండెంట్)



ఈ నెల 21వ తేదీ జరగనున్న నీట్ 2026 పునః పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ కారణంగా ప్రభుత్వం ఈనెల 21వ తేదీన ఇట్టి పరీక్షను తిరిగి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష నిర్వహణ కోసం ఒక కోఆర్డినేటర్, నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిప్యూటీ చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు అబ్జర్వర్లు, 80 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కో తహసీల్దార్‌ను లైజన్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.భద్రతా పరంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఎస్సై, ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను విధుల్లో నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్టుకార్డ్ సైజ్ ఫోటో తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు.పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఉపకారణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ లు ఆభరణాలు వంటివి అనుమతించబడవని తెలిపారు. నీట్ పరీక్షకు సంబంధించిన ఏదైనా సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు 7702697697, 8309470647, 9848897759 నంబర్లను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని, పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

## రాంపూర్ లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం




మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండలంరాంపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం పరశురాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి హాజరై విద్యార్థులకు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం అర్జున్, వార్డు మెంబర్లు సతీష్,బాలరాజు,స్వామి ఉపాధ్యాయులు గీత,సృజన విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస్,సుస్మిత,సారిక,మౌనిక,రేఖ,సౌమ్య,రేణుక,బాలమణి,స్రవంతి,రమ్య, శ్రీజ,షాహీన్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు

- ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడు కాంగ్రెస్ నేతలు

నాగర్కర్నూల్, జూన్ 19 (వుదయం ప్రతినిధి)



జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు జక్కా రాజ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఏఐసీసీ అధ్యక్షులు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కుల కోసం, యువత, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, డీసీసీ అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, డీసీసీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు, వంకేశ్వర నిరంజన్, తెల్కపల్లి మండల వైస్ ప్రెసిడెంట్ యాదయ్య, కౌన్సిలర్లు నిజాం, శంకర్, కాంగ్రెస్ నాయకులు ఖాజా ఖాన్, ఖాదర్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్

నారాయణపేట జూన్19 (వుదయం ప్రతినిధి)



నారాయణ పేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. లెక్కలు సులభంగా ఎలా చేయాలో బోర్డు పై చేసి చూపించారు. ఉట్కూర్ మండలంలోని తిప్రస్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరీ, మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిత్యవసర సరుకులను పరిశీలించారు. మెనూ పాటించక పోవడంపై వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని 2, 4 వ తరగతి గదుల్లోకి వెళ్ళి బోర్డుపై లెక్కలు చేసి చూపించారు. ఉట్కూర్ మండల కేంద్రంలోని పాఠశాలల సందర్శన ఉట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ వీధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో బడి బాట కార్యక్రమం ద్వారా ఎన్ రోల్ మెంట్ ఎంత జరిగిందని హెచ్ ఎం లను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్ నగర్ పాఠశాలలో బియ్యం పరిశీలించిన కలెక్టర్ బియ్యంలో పురుగులు ఉన్నాయని, బియ్యం బస్తాలను తిరిగి పంపించి, వేరే బియ్యం బస్తాలను తెప్పించుకోవాలని ఆ పాఠశాల హెచ్ ఎం ను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయురాలు చెబుతున్న ఇంగ్లీష్ పాఠం బోధన తీరును పరిశీలించారు. అర్థం కానీ విషయాలను మళ్ళీ టీచర్ ను అడిగి చెప్పించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అందరూ 550 మార్కులకు పైగా సాధించాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యత ను పరిశీలించారు. చివరగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ గదిని పరిశీలించారు. పదో తరగతి గదిలో హిందీ పాఠం బోధన విధానాన్ని చూసి, హిందీలో విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. పాఠశాలలో మరుగు దొడ్ల ను చూశారు. అందుబాటులో ఉన్న మరుగుదొడ్ల ను వినియోగంలోకి తేవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో మరికొన్ని మరుగు దొడ్లు, అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించాలని ఎంపీడీవో కు సూచించారు. పక్కనే ఉన్న ఉర్దూ మీడియం తరగతిని పరిశీలించారు. ఉర్దూ మీడియం కొనసాగుతున్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని గ్రామ సర్పంచి రేణుకా భరత్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో కిషోర్ కుమార్, ఎంపీవో బాలాజీ, ఉప సర్పంచి, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు పాల్గొన్నారు.

## బడి ఉందా.. గురువులున్నారా?!

* ఆల్వాల్‌పాడు హైస్కూల్‌లో విద్యా వ్యవస్థ 'ధ్వంసం'
* తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్‌కు దిక్కులేదు.. పాఠాలు బంద్!
* 'చదువు సంకనాకిపోతోంది'.. విసిగిపోయి 'టీసీ'ల కోసం విద్యార్థుల క్యూ
* సర్కారు బడికి తాళమే శరణ్యమా?.. నిలదీస్తున్న సర్పంచ్ మాణిక్యమ్మ

ధరూర్ జూన్ 19 (వుదయం బ్యూరో)




సర్కారు బడుల్లో 'సద్గుణాల సంపద' కాదు.. విద్యార్థుల భవిష్యత్తు 'అంధకారం' తాండవిస్తోంది! అక్షరాలు దిద్దించాల్సిన చేతులు.. బదిలీ ధ్రువపత్రాల (టీసీ) కోసం దరఖాస్తులు రాసుకుంటున్నాయి. ఆల్వాల్‌పాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఎంపీహెచ్‌ఎస్)లో నెలకొన్న దారుణ పరిస్థితి విద్యాశాఖ నైతిక దివాలాకోరుతనానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకునే 'కార్పొరేట్ స్థాయి విద్య' క్షేత్రస్థాయిలో ఎలా వెక్కిరిస్తోందో చెప్పడానికి ఈ పాఠశాలే ఒక ఉదాహరణ.బోర్డులు ఖాళీ.. తరగతులు శూన్యం! ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్ వంటి అన్ని ప్రధాన సబ్జెక్టులకూ ఉపాధ్యా యులు లేరు. విద్యాసంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా, క్లాస్ రూముల్లో గంట కొట్టే నాథుడే కరువయ్యాడు. ఉపాధ్యాయులు లేని బడిలో కాలక్షేపం చేయడం కంటే, వేరే దారి చూసుకోవడమే మేలని భావించిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కొరతపై విసిగిపోయారు. గత్యంతరం లేక టీసీలు తీసుకుని ప్రైవేటు బడుల వైపు పరుగులు తీస్తుండటం ఇక్కడి విద్యా సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది.క్షేత్రస్థాయిలో సర్పంచ్ ఆగ్రహం.. అధికారులకు అల్టిమేటం!పాఠశాల దుస్థితిపై స్థానిక సర్పంచ్ శ్రీమతి మాణిక్యమ్మ గ్రామ పెద్దలతో కలిసి రంగంలోకి దిగారు. ఖాళీగా కుర్చీలు, వెలవెలబోతున్న క్లాస్ రూములను చూసి ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న విద్యాశాఖ అధికారుల తీరును నిరసిస్తూ తక్షణమే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు.బడి ఉండి.. గురువులు లేకపోతే పిల్లల గమ్యం ఏం కావాలి? ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, పేద పిల్లల చదువుపై సర్కారు చేస్తున్న దాడి! తక్షణమే స్పందించకపోతే ఊరుకునేది లేదు."— శ్రీమతి మాణిక్యమ్మ, గ్రామ సర్పంచ్ఇవీ 'అక్షర' డిమాండ్లు: యుద్ధప్రాతిపదికన పోస్టుల భర్తీ: ఖాళీగా ఉన్న అన్ని ప్రధాన సబ్జెక్టుల ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.విద్యా వాలంటీర్ల కేటాయింపు: శాశ్వత నియామకాలు జరిగే వరకు ప్రత్యామ్నా యంగా వెంటనే విద్యా వాలంటీర్లను నియమించి క్లాసులు ప్రారంభించాలి.విద్యాశాఖ కళ్ళు తెరిచేనా..? "గురువులు లేరు... గమ్యం కనిపించదు" అంటూ తల్లిదండ్రులు రోడ్డుక్కే పరిస్థితి వచ్చింది. ఈ ఘోర విద్యా సంక్షోభాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డిఈఓ దృష్టికి తీసుకెళ్లి, తేల్చుకుంటామని సర్పంచ్, గ్రామస్థులు స్పష్టం చేశారు. విద్యాశాఖ ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, ఈ పాఠశాలను కాపాడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



-- తహశీల్దార్ జ్యోతి

అయిజ జూన్ 19 (వుదయం ప్రతినిధి)

ఓటర్ జాబితాలో ఎటువంటి తప్పులు జరుగకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ జ్యోతి అన్నారు. అయిజ మండల కేంద్రం లోని రెడ్డి ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం ట్రైనర్ తిమ్మారెడ్డి బిఎల్ఓ, బిఎల్ఏ లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జ్యోతి మాట్లాడుతూ ఈ నెల 25వ తేది నుండి బిఎల్వోలు తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని, అక్టోబర్ 1వ తేదీ తుది ఓటరు జాబితా ప్రకటించే వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు అన్ని సజావుగా జరగాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై బిఎల్వోలు, బిఎల్ఏలు ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని తెలిపారు. ఎవరు కూడా ఓటరు జాబితాలో ఓట్లు పోతాయని అపోహ చెందవద్దని తెలిపారు. బిఎల్ఓలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, బిఎల్వోలు, పంచాయతీ సెక్రెటరీలు, బిఎల్ఎలు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు భూసేకరణ: రైతులకు మేలు

వనపర్తి జూన్ 19




జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయే రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గోపాల్ దిన్నె రిజర్వాయర్ లింకు కెనాల్ నిర్మాణంలో భాగంగా తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల పరిధిలో భూసేకరణ అంశంపై సంబంధిత గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లింకు కెనాల్ పరిధిలోని 90 ఎకరాల భూముల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు భూసేకరణ అంశానికి సంబంధించి తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు. లింక్ కెనాల్ నిర్మాణం కోసం వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల పరిధిలో సేకరించనున్న 90 ఎకరాలకు సంబంధించి తమ గ్రామాలకి చెందిన చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. తామంతా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని, భూములు కోల్పోతే తమకు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఎకరానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.11.50 లక్షలు కాకుండా, పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు. ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ముందు సింగోటం వైపు నుండి భూసేకరణ ప్రారంభించి తమ వద్ద చేయాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోపాల్ దిన్నె రిజర్వాయర్ లింక్ కెనాల్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ఈ జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ రేట్ల కు అనుగుణంగా ధరను నిర్ణయిస్తుందని చెప్పారు. గతంలో వల్లభాపూర్, బొల్లారం గ్రామాల్లో చేసిన భూసేకరణ మాదిరిగానే ఇక్కడ కూడా చేస్తామని తెలిపారు. రైతులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం తరపున తాము ఎప్పుడు ప్రయత్నిస్తామని తెలిపారు. కాబట్టి రైతులు వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని తమ విన్నపాన్ని తెలియజేయాలని సూచించారు. తాము రైతుల విన్నపాన్ని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని తెలియజేశారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఎంత ఇవ్వవచ్చు అనేది త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే గ్రామానికి అధికారులు వచ్చి పరిహారం గురించి చెప్పడం జరుగుతుందని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన వార్షికోత్సవం



వెల్దండ జూన్ 19 (వు దయం)

మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లిలో బొడ్రాయి ప్రతిష్టాపన 4వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, బొడ్రాయి, గ్రామ, కుల దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు కవిత రమేష్, వాణి పురుషోత్తం, మంజుల శ్రీను, శేఖర్, దేవేందర్, మల్లీశ్వరి రంగనాథం, వెంకటేష్ , మానస రాజు,రమేష్ , సునీత ఆనంద్ , రవీందర్ రెడ్డి , మట్ట భరత్ గౌడ్ ,శంకరయ్య ,కొయ్యల పుల్లయ్య గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు

## చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు బాటలు

- అందె ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

వుదయం, సిద్దిపేట (జూన్ 19)




చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు బాటలు వేస్తున్నాయని అందె సర్పంచ్ కదారి యాదగిరి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వుదయం మండలంలోని అందె గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కదారి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై ప్రీప్రైమరీ, మొదటి తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ మాట్ల పరశురాములు చిన్నారులకు ఉచిత పలకలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కదారి యాదగిరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు అక్షరాభ్యాసం తొలి మెట్టు అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల విద్యా ప్రస్థానంలో అక్షరాభ్యాసం ఎంతో కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాదగిరి, అందె ప్రవీణ్, ఉపాధ్యాయులు కృష్ణ, జాషువా, రాజేశ్వర్, చంద్రమౌళి, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## రీసర్వే కు లైసెన్స్ సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలి

- భూ సంబంధ అర్జీలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 19 (వుదయం బ్యూరో)




ప్రభుత్వం గ్రామాల్లోని సమగ్ర భూముల రీ సర్వేకు నిర్ణయించినందున అందుకు అవసరమైన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలో రీ సర్వేకు మొదటి దశలో 70 గ్రామాలు ఎంపిక అయ్యాయని, 150 మంది లైసెన్స్ సర్వేయర్ల సహకారంతో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. అలాగే సాదా బైనామా, భూభారతి, తదితర భూ సంబంధ అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా వచ్చేనెల 15వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల వారీగా విపత్తు నిర్వహణ ప్లాన్ ను పక్కాగా తయారు చేసి అందజేయాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీమ్ ను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల రీసర్వేకు సంబంధించి ఉదయం హైదరాబాదు నుంచి భూసేకరణ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విసి అనంతరం మొదటి దశలో జిల్లాలో 70 గ్రామాలు రీసర్వే కు ఎంపికైనందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సర్వే డిప్యూటీ ఇన్స్పెక్టర్ గోవిందుకు సూచించారు. ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాస రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ మండలాల తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి వద్ద అగాధ గుంతలు.. ప్రాణాలతో చెలగాటం!

గద్వాల జూన్ 19 (వుదయం బ్యూరో)

అయిజ, జోగులాంబ గద్వాల్ జిల్లా: ప్రజలకు ప్రాణాధారంగా నిలవాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి వద్దే నిర్లక్ష్యం తాండవిస్తోంది. అయిజ ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నెలల క్రితం తవ్విన భారీ గుంతలను అధికారులు అలాగే వదిలేయడంతో రోగులు, గర్భిణీలు, వృద్ధులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర వైద్యం కోసం వచ్చే బాధితులకు ఈ గుంతలు మరో పరీక్షగా మారాయి. డ్రైనేజీ లేదా పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గుంతలు ఇప్పటికీ పూడ్చకపోవడం, వాటి చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదం మరింత పెరుగుతోంది.వర్షం కురిస్తే గుంతలు నీటితో నిండిపోతున్నాయి. దీంతో రోడ్డు ఎక్కడుందో, గుంత ఎక్కడుందో గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు తీవ్ర ఆందోళనతో ప్రయాణిస్తున్నారు. చిన్నపాటి అజాగ్రత్త కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ వందలాది మంది వినియోగించే ఆసుపత్రి మార్గంలో ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. "ప్రాణనష్టం జరిగితేనే చర్యలా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ గుంతలను వెంటనే పూడ్చి, రహదారిని సురక్షితంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు



చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి) : రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చర్ల ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ సూచించారు. సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని ఆయన హెచ్చరించారు.
తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, బహుమతులు గెలుచుకున్నారంటూ వచ్చే ప్రకటనలు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగే కాల్స్ విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి లింకులను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందన్నారు. ఇటీవలి కాలంలో యువత ఈజీ మనీ కోసం ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారని, వాటి ద్వారా రుణాలు తీసుకున్న అనేక మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యక్తిగత ఫోటోలు, ఫోన్ కాంటాక్ట్‌లను దుర్వినియోగం చేస్తూ కొందరు మోసగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల యువత ఇలాంటి యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రహదారి భద్రత విషయంలో కూడా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ పేర్కొన్నారు. మండల పరిధిలో మైనర్లకు ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మోటారు వాహనాలు నడపడానికి ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత అంశాల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సైబర్ భద్రత, యువత భవిష్యత్తు, రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా అమ్మ మాట, అంగన్వాడి బడిబాట ముగింపు కార్యక్రమం

- యువతతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ





చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి) చర్ల ప్రాజెక్టు పరిధిలోని సుబ్బంపేట సెక్టార్‌లో ఉన్న సుబ్బంపేట అంగన్వాడి కేంద్రంలో "అమ్మ మాట అంగన్వాడి బడిబాట" కార్యక్రమం చివరి రోజు శుక్రవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. చిన్నారుల విద్యాభివృద్ధి, అంగన్వాడి సేవల ప్రాముఖ్యత, బాలల సమగ్ర వికాసంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు గ్రామ యువత, అంగన్వాడి సిబ్బంది కలిసి గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపించడం ద్వారా పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యువతకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. అనంతరం యువతతో కలిసి మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాక సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో అంగన్వాడి కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం పిల్లల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ బంద. స్వరూపరాణి, గ్రామ కార్యదర్శి సర్వేశ్వరరావు, అంగన్వాడి టీచర్ నాగమణి, ఆయా లక్ష్మి, ఆశ కార్యకర్త సమ్మక్క, గ్రామస్తులు విశాలి, సీతారత్నం, సుబ్బలక్ష్మి, కృప, భవాని, నాగభవాని, రామక్క, సాయి, భరత్, రవీంద్ర, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అర నిమిషం ఆదా కోసం ప్రాణాలు పణంగా పెట్టొద్దు

: ఎస్ఐ సాయిరాం విజ్ఞప్తి




సూర్యాపేట జూన్:19వుదయం ప్రతినిధి"అర నిమిషం సమయం ఆదా చేద్దామని షార్ట్‌కట్‌లో వెళ్తే, జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది" అని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల చాలా మంది వాహనదారులు సమయం ఆదా కోసం డివైడర్లు దాటి, రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారని, ఇది తీవ్ర ప్రమాదాలకు దారితీస్తోందని ఎస్ఐ ఆవేదన వ్యక్తం చేశారు. హైవేలపై, ప్రధాన రహదారులపై ఇలాంటి నిర్లక్ష్యం ప్రాణాంతకమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సరైన మార్గంలోనే ప్రయాణించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, వేగ నియంత్రణ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తుందని, భద్రంగా ఇంటికి చేరడం ముఖ్యమని ఆయన గుర్తు చేశారు. రాంగ్ రూట్‌లో వచ్చే వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని ఎస్ఐ సాయిరాం స్పష్టం చేశారు.

## సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్పీ వార్షిక తనిఖీ

20 కొత్త సీసీ కెమెరాలు ప్రారంభం - కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం




సూర్యాపేట జూన్ ,19వుదయం ప్రతినిధిజిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గురువారం సూర్యాపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు. డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ సిబ్బంది కవాతు పరిశీలించి, యూనిఫామ్, కిట్లను తనిఖీ చేశారు. వనమహోత్సవంలో మొక్కలు నాటారు.
ఎస్పీ కీలక ప్రకటనలు సూర్యాపేటను సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దుతాం. పట్టణంలో 20 కొత్త సీసీ కెమెరాలు ప్రారంభం. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం. భూకబ్జాదారులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా.
ఆపరేషన్ రోప్ ద్వారా ట్రాఫిక్ సమస్యల నివారణ. మహిళలు, విద్యార్థినుల వేధింపులపై కఠిన చర్యలు. ఫిర్యాదులపై బాధితుల ఇళ్లకు వెళ్లి కేసు నమోదు. స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, కోర్టులతో సమన్వయంతో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, మగ్దూం అలీ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఎస్సైలు ఏడుకొండలు, మహేందర్, శివతేజ, సందీప్, వెంకన్న, రహిముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# దుంగలు దొరికాయి దొంగలెక్కడ?

గోదావరి రేవుల్లో టేకు స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట ఎప్పుడు?



చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి) చర్ల మండలంలోని పెద్దిపల్లి గోదావరి రేవు వద్ద అక్రమంగా టేకు దుంగలను దాచి ఉంచారనే పక్కా సమాచారం అటవీ శాఖ అధికారులకు రావడంతో సెక్షన్ ఆఫీసర్ రాజేష్, బేస్ క్యాంప్ సిబ్బంది చేసిన తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 టేకు దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంతో అటవీ సంపద అక్రమ రవాణాపై చర్చకు దారితీసింది. గోదావరి రేవుల మార్గంగా విలువైన అటవీ సంపద తరలిపోతుందనే ఆరోపణల నడుమ ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గురువారం రాత్రి పక్కా సమాచారంతో పెద్దిపల్లి రేవు ప్రాంతానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకను గమనించిన స్మగ్లర్లు దుంగలను అక్కడే వదిలేసి వాహనంతో పరారైనట్లు ఫారెస్ట్ అధికారులు అనుమానిస్తున్నారు. అనంతరం అధికారులు దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని పలు రేవుల నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా టేకు దుంగలు తరలిస్తున్నారనే ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. అడవుల నుంచి కలపను రహస్యంగా తీసుకొచ్చి రేవుల వద్ద నిల్వ చేసి, అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్న స్థానికులు . అప్పుడప్పుడు అటవీ శాఖ దాడులు నిర్వహించి దుంగలను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, అక్రమ రవాణా పూర్తిగా అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం గోదావరి రేవుల వద్ద పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని, విలువైన అటవీ సంపద తరలిపోతున్నప్పటికీ అసలు స్మగ్లర్లు, ముఠాల నిర్వాహకులు పట్టుబడకపోవడం వల్ల ఈ వ్యవహారం కొనసాగుతోందని వారు ఆరోపిస్తున్నారు. రేవుల వద్ద ప్రత్యేక నిఘా, రాత్రి గస్తీ బృందాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేష్ ని చరవాణిలో వివరణ కోరగా , పెద్దిపల్లి రేవు సమీపంలోని ఇసుకలో టేకు దుంగలను దాచి ఉంచారనే పక్కా సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న టేకు దుంగల విలువ సుమారు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. పెద్దిపల్లి ఘటనతో గోదావరి రేవుల ద్వారా జరుగుతున్న అక్రమ టేకు రవాణాపై మరోసారి చర్చ మొదలైంది. ఈ వ్యవహారం వెనుక ఉన్న ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటేనే అటవీ సంపదను కాపాడగలమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లుల కోసం ఎదురుచూపులు



చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి) చర్ల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులు చివరి విడత బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించిన బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు . నిర్మాణాలు పూర్తై నాలుగు నెలలు గడిచినా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు తెచ్చుకున్న అప్పుకి వడ్డీ కట్టలేక అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఆశలు నింపినప్పటికీ, బిల్లుల విడుదలలో జరుగుతున్న జాప్యం ఆ ఆశలపై నీళ్లు చల్లుతోందని ఆయన విమర్శించారు. చివరి దశ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అనేక మంది లబ్ధిదారులు బయట వ్యక్తుల వద్ద, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుని పనులు ముగించారని తెలిపారు. ఇళ్లు పూర్తయిన తర్వాత ప్రభుత్వం నుంచి రావాల్సిన చివరి విడత బిల్లు త్వరగా వస్తుందనే ఆశతో అప్పులు చేసిన కుటుంబాలు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇల్లు వచ్చిన ఆనందం తీరకముందే తీసుకున్న అప్పులు తీర్చలేక లబ్ధిదారులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. చర్ల మండలంలో వందలాది మంది లబ్ధిదారులు ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, బిల్లుల చెల్లింపులపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతతో పాటు నిధుల విడుదల సకాలంలో జరగాలని వారు అభిప్రాయపడ్డారు. లబ్ధిదారుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేస్తేనే వారికి ఆర్థిక ఉపశమనం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## చౌడవరం, రాయుడుపాలెంలో అమ్మ మాట అంగన్వాడి బాట



సత్తుపల్లి జూన్ 19 (వుదయం ప్రతినిధి )వేంసూరు మండల పరిధిలోని చౌడవరం గ్రామపంచాయతీలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కమల, రాయుడుపాలెం గ్రామపంచాయతీలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి ఆధ్వర్యంలోఅమ్మ మాట అంగన్వాడి బాట ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా ఐదు సంవత్సరాల నిండిన పిల్లలకు విద్యారంబ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ యొక్క అక్షరాభ్యాసాల ప్రోగ్రాం కి గౌరవ గ్రామ సర్పంచ్ నల్లిపోయిన అంజమ్మ గ్రామ పెద్దలు పిల్లల తల్లులు అంగన్వాడీ టీచర్లు రమాదేవి నాగలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

# అక్షరాల వెలుగులు.. పుస్తకాల పంపిణీ !

- కోటయ్యగూడెంలో సామూహిక అక్షరాభ్యాసం
- సర్పంచ్ రాంబాబు చేతుల మీదుగా పాఠ్యపుస్తకాల అందజేత





చండూరు, జూన్ 19 (వుదయం):చండూరు మండల పరిధిలోని కోటయ్యగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శుక్రవారం అక్షరాల వెలుగులతో వికసించింది. పాఠశాల ప్రవేశోత్సవాల్లో భాగంగా నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ రాంబాబు హాజరై, విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, అందిస్తున్న పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులు జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా బడికి వస్తూ చదువుపై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్‌కార్ బడికి 'పబ్లిక్' క్రేజ్!

- చండూరు హైస్కూల్‌లో జోరుగా అడ్మిషన్లు
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)గా మారనుండటంతో పెరిగిన డిమాండ్
- విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ





చండూరు, జూన్ 19 (వుదయం):ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. చండూరు ప్రభుత్వ హైస్కూల్ ఈ సంవత్సరం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్)గా రూపాంతరం చెందనుందనే ప్రచారంతో బడిబాట పడుతున్న విద్యార్థుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి వసతులు, ఇంగ్లీష్ మీడియం బోధన అందుబాటులోకి రానుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తమ పిల్లలను చండూరు హైస్కూల్‌లోనే చేర్పించేందుకు ఉత్సాహం చూపిస్తుండటంతో అడ్మిషన్ల సందడి జోరందుకుంది. కేవలం చండూరు పట్టణంలో కాకుండా, చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఈ పాఠశాల గురించే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. **విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**ఇదిలా ఉండగా, పాఠశాల పునఃప్రారంభం కావడంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు శుక్రవారం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల వర్గాలు మాట్లాడుతూ.. టీపీఎస్‌గా మారనుండటంతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడులపై నమ్మకం మరింత పెరిగిందని, అడ్మిషన్ల కోసం భారీగా తరలివస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు



చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి)చర్ల మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం దగ్గర సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రంకి బాబ్జి, బండారు రామకృష్ణ, చీమకుర్తి వీరభద్రం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాస్‌లు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత అభ్యున్నతి, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యలను పార్లమెంట్లో ప్రజాక్షేత్రంలోనూ బలంగా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారని ఈ సందర్భంగా తెలిపారు . ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ దేశాభివృద్ధికి కృషి చేస్తున్న రాహుల్ గాంధీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుతూ జన్మదిన సందర్భంగా మిఠాయిలు అందజేశారు . ఈ కార్యక్రమంలో జవ్వాది రవికుమార్, చర్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు , లింగాపురం సర్పంచ్ గుగులోతు మంగా, మేడిచర్ల వీర కుమార్, సుందరి సురేష్, నేదురి సత్యనారాయణ, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి, అలవాల బాలు, ఆవుల శ్రీనివాసరావు, గూడాపాటి రామకృష్ణ, ఆవుల బాబురావు, పటేల్ వెంకటేశ్వర్లు,
దోమల రవికాంత్, కోట రత్నాజీ, విస్సా. నాగభూషణం, పరిటాల సంతోష్, లక్ష్మణరావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## లంబాడీల బస్సు యాత్రను అడ్డుకుంటాం



చర్ల, జూన్ 19:(వుదయం ప్రతినిధి)
లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించి 50 సంవత్సరాలు పూర్తయ్యాయంటూ ఈ నెల 25 నుంచి చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రను అడ్డుకుంటామని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర హెచ్చరించారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 342, ఆర్టికల్ 244, ఐదవ షెడ్యూల్ ప్రత్యేక రక్షణలు కల్పించాయని ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ఏరియాల్లోని విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు స్థానిక ఆదివాసులకే చెందాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోందని గుర్తు చేశారు .లంబాడీలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లోకి ప్రవేశించి అన్నీ అవకాశాలను దక్కించుకుంటున్నారని ఆరోపించిన రాజు దొర. బస్సు యాత్ర ద్వారా తామే అసలైన ఆదివాసులమని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాల సహకారంతో ఈ యాత్రను అడ్డుకుంటామని, ఆదివాసుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## కాళ్ల కండరాలు బలంగా ఉండాలంటే ఏం చేయాలి..



కాళ్ల కండరాల బలం మనిషి రోజువారీ జీవితంలో ఎంతో కీలకమైనది. నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీ నుంచి లేవడం వంటి సాధారణ పనుల నుంచి క్రీడల్లో మెరుగైన ప్రదర్శన వరకు అన్నింటికీ బలమైన దిగువ శరీరం అవసరం. క్వాడ్రిసెప్స్, గ్లూట్స్ వంటి కాళ్ల కండరాలు శరీరంలోని అతిపెద్ద కండరాల సమూహాల్లో భాగం. ఇవి బలంగా ఉంటే కదలికలు సమర్థవంతంగా సాగడమే కాకుండా శక్తి వినియోగం మెరుగుపడి కీళ్లపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. కాళ్ల బలాన్ని పెంచుకోవాలంటే వ్యాయామంతోపాటు సరైన ఆహారం, జీవనశైలి అలవాట్లపైనా దృష్టి పెట్టాలి. కాళ్ల కండరాలను బలోపేతం చేయడంలో స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. క్వాడ్రిసెప్స్, హ్యామ్‌స్ట్రింగ్స్, కాల్ఫ్స్, గ్లూట్స్ వంటి ప్రధాన కండరాల సమూహాలను లక్ష్యంగా చేసుకునే వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయాలి. స్క్వాట్స్, లంజెస్, డెడ్‌లిఫ్ట్స్, లెగ్ ప్రెస్, కాల్ఫ్ రైజెస్ వంటి వ్యాయామాలు కాళ్ల బలాన్ని పెంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. వారానికి కనీసం రెండు నుంచి మూడు సార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయడం మంచిది. కండరాలు బలపడాలంటే క్రమంగా బరువును లేదా రిపిటేషన్ల సంఖ్యను పెంచుతూ వెళ్లాలి. స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌తోపాటు కార్డియో వ్యాయామాలు కూడా కాళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. పరుగెత్తడం, సైక్లింగ్, ఈత, వేగంగా నడవడం వంటి కార్యకలాపాలు కాళ్ల కండరాలను టోన్ చేయడంతోపాటు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. క్రమం తప్పకుండా కార్డియో వ్యాయామాలు చేయడం ద్వారా కాళ్ల సహన శక్తి పెరుగుతుంది. కాళ్ల బలం పెరగాలంటే ఫ్లెక్సిబిలిటీ, మొబిలిటీ కూడా ముఖ్యమే. కండరాలు గట్టిపడితే వ్యాయామాలు సరిగా చేయడం కష్టమవుతుంది. వ్యాయామానికి ముందు డైనమిక్ స్ట్రెచింగ్, తర్వాత స్టాటిక్ స్ట్రెచింగ్ చేయడం వల్ల కండరాల వశ్యత పెరుగుతుంది. యోగా సాధన కూడా శరీర సమతుల్యతను, కదలికల పరిధిని మెరుగుపరచి కాళ్ల పనితీరును పెంచుతుంది. సరైన ఆహారం లేకుండా కండరాల బలం పెరగడం సాధ్యం కాదు. వ్యాయామం సమయంలో కండరాల్లో సూక్ష్మస్థాయి చీలికలు ఏర్పడతాయి. వీటిని పునరుద్ధరించి మరింత బలంగా మార్చడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. కండరాల పెరుగుదల కోసం తగిన మోతాదులో ప్రోటీన్ అవసరం. లీన్ మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పప్పుధాన్యాలు, మొక్కల ఆధారిత ప్రోటీన్ ఆహారాలను తీసుకోవాలి. వ్యాయామాలకు అవసరమైన శక్తిని అందించేందుకు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు కూడా అవసరం. సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు శరీరానికి దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అలాగే అవకాడో, నట్స్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల ఉత్పత్తికి, శరీర ఆరోగ్యానికి తోడ్పడతాయి. శరీరంలో నీటి లోపం ఉంటే కండరాల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందుకే తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వ్యాయామం తర్వాత శరీరంలో కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడం అవసరం. కొన్ని సందర్భాల్లో ఎలక్ట్రోలైట్లు కలిగిన పానీయాలు కూడా ఉపయోగపడతాయి. కండరాల బలవృద్ధిలో విశ్రాంతి కూడా ముఖ్యమైంది. వ్యాయామం తర్వాత కండరాలు పునరుద్ధరించుకుని మరింత బలపడేందుకు సమయం అవసరం. ప్రతి రోజు కనీసం 7 నుంచి 9 గంటల నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వ్యాయామాల మధ్య విశ్రాంతి రోజులను కూడా తప్పనిసరిగా చేర్చాలి. శరీరం ఎక్కువ అలసటగా లేదా నొప్పిగా అనిపిస్తే అదనపు విశ్రాంతి తీసుకోవడం మంచిది. బలమైన కాళ్లు రోజువారీ పనులను సులభతరం చేయడమే కాకుండా గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

## గాజు స్ట్రా.. తేనె పూసిన కత్తి



ఇటీవల ఆన్‌లైన్ మార్కెట్లో గాజు స్ట్రాలు అతి తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయి. ఇలాంటి వాటిని వాడితే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. గాజు స్ట్రాలను వాడిన ప్రతిసారీ శుభ్రం చేసే సందర్భంలో ఎప్పుడో ఒకప్పుడు పగుళ్లు రావొచ్చు. అంచులు చిట్లి పోవచ్చు. వీటిని భద్రపరిచినప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా తాకినా చిట్లుతాయి. గాజు స్ట్రా పగుళ్ల వల్ల పెదవులు, నాలుకకు కనిపించని గాయాలు అయ్యే ప్రమాదం ఉంది. స్ట్రా అంచుల్లో ఉండే చిన్న చిన్న పగుళ్ల నుంచి సూక్ష్మంగా ఉండే గాజు పలుకులు పానియాలను పీల్చేటప్పుడు నోట్లోకి వచ్చేస్తాయి. అక్కడి నుంచి జీర్ణ వ్యవస్థలోకి జారుకుంటాయట. అవి జీర్ణ వ్యవస్థలోని మూలల్లో కొంతకాలం ఉండిపోయి గాయాలు చేసే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. 'ఏ రాయి అయితేనేం' అనే సామెతలో చెప్పినట్టు గాజు, ప్లాస్టిక్ స్ట్రాలు రెండూ ప్రమాదమే. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్టు కాకూడదు. కాబట్టి వీలున్నంత వరకు నోటితో పానియాలు తాగడమే ఉత్తమం. కుదరకపోతే పేపర్ స్ట్రా ఉపయోగించడం కొంత మెరుగు.

## కుదుళ్లకు 'మునగాకు పొడి'!

జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే కుదుళ్లు దృఢంగా ఉండాలి. ఇందుకోసం పోషకాహారం తీసుకోవడం, సహజసిద్ధమైన హెయిర్ ప్యాక్స్ వేసుకోవడం మనకు అలవాటే! అయితే ఈ జాబితాలో మునగాకు పొడిని కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో దీన్ని కూరల్లో భాగం చేసుకోవడంతో పాటు.. ఈ పొడితో హెయిర్ ప్యాక్స్/మాస్కులు తయారుచేసుకొని ఉపయోగించడం వల్ల కుదుళ్లు/జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..



మునగాకు పొడిలో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ 'సి', విటమిన్ 'బి6', ఐరన్, జింక్, క్యాల్షియం.. వంటి పోషకాలుంటాయి. ఇవి కుదుళ్లలో ఉన్న సమస్యల్ని దూరం చేసి.. జుట్టు ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తాయట. అందుకే వీటిని చర్మ, జుట్టు సౌందర్యోత్పత్తుల తయారీలో విరివిగా వాడుతుంటారు. కుదుళ్లు జిడ్డుగా మారడం వల్ల చుండ్రు, దురద.. వంటి సమస్యలొస్తాయి. ఇవి జుట్టు రాలడానికి కారణమవుతాయి.

మునగాకు పొడి వీటికి విరుగుడుగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే జింక్.. కుదుళ్లలోని నూనె గ్రంథులు విడుదల చేసే సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుందట. తద్వారా కుదుళ్లు తేమగా ఉండి.. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయట. ప్రకాశవంతంగానూ కనిపించేలా చేస్తాయంటున్నారు. కొంతమందికి కుదుళ్లలో దురద, పొక్కుల్లా ఏర్పడడం.. వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి వారు మునగాకు పొడితో తయారుచేసిన హెయిర్ మాస్కులు ఉపయోగించడం, ఈ పొడిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. మునగాకు పొడిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్లలోని ఆయా సమస్యల్ని దూరం చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయట. శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ చర్మ ఆరోగ్యంపైనే కాదు.. కుదుళ్లపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. అందుకే వీటితో పోరాడే గుణాలున్న మునగాకు పొడిని మనం తీసుకునే ఆహారం, పాటించే బ్యూటీ రొటీన్‌లో భాగం చేసుకోవాలంటున్నారు. ఈ పొడిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'సి' ఫ్రీరాడికల్స్‌తో పోరాడి ఒత్తిడిని తగ్గిస్తాయట. జుట్టు ఒత్తుగా పెరగడమే కాదు.. ప్రకాశవంతంగా ఉన్నప్పుడే దాని అందం ఇనుమడిస్తుంది. మునగాకులోని బెహెనిక్ ఆమ్లం ఈ పనుల్ని సమర్థంగా నిర్వర్తిస్తుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ ఆమ్లం జుట్టుకు సహజసిద్ధమైన కండిషనర్‌లా పనిచేస్తుంది. తద్వారా ఆశించిన ఫలితాల్ని పొందచ్చంటున్నారు. కుదుళ్లు ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నప్పుడే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. మునగాకు పొడిలోని ఓలియిక్ ఆమ్లం, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఇందుకు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. మునగాకు పొడితో కుదుళ్లు, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలంటే.. ఈ హెయిర్ మాస్క్ చక్కగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. టేబుల్ స్పూన్ చొప్పున మునగాకు పొడి, ఉసిరి పొడి ఒక బౌల్‌లోకి తీసుకొని కలుపుకోవాలి. దీనికి కొద్దికొద్దిగా పెరుగు జత చేస్తూ పేస్ట్‌లాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లు, జుట్టుకు పట్టించి అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. ఆపై శుభ్రం చేసుకుంటే.. ఆశించిన ఫలితాలు పొందచ్చట. మునగాకు పొడితో సహజసిద్ధమైన కండిషనర్‌ని కూడా తయారుచేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం రెండు కప్పుల నీటిలో టేబుల్‌స్పూన్ మునగాకు పొడి వేసి మరిగించాలి. చల్లారాక ఈ నీటిని వడకట్టి.. తలస్నానం చేశాక కుదుళ్లు, జుట్టు మొత్తం తడిసేలా తలపై నుంచి పోసుకోవాలి. కాసేపయ్యాక గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుందంటున్నారు నిపుణులు.

## చక్కెరకు చెక్ పెట్టొద్దు..!

చికాగోలో ఇటీవల నిర్వహించిన ఎండోక్రైన్ సొసైటీ వార్షిక సమావేశంలో ఈ అధ్యయనం చర్చకు వచ్చింది. దీని ప్రకారం.. కొవ్వు తక్కువగా ఉండే ఆహారం నుంచి చక్కెరను పూర్తిగా తొలగించడం వల్ల పేగుల ఆరోగ్యం, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌తోపాటు జీవక్రియలపైనా ప్రతికూల ప్రభావం పడుతుందట. ఇందుకోసం ఎలుకలపై చేపట్టిన ప్రయోగాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయని పరిశోధకులు తెలిపారు. ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించి.. కొన్నిటికి చక్కెర లేకుండా, మరికొన్నిటికి చక్కెరతో కూడిన ఆహారాన్ని అందించారు. 16 వారాల తర్వాత వాటి పేగుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. అయితే, చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేసిన ఎలుకల జీవక్రియల్లో కొన్ని ప్రతికూల మార్పులను గుర్తించారు. మితిమీరిన చక్కెర వినియోగం ఆరోగ్యానికి హానికరమే అయినప్పటికీ, కొన్ని రకాల చక్కెరలను పూర్తిగా తొలగించడం వల్ల ముఖ్యమైన జీవక్రియ ప్రక్రియలకు అంతరాయం కలగవచ్చని పరిశోధకులు చెప్పుకొచ్చారు.



చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేస్తే.. రక్తంలో చక్కెర నియంత్రణ తగ్గడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం, పేగులలోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడం, పేగుల్లో వాపు/మంటతోపాటు ఫ్యాటీ లివర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. మన జీర్ణ వ్యవస్థలో ట్రిలియన్ల కొద్దీ ఉండే బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, ఇతర సూక్ష్మజీవులు.. జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, జీవక్రియ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే సుక్రోజ్‌ను పూర్తిగా దూరం చేయడం వల్ల ఈ మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతింటుందని ఈ కొత్త అధ్యయనం తేల్చింది. కాబట్టి, చక్కెరను పూర్తిగా పక్కన పెట్టేయకుండా.. కొద్ది మొత్తానికి పరిమితం చేయాలి. అదే సమయంలో ఆహారంలో కార్బోహైడ్రేట్ల నాణ్యత, సమతుల్యతకూ ప్రాధాన్యం ఇవ్వాలి. తీవ్రమైన ఆహార నియంత్రణల కంటే సమతుల పోషకాహార విధానమే ఎక్కువ ప్రయోజనకరమని ఈ అధ్యయనం ఉద్ఘాటిస్తున్నది.

## ఆలుగడ్డలను తింటే మధుమేహం వస్తుందా..

పరిశోధన కాలంలో మొత్తం 22,299 మందికి టైప్-2 మధుమేహం నిర్ధారణ అయింది. వారానికి మూడు సార్లు ఆలుగడ్డలు తినేవారిలో మధుమేహం వచ్చే ప్రమాదం స్వల్పంగా 5



శాతం పెరిగినట్లు కనిపించింది. అయితే వంట విధానాన్ని బట్టి పరిశీలించగా మరింత స్పష్టమైన తేడాలు బయటపడ్డాయి. వారానికి మూడు సార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తినేవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 20 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. మరోవైపు అదే పరిమాణంలో ఉడికించిన, కాల్చిన లేదా మెత్తగా చేసిన ఆలుగడ్డలను తీసుకున్న వారిలో మధుమేహ ప్రమాదం పెరిగినట్లు ఎలాంటి గణాంక ఆధారాలు లభించలేదు. ఈ తేడాకు ప్రధాన కారణం డీప్ ఫ్రై చేసే ప్రక్రియ అని పరిశోధకులు చెబుతున్నారు. నూనెలో బాగా వేయించడం వల్ల ఆహారంలో కేలరీలు, అనారోగ్యకర కొవ్వులు పెరుగుతాయి. అలాగే ఆహార రసాయన నిర్మాణంలో మార్పులు చోటుచేసుకుని ఇన్సులిన్ నిరోధకతను పెంచే అవకాశం ఉంటుంది. పరిశోధకులు మరో ఆసక్తికర అంశాన్ని కూడా పరిశీలించారు.ఆలుగడ్డలకు బదులుగా ఇతర కార్బోహైడ్రేట్ ఆహారాలను తీసుకుంటే మధుమేహ ప్రమాదంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో అధ్యయనం చేశారు.
వారానికి మూడు సార్లు ఆలుగడ్డల స్థానంలో సంపూర్ణ ధాన్యాలను తీసుకున్న వారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 8 శాతం తగ్గినట్లు గుర్తించారు. అదే ఫ్రెంచ్ ఫ్రైస్‌కు బదులుగా సంపూర్ణ ధాన్యాలను తీసుకుంటే ఈ ప్రమాదం 19 శాతం వరకు తగ్గింది.

## గుబాళించే గులాబీ నూనె!

మినిమలిజాన్ని ఇష్టపడుతోన్న జెన్‌జీలు... సహజసిద్ధమైన పద్ధతుల్లో చర్మాన్ని సంరక్షించుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. ఇలా ప్రస్తుతం వారి మనసు దోచుకుంటోంది గులాబీ నూనె. దీన్ని నేరుగా మార్కెట్‌లో కొనుక్కోవడమే కాదు... ఇంట్లోనూ సులువుగా తయారుచేసుకోవచ్చు. అదెలాగంటే... రోజ్ ఆయిల్ తయారీకి ముందుగా రసాయనాలు వాడని మొక్కల నుంచి గులాబీ పూలు సేకరించాలి. వాటి రేకలను విడదీసి శుభ్రం చేసుకుని తడి ఆరాక... వాటిని ఒక గాజు సీసాలో వేసుకోవాలి. ఇప్పుడు అందులో బాదం లేదా జోజోబా నూనెను పోయాలి. మూత పెట్టి ఈ మిశ్రమాన్ని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో వేడి చేయొచ్చు. లేదా కొన్ని రోజుల పాటు ఎండలో ఉంచొచ్చు.



అప్పుడు పూలలోని సారం అంతా నూనెలోకి చేరుతుంది. ఆపై దాన్ని వడకట్టుకుంటే సుగంధభరితమైన రోజ్ ఆయిల్ సిద్ధమవుతుంది. గులాబీనూనెలో సమృద్ధిగా ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతూ, వృద్ధాప్య ఛాయలు, ముడతలను సమర్థవంతంగా అరికడతాయి. ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవారికి తేమను అందించి, మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ముఖంపై ఉన్న నల్లటి మచ్చలు, మొటిమల గుర్తులను క్రమంగా తగ్గిస్తూ చర్మ రంగును మెరుగుపరచడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. రోజూ రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల గులాబీ నూనెతో ముఖాన్ని మృదువుగా మసాజ్ చేసుకోవడం వల్ల, మరుసటి రోజు ఉదయానికి చర్మం ఎంతో కాంతిమంతంగా, కోమలంగా మారుతుంది. చర్మంపై వచ్చే మంట, అలర్జీలను తగ్గించే గుణాలూ ఇందులో ఉన్నాయి. అంతేనా, దీని సువాసన మనసునీ తేలికపరుస్తుందట. హాయి నిద్రనూ తెచ్చిపెడుతుంది.

## ఒకే వంట నూనె కన్నా, వివిధ రకాల నూనెలను కలిపి వాడితే మంచిది..

పామ్ ఆయిల్ ఆహార పరిశ్రమలో విస్తృతంగా ఉపయోగించే నూనెలలో ఒకటి. అధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా ఇది తక్కువగా దెబ్బతినడం వల్ల వేయింపులు, బేకరీ ఉత్పత్తులు, మార్జరిన్, స్ప్రెడ్లు, మిఠాయిల తయారీలో దీనికి మంచి ప్రాధాన్యం ఉంది. ఇందులో సహజంగా ఉండే టోకోఫెరాల్స్, టోకోట్రియెనాల్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు నూనె నాణ్యతను కాపాడడంలో సహాయపడతాయి. పామ్ ఆయిల్‌ను సోయాబీన్, రైస్ బ్రాన్, సన్‌ఫ్లవర్, ఫ్లాక్స్‌సీడ్ లేదా పెరిల్లా సీడ్ ఆయిల్స్‌తో కలపడం ద్వారా మరింత సమతుల్యమైన పోషక విలువలు కలిగిన నూనెను తయారు చేయవచ్చు. పామ్ ఆయిల్ వేడి తట్టుకునే స్థిరత్వాన్ని అందిస్తే, ఇతర నూనెలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అదనపు యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (FSSAI) నూనె మిశ్రమాలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ఈ నిబంధనల ప్రకారం సాధారణంగా ఒక మిశ్రమంలో ఉండే ఏ ఒక్క నూనె శాతం 20 శాతానికి తక్కువగా ఉండకూడదు. అయితే ఆవాల నూనెకు కొన్ని ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. అదనంగా చియా లేదా ఫ్లాక్స్‌సీడ్ వంటి మూడో నూనెను మొత్తం మిశ్రమంలో 5 శాతం వరకు చేర్చేందుకు అనుమతి ఉంది.



నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏ ఒక్క వంటనూనె కూడా అన్ని రకాల పోషక అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. కొన్ని నూనెల్లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉంటే, మరికొన్నింటిలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు లేదా యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఉదాహరణకు పామ్ ఒలీన్ అధిక ఉష్ణోగ్రతల వద్ద మంచి స్థిరత్వాన్ని అందిస్తే, రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఉండే ఫైటోస్టెరాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫ్లాక్స్‌సీడ్, పెరిల్లా సీడ్ ఆయిల్స్ ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలకు మంచి మూలాలు కాగా, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులను అందిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)సిఫారసుల ప్రకారం ఆహారంలో శాచురేటెడ్, మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వుల మధ్య సమతుల్యత ఉండటం అవసరం. అలాగే ఒమేగా-3, ఒమేగా-6 కొవ్వు ఆమ్లాల సరైన నిష్పత్తి కూడా ఆరోగ్యానికి కీలకమని నిపుణులు చెబుతున్నారు. నూనె మిశ్రమాలు ఈ సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయి.

## చెరకు రసాన్ని రోజూ తాగవచ్చా..

చెరకు రసంలో పొటాషియం, పాలీఫినాల్స్ వంటి కొన్ని పోషకాలు కూడా ఉంటాయి. పొటాషియం శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటానికి సహాయపడుతుంది. పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వేడి వాతావరణంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడతాయి. అయితే చెరకు రసాన్ని ప్రతిరోజూ తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం చెరకు ముక్కలో ఉండే పీచు పదార్థం రసంలో చాలా తక్కువగా ఉంటుంది. అలాగే ఇందులో ప్రోటీన్ కూడా దాదాపు ఉండదు. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. రక్తంలో చక్కెర వేగంగా పెరగడం వల్ల కొంతసేపు అధిక శక్తి లభించినట్లు అనిపించినా, ఆ తర్వాత శక్తి స్థాయి అకస్మాత్తుగా తగ్గిపోతుంది. దీంతో అలసట, నిద్రమత్తు, బద్ధకం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్, మధుమేహం లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలతో బాధపడుతున్న వారు చెరకు రసాన్ని తరచూ తీసుకోవడాన్ని నివారించడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం చూపిస్తుంది. చెరకు రసం విషయంలో మరో ముఖ్యమైన అంశం పరిశుభ్రత. రసం కంటే దానిని తయారు చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండటం మరింత ముఖ్యం. పరిశుభ్రత లేని ప్రాంతాల్లో తయారయ్యే రసంలో సూక్ష్మజీవులు చేరి ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల చెరకు రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దానిని రోజువారీ ఆరోగ్య



పానీయంగా కాకుండా అప్పుడప్పుడు తీసుకునే వేసవి శీతల పానీయంగా భావించడం మంచిది. పరిమిత మోతాదులో, పరిశుభ్రమైన ప్రదేశాల్లో తయారైన చెరకు రసాన్ని తీసుకుంటే దాని రుచి, తాజాదనాన్ని ఆస్వాదించడంతోపాటు ఆరోగ్యపరమైన ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## ప్రొఫీ తాగారా?

బరువు తగ్గాలి, హార్మోనుల్లో సమతుల్యత, మెటబాలిజం మెరుగ్గా పనిచేయాలి... కారణాలేవైతేనేం, ప్రొటీన్ తీసుకోవడంపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు అమ్మాయిలు. అందుకు వాళ్లకి కనిపిస్తున్న తేలికైన మార్గం ప్రొటీన్ పౌడర్. చాలావరకూ దీన్ని ఉదయం తీసుకోవడానికి మొగ్గు చూపేవారే ఎక్కువ. కానీ మనలో చాలామందికి ఉదయాన్నే టీనో కాఫీనో తీసుకోనిదే ఏమీ తోచదు. మరెలా? అందుకే, ఫిట్‌నెస్



లవర్స్ దీనికి పరిష్కారంగా ఓ ట్రెండ్‌ని తీసుకొచ్చారు. అదే ప్రొఫీ! అంటే ప్రొటీన్+ కాఫీ. కాఫీలో ప్రొటీన్ పౌడర్ కలుపుకోవడం లేదా ప్రొటీన్ షేక్‌కి కాఫీ జత చేసుకోవడం అన్నమాట. కెఫీన్ చురుగ్గా చేసి, ఏకాగ్రత పెరిగేలా చేస్తే... ప్రొటీన్ చాలాసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. చురుకుదనానికి ఆరోగ్యం జత అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. క్విక్ బ్రేక్‌ఫాస్ట్‌గా, వ్యాయామం, అల్పాహారం తరవాత స్నాక్‌గా... ఇలా నచ్చినట్టుగా తీసుకుంటున్నారు. అయితే ఇది బరువు తగ్గించే పానీయం కాదు. ఆకలిని మాత్రం అదుపు చేయగలదు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్‌ని భర్తీ చేయగలదు. అంతేకానీ, పోషకాహారానికి ప్రత్యామ్నాయం మాత్రం కాదు అంటున్నారు నిపుణులు. మంచిది కదా అని కృత్రిమ చక్కెరలున్న ప్రొటీన్ పౌడర్‌లు తీసుకోవడం, ఎక్కువసార్లు తాగడమూ మంచిది కాదు. అదనపు చక్కెరలు శరీరానికి చేరతాయి. కెఫీన్ ఎక్కువైతే నిద్రకు సమస్య. కాబట్టి, ఒకటి రెండుసార్లకు మించి తీసుకోవద్దు అనీ చెబుతున్నారు. మరి మీరు ప్రయత్నించారా ఈ ప్రొఫీ?




## భారత పసిడి దిగుమతులు 70%తగ్గాయ్



కస్టమ్స్ సుంకాన్ని పెంచాక, మనదేశంలోకి బంగారం దిగుమతులు సుమారు 70% తగ్గి 25–30 టన్నులకు పరిమితమయ్యాయి. మే 13 నుంచి పసిడి, వెండిపై దిగుమతి సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. 'దిగుమతి సుంకం పెంపు తర్వాత, నెల రోజుల వ్యవధిలో పసిడి దిగుమతులు 25–30 టన్నులకు తగ్గాయి. అంతకు ముందు ఇవి 75–100 టన్నులుగా ఉన్నాయ'ని ఓ అధికారి తెలిపారు. అయితే భారత పసిడి దిగుమతుల విలువ మాత్రం 34% పెరిగి 3ల.41 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

# మార్కెట్లకు ఐటి షాక్.. నష్టాలతో ముగిసిన సూచీలు

దేశీయ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. గత ఐదు సెషన్లలో లాభాలను ఆర్జించిన సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. టెక్ దిగ్గజం యాక్సెంచర్ ఆందోళనలు దేశీయ ఐటీ షేర్లను కుదిపేశాయి. దీంతో మార్కెట్లు పతనమయ్యాయి. చివర్లో కాస్త కొనుగోళ్లు జరిగినా.. సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 600 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కష్టంగా నిలబెట్టుకుంది. ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆరంభం నుంచే సూచీలు ఢీలా పడ్డాయి. 76,852.86 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ (Sensex) ఒక దశలో ఏకంగా 940 పాయింట్లు దిగజారి 76,649 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. సెషన్ చివర్లో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టం కొంత తగ్గింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 607.08 పాయింట్లు పతనమై



76,802.90 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ (Nifty) కూడా 26,373.20 – 24,047.20 మధ్య కదలాడింది. చివరకు 154.90 పాయింట్లు తగ్గి 24,013.10 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది. అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాక్సెంచర్ తన ఆదాయ వృద్ధి అంచనాలను తగ్గించడంతో పాటు భవిష్యత్తులో డిమాండ్ బలహీనంగా ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈ రంగంపై ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల షేర్లు భారీగా కుదేలయ్యాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 6.75శాతం, టీసీఎస్ 3.55శాతం, టెక్ మహీంద్రా 2.63శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.59శాతం మేర కుంగాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, నెస్లే షేర్లు రాణించాయి.

# స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ములు తగ్గాయ్

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ములు 2025లో 8% తగ్గి 3.25 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ.36,793 కోట్ల)కు చేరాయి. స్థానిక శాఖలు, ఇతర ఆర్థిక సంస్థల దగ్గర భారతీయులు ఉంచిన నిధులు తగ్గినట్లు స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ గురువారం తెలిపింది. 2024లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నిధులు, 2023 కంటే 3 రెట్లు పెరిగి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా ఉన్నాయి. 2021లో ఈ నిధులు గరిష్ఠంగా 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత, సంస్థాగత క్లయింట్‌ల ఖాతాల డిపాజిట్లు మాత్రం 50% పెరిగి 524 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ.6,000 కోట్ల)కు చేరాయి. మొత్తం నిధుల్లో ఇవి 16 శాతానికి సమానం. ఇతర బ్యాంకుల ద్వారా ఉన్న నిధుల విలువ 15% తగ్గి 2.6 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా నమోదైంది. బాండ్లు, సెక్యూరిటీల నిధులు 135 మి.స్విస్ ఫ్రాంక్‌ల నుంచి 105 మి.స్విస్ ఫ్రాంక్‌లకు తగ్గాయి. ట్రస్టులు / ఫిద్యుషియరీల నిధులు 41 మి.స్విస్ ఫ్రాంక్‌ల నుంచి 55% తగ్గి 18.6 మి.స్విస్ ఫ్రాంక్‌లకు పరిమితమయ్యాయి. ఇది నల్లధనం కాదు: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, భారతీయ



బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు అధికారికంగా ఉంచిన నిధులు కావడంతో.. ఇవి రాజకీయంగా ఎంతో చర్చనీయాంశంగా ఉన్న నల్లధనం మొత్తాన్నిసూచించవు. ఎన్ఆర్ఐలు, ఇతరభారతీయులు, థర్ కంట్రీ ఎంటిటీస్ పేర్లతో స్విస్ బ్యాంకుల్లో దాచే నిధులు ఈ లెక్కల్లోకీ రావు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్ మిస్త్రీకి గడువు పొడిగింపు



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్‌గా కేకి మిస్త్రీ పదవీకాలాన్ని సెప్టెంబరు 18 వరకు పొడిగిస్తూ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయం తీసుకుంది. ఈయన పదవీకాలం జూన్ 18తో ముగిసిన నేపథ్యంలో, పొడిగించాలని ఆర్‌బీఐని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కోరగా, అంగీకారం లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవి నుంచి మార్చి 17న అతాను చక్రవర్తి వైదొలిగాక, 18న మిస్త్రీని బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్‌గా 90 రోజులకు నియమించారు. ఈ గడువు పూర్తికావడంతో, తాజా అనుమతి అవసరమైంది. మరో 3 నెలలు లేదా నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన నియమితులయ్యే వరకు మిస్త్రీ కొనసాగడానికి ఆర్‌బీఐ అనుమతించింది. ఆగస్టు 5న ఏజీఎం: బ్యాంక్ వాటాదార్ల వార్షిక సమావేశాన్ని (ఏజీఎం) ఆగస్టు 5న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిర్వహించనుంది. గత ఆర్థిక సంవత్సరానికి డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించిన రూ.13 డివిడెండును ఏజీఎం ఆమోదించాల్సి ఉంది. ఈ నెలా ఖరు కల్లా పూర్తి నియామకాలు, పారితోషికాల కమిటీ ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ పదవి కోసం కొన్ని పేర్లను సిఫారసు చేసిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొత్త ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి కావచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఛైర్మన్ పదవి నుంచి మార్చి 17న అతాను చక్రవర్తి వైదొలిగిన నెలతర్వాత అంటే ఏప్రిల్ చివర్లో నూతన ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ అధికారికంగా మొదలైందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. బ్యాంకు, దాని అనుబంధ సంస్థలతో మిస్త్రీకి ఉన్న సుదీర్ఘ అనుభవం దృష్ట్యా, ఛైర్మన్ పదవికి సంబంధించి ఆయనను 'స్వతంత్ర' వ్యక్తిగా పరిగణించలేమని ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ఓ వ్యక్తి తెలిపారు. అందుకే ఛైర్మన్ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ బోర్డును ఆర్‌బీఐ కోరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు సంబంధించి పలు నిర్ణయాలు బోర్డు ఆమోదం కోసం వేచి ఉన్నాయి. బ్యాంకు ఎండీ, సీఈఓ శశిధర్‌జగదీశన్ పదవీకాలాన్ని మరో మూడేళ్లు పొడిగించే కీలక నిర్ణయమూ వీటిల్లో ఒకటి.

## ఓపెన్ మార్కెట్ ద్వారా షేర్ల బైబ్యాక్

బహిరంగ విపణి (ఓపెన్ మార్కెట్) నుంచే షేర్లను కంపెనీలు తిరిగి కొనుగోలు చేసే (బైబ్యాక్) సదుపాయాన్ని మళ్లీ తీసుకొచ్చే యోచనలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనతో పాటు ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్ మెంట్స్ ఫండ్ (ఏఐఎఫ్) పథకాల ప్రారంభానికి వేగవంతంగా అనుమతులు, మ్యూచువల్ ఫండ్‌ల కోసం ఇంట్రాడే రుణ నిబంధనలను సడలించడం లాంటి పలు అంశాలపై చర్చించేందుకు సెబీ బోర్డు శుక్రవారం సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. కేపిటల్ మార్కెట్ల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్యలను చేపట్టే అవకాశం కనిపిస్తోంది. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ షేర్ బైబ్యాక్ లను తిరిగి ప్రవేశపెట్టడం, వాటి అమలు కాలపరిమితిని తగ్గించడం సెబీ బోర్డు ముందున్న కీలక ప్రతిపాదనల్లో ఒకటి. సాధారణంగా బైబ్యాక్ ప్రక్రియలో కంపెనీ నిర్దేశిత ధర వద్ద, ప్రస్తుత వాటాదార్ల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుం టుంది. కానీ ఓపెన్ మార్కెట్‌బైబ్యాక్‌లో, సెకండరీమార్కెట్లో ఆరోజు ఉన్న ధర వద్ద షేర్లను కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ఆఫర్ ప్రారంభమైన తేదీ నుంచి 66 పని దినాల్లోపే స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను పూర్తి చేయాలన్నది సెబీ ప్రతిపాదన.

# రిలయన్స్ జియో ఐపీఓ..

మదుపరులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న 'జియో ఐపీఓ'పై కీలక ప్రకటన వచ్చేసింది. ఈ ఐపీఓకు (Jio IPO) సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు ఆమోదించింది. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ (Mukesh Ambani) వెల్లడించారు. ఈ ముసాయిదా పత్రాలను శుక్రవారమే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించనున్నట్లు తెలిపారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ముకేశ్ అంబానీ వాటాదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జియో ఐపీఓ గురించి మాట్లాడుతూ.. ''ఇది నాతో పాటు రిలయన్స్ కుటుంబానికి, కోట్లాది మంది వాటాదారులకు భావోద్వేగభరిత క్షణం. జియో ఐపీఓకు సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను బోర్డు ఆమోదించింది. ఈ రోజే సెబీకి సమర్పిస్తాం. ఈ ఏడాది రిలయన్స్ (Reliance Industries)కు జియో ఐపీఓ అత్యంత ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఇది మా వాటాదారులకు గణనీయమైన విలువను అందించడంతో పాటు కొత్త పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తుందని విశ్వసిస్తున్నా. ప్రపంచ స్థాయి సామర్థ్యం కలిగిన సాంకేతిక సంస్థలను భారత్ నిర్మించగలదని జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుంది'' అని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

ఈ ఐపీఓ గురించి రిలయన్స్ కూడా స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్స్‌లో వెల్లడించింది. రూ.10 రూపాయల



ముఖ విలువతో 27 కోట్ల ఈక్విటీ షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపింది. ఇష్యూ ధరను బుక్ బిల్డింగ్ ప్రాసెస్‌లో నిర్ణయించనున్నట్లు పేర్కొంది.

ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36– 40 వేల కోట్లు) మేర మార్కెట్ నుంచి సమీకరించనున్నారు.

గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని అప్పట్లో తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడం వంటి పరిణామాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది.




## అక్షర 306 నాటౌట్



యువ కెరటం వైభవ్ సూర్యవంశీ వచ్చిన బిహార్ రాష్ట్రం నుంచి మరో బ్యాటింగ్ తార వెలుగులోకి వచ్చింది. బిహార్ క్రికెట్ సంఘం అండర్–19 వన్డే టోర్నీలో అక్షర (306 నాటౌట్; 126 బంతుల్లో 55×4, 8×6) అజేయ ట్రిపుల్ సెంచరీతో సంచలనం సృష్టించింది. 240పైన స్ట్రైక్‌రేట్ తో ఆడిన అక్షర.. 16 బంతుల్లో అర్ధసెంచరీ, 34 బంతుల్లో సెంచరీ సాధించింది. తూర్పు చంపారన్‌లోని రక్సుల్‌కు చెందిన 15 ఏళ్ల అక్షర.. బిహార్ అండర్–19 జట్టుకు కెప్టెన్. మహిళల దేశవాళీ క్రికెట్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు ముంబయి బ్యాటర్ ఇరా జాదవ్ (346 నాటౌట్, 2025లో మేఘాలయపై) పేరిట ఉంది.

# అఫ్గాన్‌తో మూడో వన్డేకు హర్షిత్ రాణా..



మోకాలి గాయం కారణంగా ఐపీఎల్ 2026 సీజన్ నుంచి వైదొలిగిన హర్షిత్ రాణా కోలుకున్నాడు. అఫ్గానిస్థాన్‌తో మూడో వన్డే కోసం స్క్వాడ్‌లోకి హర్షిత్ రాణాను టీమ్ఇండియా తీసుకుంది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను 2–0 తేడాతో భారత్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హర్షిత్ రాణాను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారింది. దాదాపు రెండు నెలలపాటు అతడు ఆటకు దూరంగా ఉన్నాడు.

అఫ్గానిస్థాన్‌తో మూడో వన్డేను భారత్ చెపాక్ వేదికగా శనివారం ఆడనుంది. ఈ మ్యాచ్‌లో హర్షిత్ రాణాను మేనేజ్‌మెంట్ ఆడించడం ఖాయమే. ఇది ముగిసిన తర్వాత నేరుగా టీమ్ఇండియా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లను ఆడేందుకు వెళ్లనుంది. ఈ రెండు సిరీస్‌లకు హర్షిత్ రాణా ఎంపికైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. అందుకే, సిరీస్ ఫలితంతో సంబంధం లేని అఫ్గాన్‌తో మూడో వన్డే బరిలోకి దిగనున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌కు అలవాటు పడేందుకు ఇది ఉపయోగపడనుంది. ప్రస్తుతం భారత్ జట్టుకు హార్దిక్ పాండ్య, నితీశ్‌కుమార్ రెడ్డి పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లుగా ఉన్నారు. ఇందులో హార్దిక్ అన్ని ఫార్మాట్లలోనూ ఆడటం లేదు. నితీశ్ మాత్రం ఇప్పుడిప్పుడే ఎదుగుతూ ఉన్నాడు. ఈ క్రమంలో నితీశ్‌కు తోడుగా మరొక పేస్ -బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాల్సిన అవసరం భారత్ ముందుంది. అందులోభాగంగానే హర్షిత్ రాణాకు ఎక్కువగా అవకాశాలు వస్తున్నాయి. ఆఖర్లో బ్యాటింగ్ చేయగలనని రాణా కూడా ఇప్పటికే నిరూపించుకొన్నాడు. అయితే, అతడికి గాయాలు కావడం ఆందోళనకరంగా మారుతోంది.

## ప్రపంచ కప్ టోర్నీకి శ్రేయాంక దూరం..



ఐసీసీ మహిళల ప్రపంచ కప్‌లో వరుసగా రెండు మ్యాచుల్లో విజయంతో జోష్ మీదున్న భారత్‌కు షాక్ తగిలింది. మంచి ఫామ్‌లో ఉన్న ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ టోర్నీకి దూరమైంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడింది. దీంతో మ్యాచ్ మధ్యలోనే ఆమె మైదానాన్ని వీడింది. చీలమండకు గాయం ఎక్కువవడంతో టోర్నీ నుంచే వైదొలిగినట్లు బీసీసీఐ పేర్కొంది. శ్రేయాంక పాటిల్ స్థానంలో మరొక స్పిన్నర్‌ను భారత్ తీసుకుంది. లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్‌కు స్క్వాడ్‌లో అవకాశం కల్పించింది. దీనికి వరల్డ్ కప్ టెక్నికల్ కమిటీ కూడా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రేమా రావత్ ఇంగ్లాండ్‌లోనే భారత్ A జట్టుతో పాటు ఉంది. దీంతో ఆమె నేరుగా సీనియర్ టీమ్‌తో కలవనుంది. ''ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2026 ఈవెంట్ టెక్నికల్ కమిటీ ఆమోదం మేరకు శ్రేయాంకా పాటిల్ ప్లేస్‌ను ప్రేమా రావత్ భర్తీ చేయనుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్ సమయంలో శ్రేయాంక గాయపడింది. దీంతో ఆమె ఈ టోర్నీకి దూరమైంది'' అని ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. లీగ్ స్టేజ్‌లో భారత్ ఇప్పటికే రెండు మ్యాచులు ఆడేసింది. పాక్, నెదర్లాండ్స్‌పై విజయంతో గ్రూప్ Aలో ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది. రాబోయే మూడు మ్యాచులు అత్యంత కీలకం. జూన్ 21న దక్షిణాఫ్రికా, జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో టీమ్ఇండియా తలపడనుంది. ఇందులో కనీసం రెండు గెలిచినా.. టాప్ ప్లేస్‌తో సెమీస్‌కు చేరుకొనే అవకాశం ఉంది.

## మోడీ జీ.. మీరు జోక్యం చేసుకోండి: మనికా బాత్రా పోస్టు వైరల్

ఆసియా గేమ్స్ ఎంపికపై టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బాత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జపాన్ వేదికగా మరికొద్ది రోజుల్లో ఆసియా గేమ్స్ జరగనున్నాయి.



ఇందులో పాల్గొనే అథ్లెట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, టేబుల్ టెన్నిస్ జట్టులో మనికా బాత్రాకు చోటు దక్కలేదు. దీంతో ఎంపిక విధానం పారదర్శకంగా లేదని.. ప్రధాని నరేంద్ర మోదీ, క్రీడాశాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవాలని సోషల్ మీడియా వేదికగా మనికా పోస్టు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'ఆసియా క్రీడలకు నేను ఎంపిక కాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే, నన్ను సెలక్ట్ చేయకపోవడానికిగల కారణాలను ఫెడరేషన్ తెలియజేయలేదు. ఇప్పుడు నా విషయంలో.. గత ఎంపిక ప్రక్రియలో వేర్వేరు ప్రమాణాలు, అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అనిపిస్తోంది. దీనివల్ల ఈ విధానం స్థిరత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఆసియా క్రీడల ఎంపిక నిబంధనలే వర్తించాల్సి ఉంటే.. ఇప్పుడు ఎలా అన్వయించారనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది'' అని పోస్టు పెట్టిన మనికా.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవీయను ట్యాగ్ చేసింది.

వ్యక్తిగత విభాగంలో మనికా బాత్రా భారత్ తరఫున రెండో అత్యుత్తమ ర్యాంకర్. 31ఏళ్ల మనికా గత ఒలింపిక్స్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈసారి ఆసియా గేమ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

# వైభవ్ సూర్యవంశీ రాణిస్తే టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ కళ: క్రిష్ శ్రీకాంత్

ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్. ఐపీఎల్‌లో అదరగొట్టడంతో టీమ్ఇండియాకు ఎంపికయ్యాడు. దీంతో అతడిపై అభిమానులకు భారీ అంచనాలే ఏర్పడ్డాయి. ప్రస్తుతం వైభవ్ ఇండియా A జట్టు తరఫున ఆడుతూ శ్రీలంకలో ఉన్నాడు. ముక్కోణపు సిరీస్ ముగిశాక.. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఉంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తోనూ పొట్టి ఫార్మాట్‌లో ఐదు మ్యాచులను భారత్ ఆడనుంది. అయితే, అతడిని మరీ ఎక్కువగా విశ్లేషిస్తూ ఒత్తిడికి గురిచేయొద్దని టీమ్ఇండియా మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ క్రీడా పండితులు, అభిమానులకు సూచించాడు. వైభవ్ ఇలానే టెస్టుల్లోనూ రాణిస్తే.. సుదీర్ఘ ఫార్మాట్‌కు మళ్లీ కళ వస్తుందని అభిప్రాయపడ్డాడు. ''పరుగులు సాధించాలని అనుకోవడంతోపాటు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలనే బలమైన ఆకాంక్ష ఉండటమే వైభవ్ సూర్యవంశీలో నాకు నచ్చే అంశం. క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడగల సామర్థ్యం కూడా అతడి సొంతం. టీ20 క్రికెట్ నుంచి వన్డేలకు.. ఆ తర్వాత టెస్టుల్లో వృద్ధి చెందితే మాత్రం సుదీర్ఘ ఫార్మాట్‌కు అద్భుతమైన



కళ తీసుకురాగలడు. టెస్టు క్రికెట్ పునరుజ్జీవనంలో ఇలాంటి కుర్రాళ్లదే కీలక పాత్ర. వైభవ్ సూర్యవంశీ ఆటను చూసేందుకు అభిమానులు టీవీ ఆన్ చేస్తున్నారు. ఫ్యాన్స్‌ను ఆకర్షించే సత్తా అతడికి సహజంగానే వచ్చింది. అయితే, వైభవ్ గురించి మరీ ఎక్కువగా విశ్లేషణలు చేసి.. అనవసర ఒత్తిడికి గురి చేయొద్దు. అతడు సహజసిద్ధమైన గేమ్‌ను ఆడేలా చూడాలి. ఒక్క సిరీస్‌లో ఏదైనా సరిగ్గా ఆడలేకపోతే వెంటనే సదరు ప్లేయర్‌ను జడ్జ్ చేయొద్దు. కాస్త సమయం ఇవ్వాలి. తొలిసారి ఆడిన ఐపీఎల్‌లోనే అదరగొట్టాడు. ఇక ఇటీవల సీజన్‌లో చాలా అవార్డులను సొంతం చేసుకున్నాడు'' అని క్రిష్ తెలిపాడు. ''ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం రాకపోయినా ఫర్వాలేదు. రిజర్వ్ బెంచ్‌లో ఉండనివ్వండి. అతడికి అంతర్జాతీయ క్రికెట్ ఎలా ఉంటుందో అర్థం చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది. సంజు శాంసన్ – అభిషేక్ శర్మ ఓపెనర్లుగా వస్తే వైభవ్‌కు ప్లేస్ దొరకడం కష్టమే అవుతుంది. అంతకుముందు ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత్ ఆడనుంది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## అంధ విద్యార్థుల మధ్య 61వ వివాహ దినోత్సవాన్ని జరుపుకున్న మురళీమోహన్

**వుదయం సినిమా** ప్రముఖ నటులు , నిర్మాత మురళీమోహన్ తన 61 వ వివాహ వార్షికోత్సవాన్ని హైదరాబాద్ బేగంపేటలోని "దేవనార్ బ్లైండ్ స్కూల్ "లో అంద విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. తన మరియు తన కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలను లేదా వివాహ వార్షికోత్సవాలను దేవనార్ బ్లైండ్ స్కూల్లో అంధ విద్యార్థుల మధ్య జరుపుకునే ఆనవాయితీని ప్రతి సంవత్సరము పాటిస్తుంటారు మురళీమోహన్. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ రోజు దేవనార్ బ్లైండ్ స్కూల్లోని అంధ విద్యార్థుల సమక్షంలో తన 61వ వివాహ దిన మహోత్సవాన్ని జరుపుకున్నారు మురళీమోహన్.





## సంగీత ప్రియుల 'విశ్వనాథ్ & సన్స్'

**వుదయం:** సూర్య అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ & సన్స్'. బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈచిత్రం నుంచి తొలిగీతంగా 'నేనో బటర్‌ఫ్లై' ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. 'నేనో బటర్‌ఫ్లై' గీతం ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. మధురమైన ట్యూన్ తో సరికొత్త అనుభూతిని అందిస్తున్న ఈ గీతం, విన్న తక్షణమే ప్రేక్షకుల హృదయాలను దోచుకుంటోంది. ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమ గీతాలలో ఒకటిగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం వస్తున్న స్పందనను బట్టి చూస్తే, రాబోయే రోజుల్లో ఈ పాట సంగీత ప్రియుల ప్లేలిస్టుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.సినిమాలో కథానాయకుడు సూర్యను ఉద్దేశించి, నాయిక మమిత బైజు పాడుకునే ఈ 'నేనో బటర్‌ఫ్లై' గీతం వినసొంపుగా ఉంది. యువత మనసు దోచుకునేలా ఎంతో అందంగా జి.వి. ప్రకాష్ ఈ గీతాన్ని స్వరపరిచారు. మెలోడీల విషయానికి వస్తే జి.వి. ప్రకాష్ కుమార్ ఎప్పుడూ నిరాశపరచరు.

## #NBK111 నుంచి కాజల్ అగర్వాల్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్

**వుదయం:** 'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ దర్శకుడు గోపీచంద్ మలినేనితో కలిసి అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ యాక్షన్ చిత్రం #NBK111 కోసం మరోసారి జతకట్టారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, యాక్షన్, ఎమోషన్స్, అద్భుతమైన సన్నివేశాల కలయికతో ప్రేక్షకులను అలరించనుంది. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం 'ఎంట్రీ ఆఫ్ యాన్ ఎరా' పేరుతో ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది, ఇది సినిమాలోని ఇంటెన్స్ వరల్డ్, బాలయ్య పవర్ ఫుల్ ప్రజెన్స్ ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్లింప్స్ కు వచ్చిన అద్భుతమైన స్పందన తర్వాత, #NBK111 చిత్ర బృందం ఇప్పుడు కీలక పాత్రలో కనిపించనున్న కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు . ఆమె పుట్టినరోజు సందర్భంగా, ఇంపాక్ట్ ఫుల్ పాత్రను సూచించే 'ఫస్ట్ లుక్' పోస్టర్‌ను రివిల్ చేశారు. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఎంతో హుందాగా కనిపిస్తున్నారు.చెక్స్ చీరలో, కళ్లజోడుతో కనిపించిన ఆమె లుక్ ఆకట్టుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయ వాతావరణంలో ఫైళ్లు, అధికారిక పత్రాల మధ్య కూర్చున్న కాజల్ పాత్ర కథలో కీలక ప్రాధాన్యతని చూపిస్తోంది. ఆమె చూపుల్లో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం పాత్ర ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయి.



## 'జిగితార..'తో రాబోతున్న "చెన్నై లవ్ స్టోరీ" మూవీ



**వుదయం:** హీరో కిరణ్ అబ్బవరం "చెన్నై లవ్ స్టోరీ" మూవీ నుంచి మరో సెన్సేషనల్ సాంగ్ రాబోతోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు సాంగ్స్ 'తొలి ప్రేమం తోపు కాదే..', 'వదలనే..' సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు మూడో పాట 'జిగితార..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 20న తిరుపతిలో గ్రాండ్ మ్యూజికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో ఈ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ లోని మ్యాజిక్ ను లైవ్ లో చూసేందుకు ఈ మ్యూజికల్ ఫెస్ట్ లో పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొనబోతున్నారు. ఈ నేపథ్యంలో "చెన్నై లవ్ స్టోరీ" మూవీ తిరుపతి మ్యూజికల్ ఫెస్ట్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది."చెన్నై లవ్ స్టోరీ" సినిమాలో శ్రీ గౌరి ప్రియ హీరోయిన్ నటిస్తోంది. "కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో ఈ సినిమా రూపొందుతోంది.

## #NN5 మూవీ హ్యూమరస్ క్రియేటివ్ పోస్టర్ ద్వారా అనౌన్స్‌మెంట్

**వుదయం:** రైజింగ్ యంగ్ స్టార్ నార్నే నితిన్ 'మ్యాడ్', 'ఆయ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి వరుస విజయాల తర్వాత తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధా కృష్ణతో సరికొత్త రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. #NN5 చిత్రాన్ని ప్రతిష్టాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. పలు చిత్ర పరిశ్రమలలోని ప్రముఖ తారలతో భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్లను నిర్మించడంలో పేరుగాంచిన కేవీఎన్ ప్రొడక్షన్స్, ప్రస్తుతం దర్శకుడు బాబీ కొల్లితో మెగాస్టార్ చిరంజీవి చేయబోయే చిత్రంతో సహా అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మిస్తోంది. ఈ బ్యానర్ #NN5 చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించడానికి సిద్ధమవుతోంది.నార్నే నితిన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ వినూత్నంగా ఆకట్టుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్ పోస్టు తరహాలో డిజైన్ చేసిన ఈ పోస్టర్ యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌ను అందిస్తోంది. నీలాకాశం నేపథ్యంగా ఓ భవనం అంచున టీ-షర్ట్, జీన్స్, స్నీకర్స్‌లో కూల్‌గా కూర్చున్న నార్నే నితిన్ కనిపిస్తుండగా, ఎరుపు రంగు డ్రెస్‌లో ఉన్న ఓ యువతి పోస్టులోని హార్ట్ ఐకాన్‌ను ట్యాప్ చేయబోతున్నట్లు చూపించారు."ఆకాశంలో ఉంటుంది మూన్... నువ్వే నా లైఫ్‌కి క్వీన్..." అనే ఫన్నీ లైన్‌తో పాటు వేలాది లైక్స్, కామెంట్స్, ట్రెండీ హ్యాష్‌ట్యాగ్స్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాకుండా నార్నే నితిన్ బావ, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఈ పోస్టును లైక్ చేసినట్లు చూపించడం అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. పోస్టర్ ద్వారా చిత్రంలోని రొమాన్స్, వినోదం మాత్రమే కాకుండా మేకర్స్ క్రియేటివ్ ఆలోచన కూడా స్పష్టమవుతోంది.



## "గాసిప్" చిత్రం నుంచి తొలి గీతం "సిప్పు సిప్పు" రిలీజ్



**వుదయం:** మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'గాసిప్ . నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్ గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన సిప్పు సిప్పు సాంగ్ ప్రోమోకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేస్తూ ఈ సినిమా నుంచి సిప్పు సిప్పు ఫుల్ లిరికల్ సాంగ్ ని ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. శక్తి కాంత్ కార్తీక్ స్వరపరిచిన ఈ ఎనర్జెటిక్ పబ్ డాన్స్ ట్రాక్‌కు కాసర్ల శ్యామ్ అందమైన సాహిత్యాన్ని అందించగా సింగర్ మాళవిక వోకల్స్ తో పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.సోషల్ సెటైర్ గా చిత్రీకరించిన "గాసిప్" అనే సినిమాలో మొదటి సాంగ్ గా సిప్పు సిప్పు అనే సాంగ్ వస్తుంది. గాసిప్ అనే ఈ సినిమా ఒక మిడిల్ క్లాసు అమ్మాయి చుట్టూ తిరిగే కథతో యూత్ కు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తీర్చితిద్దుతున్నారు. ఈ పాట చాలా ఫ్రెష్ గా ఉండడంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సునీల్ సున్నపు మాస్టర్, ఫల్గుణి బంగెర కొరియోగ్రఫీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## 'మారెమ్మ' జూలై లో రిలీజ్



**వుదయం:** మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్-డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా రిలీజ్ టైం పై అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం 2026 జూలై లో రిలీజ్ కానుంది.ఈసారి బోనాల జాతర థియేటర్లలో దుమ్ములేపబోతున్నాయ్ అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ డివైన్ వైబ్ తో అందరినీ ఆకట్టుకుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు.తారాగణం: మాధవ్, దీపా బాలు, వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి, V.S.రూపా లక్ష్మి .

## "బాలన్ - ది బాయ్" మర్చిపోలేని ఫీల్ ను కలిగించింది

**వుదయం:** పాన్ ఇండియా స్థాయిలో "బాలన్ - ది బాయ్" సినిమా పలువురు సెలబ్రిటీల ప్రశంసలు దక్కించుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ ఇలాంటి సినిమా గత రెండేళ్లలో రాలేదని అభినందించగా..ఇప్పుడు హీరో నాగచైతన్య "బాలన్ - ది బాయ్" సినిమాను అప్రిషియేట్ చేశారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ఆ మూవీ ఫీల్ లోనే ఉండిపోయానని, "బాలన్ - ది బాయ్" సినిమా మర్చిపోలేని అనుభూతికి గురిచేసిందని అన్నారు. నాగచైతన్య ప్రశంసలతో మూవీ లవర్స్ లో ఈ సినిమాపై మరింతగా అంచనాలు పెరుగుతున్నాయి."బాలన్ - ది బాయ్" సినిమా చూసిన తర్వాత నాగచైతన్య స్పందిస్తూ - ఈ సినిమా సరికొత్త కథ, ఆశ్చర్యపరిచే కథనం, చూపు తిప్పుకోలేని చిత్రీకరణతో ఆకట్టుకుంది. ప్రతి సీన్ ఊహకు అందకుండా సాగుతూ ఆశ్చర్యపరిచింది. ఎండ్ టైటిల్స్ తర్వాత కూడా నేను అదే ఫీల్ లో ఉండిపోయాను. ఈ సినిమా ఇచ్చిన అనుభూతి నుంచి బయటకురాలేకపోయా. జితూ మాధవన్ స్క్రిప్ట్ ఇంప్రెస్ చేసింది. ఆయన "మంజుమ్మెల్ బాయ్స్", "ఆవేశం" సినిమాల్లాగే ఈ చిత్రాన్ని కూడా తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తారు. అన్నారు.గ్రాండియర్ ఫిలిం మేకింగ్ కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా "బాలన్ - ది బాయ్" సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి "ఆవేశం" ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. "బాలన్ - ది బాయ్" సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది.




## "వెంకట్రామయ్య గారి తాలూకా" జులై లో విడుదల

**వుదయం:** దినేష్ కుమార్ హీరోగా, దివిజ ప్రభాకర్ (ఈటీవీ ప్రభాకర్ కుమార్తె) హీరోయిన్‌గా మురళీధర్ గౌడ్, సుధ టైటిల్ పాత్రలలో సతీష్ ఆవాల దర్శకత్వం లో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం "వెంకట్రామయ్య గారి తాలూకా" ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.ఈ చిత్ర నిర్మాత కోమలి మాట్లాడుతూ... నేను కోమలి ఫోక్ సింగర్ గా నా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టం తో నేను సినిమా తీయాలి అని ఒక ద్యేయం తో చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రాన్ని పూర్తి చేసాము. ఈ సినిమా మొదలయినప్పటి నుండి ఇప్పటివరకు నేను పడిన కష్టం పడిన మాటలు కంటినిండా నిద్ర కూడా పట్టేది కాదు అన్ని కష్టాలు ఎదుర్కొని జులై లో మూవీ విడుదల చెయ్యడానికి రెడీ చేస్తున్నాము.మా సినిమాకి మీడియా సపోర్ట్ ఉండాలి అని కోరుకుంటున్నాను అని కోమలి తెలిపారు.దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ..మా "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేసి ఆపిషియల్ ప్రెస్ మీట్ పెట్టి అనౌన్స్ చేస్తాము. మా కథ విషయానికోస్తే అందమైన ఒక పల్లెటూరు లో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బు తో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలు గా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.